








# నేను కలిసిన ముఖ్యమంత్రులు












# నేను కలిసిన

# ముఖ్యమంత్రులు మానవవాదులు

నరిశెట్టి ఇన్నయ్య

మానవవాద ప్రచురణలు

హైదరాబాద్

Nenu kalisina

# *Mukhyamantrulu Manavavadulu*

© Author


| | | |
|---|---|---|
| First Edition | : | January 2011 |
| No. of copies | : | 1000 |
| Published by | : | N. Innaiah |
| Cover Design | : | Ramana Jeevi |
| Book Making | : | Sri Sri Graphics, Hyderabad. |
| Sole Distributors | : | Navodaya Book House,<br>Opp. Arya Samaj Mandir,<br>Badi Chowdi, Hyderabad. |
| Price | : | ₹ 100 |
| Printed at | : | Charita Impressions<br>Hyderabad. |

# విషయసూచిక

## ముఖ్యమంత్రులు


| | |
|---|---|
| రాజాజీ | 9 |
| టంగుటూరి ప్రకాశం పంతులు | 13 |
| బెజవాడ గోపాలరెడ్డి | 19 |
| నీలం సంజీవరెడ్డి | 23 |
| దామోదరం సంజీవయ్య | 27 |
| కాసు బ్రహ్మానందరెడ్డి | 31 |
| పి.వి.నరసింహారావు | 35 |
| జలగం వెంగళరావు | 41 |
| డా॥ మర్రి చెన్నారెడ్డి | 47 |
| అంజయ్య | 51 |
| భవనం వెంకట్రామ్ | 55 |
| కోట్ల విజయభాస్కర రెడ్డి | 61 |
| ఎన్.టి.రామారావు | 65 |
| నాదెండ్ల భాస్కరరావు | 71 |
| నేదురుమల్లి జనార్ధన రెడ్డి | 75 |
| నారా చంద్రబాబు నాయుడు | 79 |
| వై.ఎస్.రాజశేఖర రెడ్డి | 83 |
| కొణిజేటి రోశయ్య | 87 |

**మానవవాదులు**

ఎ.బి.షా. 87

శిబ్ నారాయణ్ రే 93

వి.ఎం. తార్కుండే 97

వి.బి.కార్నిక్ 101

ఎ.జి.కె. (ఆవుల గోపాలకృష్ణమూర్తి) 105

మణిబెన్ కారా 111

బసవ ప్రేమానంద్ 115

మల్లాది రామమూర్తి 119

ఎస్.రామనాథన్ 121

జి. డి. పరేఖ్ - ఇందుమతి పరేఖ్ 123

జెమ్స్ రాండి 127

సమరేన్ రాయ్ 135

జె.బి.హెచ్ వాడియా 137

సుశీల్ ముఖర్జీ 141

మరికొందరు మానవవాదులు 144


# ముఖ్యమంత్రులతో నా పరిచయం

**ఆం**ధ్ర ఏర్పడినప్పటినుండి, తొలి భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందిన తరువాత రాష్ట్ర రాజకీయాలలో ముఖ్యమంత్రి చాలా కీలకమైన స్థానాన్ని ఆక్రమించటం స్పష్టంగా కనిపిస్తున్నది. పైకి అధికార వికేంద్రీకరణ, ప్రజలకు పెత్తనం అని నినాదాలిచ్చినా, చట్టాలు చేసినా అవేవీ అమలులోకి రాలేదు. రాష్ట్రంలో అధికారం అంతా ముఖ్యమంత్రి చుట్టూ ప్రదక్షిణ చేస్తుండగా, కాంగ్రెస్ రాజకీయాలలో ముఖ్యమంత్రులు కేంద్ర నాయకత్వం చెప్పుచేతల్లో ఉంటున్నారు. అంత ప్రాధాన్యత సంతరించుకున్న ముఖ్యమంత్రుల గురించి వారితో గల కించిత్ పరిచయాల విషయాన్ని ప్రస్తావించటానికే ఈ రచన సాగింది. కొందరితో పైపైన, మరికొందరితో సుదీర్ఘంగా, ఇంకొందరితో సన్నిహితంగా ఈ పరిచయాలు ఏర్పడ్డాయి. అయితే రాజకీయ పార్టీలతో, ముఠా రాజకీయాలతో సంబంధంలేని ఈ పరిచయాలను తెలియచేయటమే ఈ రచన ఉద్దేశ్యం. ఇందులో వ్యక్తిత్వాలను, సంఘటనలను, ఆసక్తికర విషయాలను చెప్పే తీరు ఉంటుంది. ఇది ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న రాజాజీ, కురువృద్ధులు టంగుటూరి ప్రకాశంతో ప్రారంభమై కొణిజేటి రోశయ్యతో ఆగిపోతుంది. సాధ్యమైనంత వరకూ పరిశీలన రాగద్వేషాతీతంగా చేయడం ప్రధానోద్దేశ్యం.

\- ఇన్నయ్య

# రాజాజీ

**(సి. రాజగోపాలాచారి)**



**(18 78 - 1972 )**

నేను రాజాజీగారిని వారు మద్రాసు రాష్ట్రానికి రెండవసారి ముఖ్యమంత్రి అయినప్పుడు కలుసుకోలేకపోయాను. అయినప్పటికీ, వారు స్వతంత్ర పార్టీ ఏర్పాటు చేసిన చాలా కాలం తర్వాత నాకు వారితో కలిసి పనిచేసే భాగ్యం దక్కింది. రాష్ట్రం కమ్యూనిస్టుల హస్తగతం కాకుండా కాపాడడానికే రాజాజీ ముఖ్యమంత్రి కావడం జరిగింది. 1952లో దేశంలో జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలలో మద్రాసు అసెంబ్లీకి అత్యధిక సంఖ్యలో కమ్యూనిస్టులు ఎన్నిక కావడం జరిగింది. సహజంగానే వారు అధికారాన్ని చేపట్టాలని ఆశించారు. టంగుటూరి ప్రకాశంగారికి వారు ముఖ్యమంత్రి పదవిని ఆశ చూపడంవల్ల ఆయన వారికి తలొగ్గడానికి సుముఖంగా ఉన్నారు. ఎన్నికలలో ప్రకాశంగారు కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా పని చెయ్యటమే కాక ఆంధ్రప్రాంతంలోని అనేకమంది ప్రముఖ కాంగ్రెసు నేతల ఓటమికి కీలకపాత్ర వహించారు.

కాంగ్రెసు పార్టీలోని కేంద్ర నాయకత్వం, కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ప్రకాశంగారు మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయడాన్ని నిరోధించడానికి అన్ని శక్తులూ ఒడ్డి ప్రయత్నాలు చేసింది. దానికి రాజాజీ తగినంత బలాన్ని కూడగట్టుకుని, ప్రకాశంగారి నాయకత్వంలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాకుండా నిరోధించగలిగారు. ప్రొఫెసర్ ఎన్.జి.రంగా రాజాజీకి తమ పూర్తి మద్దతు నిచ్చారు. కృషికార్ లోక్ పార్టీ సభ్యులైన ప్రజాప్రతినిధుల (ఎమ్.ఎల్.ఎల) మద్దతు తోనే రాజాజీ ముఖ్యమంత్రి కాగలిగారు.

నేను విద్యార్థిగా ఉంటూనే రాజకీయ సమీకరణాలను అవగాహన చేసుకుంటూ ఉండేవాడిని. రాజాజీ, రంగాజీ ఇద్దరూ కాంగ్రెసు నుండి బయటకు వచ్చి 1958లో స్వతంత్ర పార్టీని స్థాపించారు. కొత్త పార్టీ పెట్టిన తర్వాత రాజాజీ, కొందరు ముఖ్య నేతలు 1958-59లో ఆంధ్రప్రాంతమంతా పర్యటించారు. ఆ యాత్ర బాపట్లలో మొదలై బొబ్బిలిలో ముగిసింది.

నేను రంగాగారి వద్ద పి.ఏ.గా చేరాను. నేను మెదక్ జిల్లాలోని సంగారెడ్డిలో వున్న మా సోదరి వద్ద ఉండగా పి.ఏ.గా చేరాలని కోరుతూ రంగాగారి వద్దనుండి కార్డు వచ్చింది. అది చూసి ఆశ్చర్యపడి తెనాలి వాస్తవ్యులు శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తిగారిని వారి సలహాకోసం సంప్రదించాను. శ్రీ ఆవుల గోపాలకృష్ణ

మూర్తిగారు జాతీయ నాయకులతోనూ, వారి వ్యవహారాలతోనూ పరిచయాలు పెంచుకునేందుకు ఇదొక గొప్ప అవకాశమని నొక్కి చెప్పారు. రంగాగారి పి.ఏ.గా ఉన్నా ప్రత్యక్షంగా రాజకీయాలలో నన్ను అతిగా కలిగించుకోవద్దని హితబోధ చేశారు.

నేను రంగాగారి నివాసస్థలమైన నిడుబ్రోలుకు వెళ్ళి ఉద్యోగంలో చేరాను. రంగాగారి సాహచర్యం రాజాజీగారిని కలుసుకునే అవకాశం కలిగించింది. రాజాజీని, మిగిలిన నాయకులను అనుసరిస్తూ బాపట్ల నుండి బొబ్బిలివరకూ భారీ ర్యాలీలను, అనేక బహిరంగ సభలను ప్రత్యక్షంగా చూశాను. ఆయా ప్రదేశాలకు ప్రయాణించేటపుడు అల్పాహార వేళల్లోనూ, భోజన విరామ సమయాల్లోనూ బసచేసిన అతిథి గృహాల్లో రాజాజీగారితో అనేక విషయాలపై ముచ్చటించే అవకాశం లభించింది.

పర్యటన మొదటి రోజునే రంగాగారు నన్ను రాజాజీగారికి పరిచయం చేయడంతో ఇతరులెవరూ మాట్లాడడానికి సాహసించని అనేక విషయాలను రాజాజీగారితో చర్చిస్తూ ఉండేవాడిని. రాజాజీ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా నేను ఈ టూరు ప్రోగ్రాం గురించి 'వాహిని' (రంగాగారి ఆధ్వర్యంతో నడిచే తెలుగు వారపత్రిక)కి రాస్తున్నానని చెప్పాను. ఆ పత్రిక ఈ పర్యటన గురించిన విశేషాలను విస్తృతంగా ప్రచురించింది.

కాకినాడలో మేము శ్రీ ఎమ్.వి.శాస్త్రిగారి ఇంట బసచేసినప్పుడు రాజాజీ చేతి రుమాలుతో కాఫీకప్పును పట్టుకుని వేడివేడి కాఫీ తాగుతున్నారు. నేను 'కాఫీకప్పును రుమాలుతో పట్టుకోవడం ఎందుకు?' అని వారిని అడిగాను. వారు కప్పు నా చేతికియిచ్చి పట్టుకోమన్నారు. అది చాలా వేడిగా ఉండడం చేత నేను పట్టుకోలేకపోయాను. అయితే దీనివల్ల రాజాజీ కప్పులోని కాఫీ పూర్తి చెయ్యడానికి ఏ ఆటంకమూ లేకపోయింది. అది చక్కెర లేని బ్లాక్ కాఫీ. అలవాటు లేనిదే ఆ కాఫీ రుచిని ఆస్వాదించలేమని రాజాజీ చెప్పారు. నాకు కూడా ఒక చిన్న కప్పు కాఫీ తెప్పించి యిచ్చారు, అది నాకు కషాయంలాగా తోచింది.

తర్వాత రాజాజీ తన స్వంత అనుభవాలు చెప్పసాగారు. బాపట్ల నుంచే అనేకమంది రాజాజీ ఉపన్యాసాలను ఆంగ్లం నుంచి తెలుగులోకి తర్జుమా

చెయ్యడానికి ప్రయత్నించసాగారు. వీరాచారి, విజయరాజకుమార్, ఉషశ్రీ, సుంకర సత్యనారాయణ మరికొద్దిమంది తర్జుమా చేయడంలో సఫలీకృతులు కాలేక పోయారు. రాజాజీగారి స్పష్టమైన సరళమైన, వ్యంగ్యోక్తులతో కూడి, హాస్యరస స్ఫోరకంగా ఉండే ప్రసంగాలను తర్జుమా చేయడం వారివల్ల కాలేదు. చివరకు గౌతు లచ్చన్నగారు మైకునందుకుని రాజాజీగారి ప్రసంగాలను తెలుగు నుడికారపు సొబగులతో అనువదించి కరతాళ ధ్వనులు మిన్నుముట్టేలా చేసి, అందరి ప్రశంసలనూ అందుకున్నారు. రాజాజీ వారిని అభినందించి ఇకపై తన ప్రసంగాలను అనువదించే పని వారినే చేయమని కోరారు. నేను బాపట్ల నుండి బొబ్బిలి వరకూ బెజవాడ రామచంద్రారెడ్డిగారి ఫియట్ కారులో ప్రయాణించాను. శ్రీ ఎస్.వి.పంతులుగారు కూడా మాతో రావడం జరిగింది.

రాజాజీతో సమయం గడపడం ఒక విశేషమైన అనుభవం. నేను ప్రతిదినం రిపోర్టును సక్రమంగా తయారుచేసి పంపానా లేదా అని ప్రతిరోజూ అడుగుతూ ఉండేవారు. రిపోర్టర్లు తమ రిపోర్టులో తమ స్వంత బాణీలను, స్వకపోల కల్పితాలను చేరుస్తూ ఉంటారని రాజాజీ అభిప్రాయపడ్డారు. నేను వారి ఉపన్యాసాలను, ప్రసంగాలను అర్థం చేసుకున్నాననీ ఆ ప్రకారంగానే రిపోర్టు సమర్పించాననీ చెప్పాను. బాపట్లలో ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి ఉపన్యాసం మీద తమ అభిప్రాయం చెప్పమని రాజాజీని అడిగాను. అది సహకార క్షేత్రాల ఏర్పాటుకు నెహ్రూ ప్రభుత్వం వ్యతిరేకించిన రాజ్యాంగం లోని 17వ అధికరణానికి సంబంధించిన విషయం. సభావేదిక పైనున్న రాజాజీ చప్పట్లు కొట్టి గోపాలకృష్ణగారి ప్రసంగం అద్భుతమని అభినందించి, ఆయన ఉపన్యాసం తరువాత తానేమీ మాట్లాడ నవసరం లేదని చెప్పారు. అదే గోపాలకృష్ణగారికి పెద్ద అభినందన.

నేను స్వతంత్ర పార్టీ రాజకీయాల్లో ఎప్పుడూ తలదూర్చలేదు. తర్వాత రెండు సంవత్సరాలకు రంగాగారి పి.ఎ.గా నేను విరమించుకున్నాను. ఆ కాలంలో రంగాగారివల్ల నేను, రాజాజీ, ఎం.ఆర్.మసానీ, బెజవాడ రామచంద్రారెడ్డిగారి వంటి ప్రముఖులకు దగ్గరయ్యే అవకాశం కలిగింది. మతానికి సంబంధించిన రాజాజీగారి అభిప్రాయాలతో నా విభేదాలు వారి మేథస్సు ప్రజ్ఞపై నాకున్న అపార గౌరవానికి అడ్డంకులు కాలేదు.

✳

# టంగుటూరి ప్రకాశం పంతులు



**(1872 - 1957)**

రాజకీయాల్లో ధైర్యంగా పోరాడి, సంపాదన తనది అని చూచుకోకుండా దేశ సేవలో ఖర్చుపెట్టి, ప్రజల మధ్య పర్యటించి ఉద్యమాలు నిర్విరామంగా సాగించిన ధీశాలి. కనుక ఆయన తప్పులు చేసినా, అప్పులు చేసినా జనం అభ్యంతర పెట్టలేదు. పార్టీలు మార్చినా అది ఒక పెద్ద తప్పుగా పరిగణించలేదు. రాష్ట్రస్థాయిలోనే కాక దేశస్థాయిలో నాయకుడుగా మోతీలాల్ నెహ్రూ సరసన స్వరాజ్యపార్టీ స్థాయిలో రాజకీయ దురంధరుడిగా కేంద్ర శాసనసభలో తన వాణిని వినిపించిన నాయకుడు ఆయన. మదన్ మోహన్ మాలవ్యా పెట్టిన నేషనల్ పార్టీలో పనిచేశారు. మద్రాసు నుండి 'స్వరాజ్య' దినపత్రిక పెట్టి ఇంగ్లీషులోను, తెలుగులోనూ నానా తిప్పలు పడి నడిపించిన టంగుటూరి ప్రకాశం సమయానికి జీతాలు ఇవ్వలేకపోయినా సిబ్బంది గొణగలేదు. స్వాతంత్ర్య పోరాటంలో నిమగ్ను డైనందున తీరికలేక తాను రాసిన విషయాన్ని ఉప సంపాదకులకు ఇచ్చి స్టైల్ (శైలి) పెట్టమనేవారట. ఆయన సేవల కృషి ఫలితం అదంతా. ముఠా రాజకీయా లలో మునిగి తేలినా, పదవులు వచ్చినప్పుడు సంపాయించుకోకుండా ప్రజలకోసం సంస్కరణలు తలపెట్టి నిజమైన ప్రజా సేవకుడిగా మార్గ దర్శకత్వం చూపాడు. రాజగోపాలచారి వంటి వ్యక్తులతో తారసిల్లి అటు శాసన సభలోనూ, ఇటు బయటా పోరాడారు. ముఖ్యమంత్రిగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం, ఫిర్కా స్థాయిలో సంస్కరణలు తలపెట్టడం, ఖాదీ ఉద్యమానికి అనుకూలంగా నూలు మిల్లులను రద్దుచేయటం వంటివి ఆనాడు ప్రకాశం మాత్రమే చేయగలిగాడు. కమ్యూనిస్టులపై తీవ్ర చర్యలు తీసుకోవడం, వారిపై మలబారు పోలీసులను పిలిపించి దమనకాండ జరిపించడం కూడా ప్రకాశం రాజకీయ జీవితంలో ఒక ముఖ్య ఘట్టం. రాజగోపాలచారి ఆయనకు వ్యతిరేకి.

మద్రాసును ఆంధ్రలో భాగం చేయాలని ఎంతో తిప్పలు పడి టంగుటూరి ప్రకాశం విఫలమయ్యారు. ఆంధ్రులకు చెందాల్సిన నగరం అని నిరూపించదలచి తొలి ఎన్నికలలో మద్రాసులో బీచ్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమి చవి చూశారు. అయినా ఎన్నికల జైత్రయాత్ర జరిపి ఆంధ్రలో పర్యటించి వరుసగా కొమ్ములు తిరిగిన ఆంధ్ర కాంగ్రెస్ మంత్రులను - కల్లూరి చంద్రమౌళి మొదలు,

కళా వెంకట్రావు వరకు మట్టి కరిపించారు. అటువంటి చరిత్రగల ప్రకాశం కమ్యూనిస్టులతో కలిసి తొలి ముఖ్యమంత్రి కావటానికి ప్రయత్నించి కుదరక, కాంగ్రెస్‌తో చేతుల కలిపి సఫలమయ్యారు. ఆయనకు సన్నిహితులుగా తెన్నేటి విశ్వనాథం చివరి వరకు నిలిచారు.

**తొలుత నేనెలా కలిశాను?**

నేను కర్నూలులో తొలుత ప్రకాశంపంతులుగారిని విద్యార్థిదశలో కలిసినప్పుడు చాలా సంతోషించాను. నేను గుంటూరు ఏ.సి.కాలేజీలో చదువుతూండగా రెండు మూడు పర్యాయాలు కర్నూలు రాజధానికి వెళ్ళటం. మరికొన్నిసార్లు గుంటూరులోనే ప్రకాశం పంతులుగారిని కలిసే అవకాశం ఏర్పడింది. అదొక గమ్మత్తయిన సందర్భం. గుంటూరులో లచ్చన్న అనుచరులు, వడ్డెంగుంట వెంకటేశ్వర్లు, మాదాల పెద్ద తిమ్మయ్య, రిక్షా యూనియన్ నాయకులుగా ఉన్నారు. అప్పుడు తొక్కుడు రిక్షాలు ఉండేవి. రిక్షాలో ఒక్కరే ఎక్కాలని నియమం ఉండేది. విజయనగరంలో ఇద్దరిని ఎక్కనిస్తున్నట్టు తెలిసి అలాగే తమను కూడా అనుమతించాలని రాష్ట్ర ఐ.జి.పి.నంబియార్‌ను కోరాలనుకున్నారు. ఆయనకు తెలుగు రాదని, ఇంగ్లీషులో మాట్లాడేవారు కావాలని నన్ను వెంటపెట్టుకుని కర్నూలు వెళ్ళారు. అయితే నాకు వచ్చిన ఇంగ్లీషు కూడా అప్పట్లో అంతంత మాత్రమే. కర్నూలు పోలీసు డేరాలలో ఉంటున్న నంబియార్ దగ్గరకు వెళ్ళాము. నేను వచ్చీరాని ఇంగ్లీషులో తబడడుతూ విషయం చెబుతూంటే, నంబియార్ గ్రహించి, ఆయనే స్వయంగా తెలుగులో మాట్లాడారు. హమ్మయ్య అనుకుని, పిటిషన్ ఇచ్చి వచ్చిన పని చెప్పాము. ఆయన ఇద్దరిని రిక్షాలో ఎక్కడానికి అనుమతించారు. వచ్చిన పని సఫలమైంది గనక నాయకులను చూచి వెళదాం అనుకున్నాం. ఆ విధంగా అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రకాశంగారి బంగళాకు వెళ్ళాము. ఆనాడు 'సెక్యూరిటీ' ఆర్భాటం అంతగా లేదు. ఎవరినైనా త్వరగా కలుసుకోవడానికి వీలుండేది. ప్రకాశంగారిని కలిసి నమస్కరించి, కూర్చున్నాము. అప్పటికే ఆయన కురువృద్ధుడైపోయాడు. కదలిక సన్నగిల్లింది. చూపు తగ్గింది. జ్ఞాపకశక్తి కూడా మందగించింది. చేతులలో కొద్దిగా వణుకు వచ్చింది. మమ్మల్ని ఆప్యాయంగా పలకరించారు. ఆయనపట్ల గౌరవంతో, వీరాధనతో వెళ్ళాం గనక, పలకరించిందే చాలని తృప్తిపడ్డాము. ఆయన కొంచెంసేపు అదీ ఇదీ మాట్లాడి,

గుంటూరు సంగతులు కూడా అడిగారు. తొలి కలయిక పరిచయం ఆ విధంగా జరిగింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే మరో రెండుసార్లు కర్నూలులో లచ్చన్నగారి వెంట ప్రకాశంగారిని కలవగలిగాను.

నేను చిన్నవాడినని భావించకుండా ఆప్యాయంగా పలకరించి కూర్చోబెట్టిన ప్రకాశంగారి సన్నిధి మరపురానిది. అయితే నేను గౌతు లచ్చన్న వెంట మరోసారి వెళ్లటం వలన అటువంటి ఆదరణ లభించింది. గౌతు లచ్చన్నగారు మా కుటుంబానికి సన్నిహితులు. రంగాగారి అనుచరులుగా మా తండ్రి రాజయ్య, మా అన్న విజయరాజకుమార్ ఉండటం వలన లచ్చన్నగారు తరచు మా యింటికి వచ్చేవారు. ఆ విధంగా నేను దగ్గరయ్యాను. అలాగే ఓబులరెడ్డి, నీరుకొండ రామారావుగార్లతోనూ దగ్గర అయ్యాను. అయితే నాకు రంగాగారి పార్టీ రాజకీయాలతో సంబంధం లేదు. నాకున్నదల్లా వ్యక్తిగత అభిమానం మాత్రమే. నేను పార్టీ రాజకీయాలలో ఎన్నడూ లేను. ఉత్తరోత్తర రంగాగారికి కొన్నేళ్ళు పి.ఎ.గా ఉన్నప్పుడు కూడా పార్టీ రాజకీయాలకి దూరంగానే పనిచేయగలిగాను. అధికారం ఉన్నప్పుడు లేనప్పుడు ఒకే తీరుగా "ఏరా, అబ్బాయ్, ఎప్పుడొచ్చావ్" అని పలకరించిన తీరులో ఆప్యాయత కనబడింది. ఆ తరువాత గుంటూరులో ఆయన మునిసిపల్ ట్రావెలర్స్ బంగళాలో విడిది చేసినప్పుడు యధేచ్ఛగా కలవగలిగాను. అప్పటికి ఆయనకు ముఖ్యమంత్రి పదవి పోయింది. మరోసారి గౌతు లచ్చన్నగారితో కలసి బంగళాకు వెళ్లి కలిశాను. నేను కేవలం వెంట వెళ్ళిన విద్యార్థిని మాత్రమే. అయినా కర్నూలులో కలిసిన జ్ఞాపకాలు ఆయనకు ఉండటం నన్ను ఆశ్చర్య పరిచింది. "ఏరా! బాగున్నావా...?" అని అంటే, నన్ను జీవితంలో ఏరా అని పిలిచిన వ్యక్తులు అరుదు. అయినా ప్రకాశంగారు అలా పిలిస్తే ఆప్యాయత కనిపించింది. ఆయన లచ్చన్నతో మాట్లాడుతూ "లచ్చన్నా, ముఖ్యమంత్రి పదవికి నా పేరు చెప్పు" అన్నారు. లచ్చన్న నమస్కారం పెట్టి బయటపడ్డారు. ప్రకాశంగారి దగ్గర జనం లేరు. అయితే అప్పటికే ఆయనలో తొంగిచూస్తున్న వార్ధక్యం రాజకీయాలకు ఇక పనికిరాడనిపించింది. బయటకు వచ్చిన లచ్చన్న తన వారితో, పంతులుగారికి ఈ వయస్సులోనూ ఇంకా ముఖ్యమంత్రి కావాలని ఉంది అన్నారు.

మరొకసారి గుంటూరులోనే ట్రావెలర్స్ బంగళాలో ప్రకాశంగారిని చూచాను. ఏనుగుల వెంకటరామయ్య, ఎస్.వి.పంతులు, నేను వెళ్ళాము. గది బయట ఒక బుట్టెడు బత్తాయి కాయలు పెట్టి ఉన్నాయి. కుర్చీలో నేతి చలపతి

కూర్చోని బత్తాయికాయలు వలుచుకుని తింటున్నాడు. లోనకు వెళ్ళిన తరువాత వెంకటరామయ్య నమస్కారం పెట్టి, "పంతులుగారూ, మీ అభిమానులు మీ కోసం బత్తాయికాయలు ఇచ్చి వెళ్ళితే బయట నేతి చలపతి ఎద్దుతిన్నట్టు తింటున్నాడు" అని ఎద్దేవగా చెప్పారు. ప్రకాశంగారు "ఒరే చలపతీ బత్తాయి కాయలన్నీ నువ్వే తినేస్తున్నావురా?" అన్నారు. "లేదండీ, వచ్చిన వారికి పంచుతూనే ఉన్నాను" అని చెప్పాడు. మేము నవ్వుకుని బయటకు వచ్చాము. వెంకట రామయ్య తో నేను అదేమిటయ్యా అంత మోటుగా మాట్లాడావు అని అడిగితే నేతి చలపతి విషయంలో అదేమీ మోటు కాదులే అన్నారు. అప్పట్లో వెంకట రామయ్య గుంటూరులో భారత సేవక్ సమాజ్ ఆఫీసులో పనిచేస్తుండేవారు. పరుచూరి వీరయ్య ఆయనకు బాస్. వెంకటరామయ్య హాస్య ప్రియుడు. చతురోక్తులకు పెట్టింది పేరు. ప్రకాశంగారంటే వీరాభిమానం ఉండేది. ఆ విధంగానే కలిసి వెళ్ళాము.

## గుండె చూపింది గాంధీగారికి - సిపాయి తుపాకికి గాదు

ప్రకాశంగారు ఆ తరువాత కొద్ది రోజులకే చనిపోయారు. చివరివరకూ కారులో ప్రయాణాలు చేస్తూ వచ్చారు. నేను ఆ తరువాత ప్రకాశంగారి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. ఆయన రచనలు, వ్యాసాలు చదివాను. రాజకీయాలలో పదవులలో ఆయన చేసిన పనులను నిశితంగా పరిశీలించాను. ప్రకాశంగారు తన స్వీయ చరిత్ర రాసుకున్నారు. 1927లో సైమన్ కమీషన్ మద్రాసు వచ్చినప్పుడు కాల్పులు జరగటం, ప్రకాశంగారు పోలీసులకు గుండె చూపెట్టి కాల్చుకోమన్నాడని చాలామంది చెప్పుకునేవారు. అది ఆయన ధైర్యానికి గీటురాయిగా పేర్కొన్నారు. ప్రకాశంగారు ఆ విషయాన్ని విపులంగా స్వీయచరిత్రలో రాశారు. కాల్పులలో చనిపోయిన వ్యక్తిని చూడటానికి వెళ్ళినప్పుడు ఒక పోలీసు ఆపటం, పక్కనున్నవారు ఆయన ప్రకాశం పంతులు అని చెప్పటం, అప్పుడు పోలీసులు అనుమతివ్వటం జరిగింది. ఇది ప్రకాశంగారు స్వయంగా రాసిన విషయం. కానీ ప్రజలలో ఆ విషయం ఆ విధంగా కాక ఒక వదంతిగా, కట్టుకథగా అల్లుకుపోయింది. ఆయన చెప్పిన విషయాన్నే యథావిధిగా ఉదహరించి 1982లో

ఈనాడు దినపత్రికలో నేను ఒక వ్యాసం రాస్తే ప్రకాశం వీరాభిమానులు నాపై విరుచుకుపడ్డారు. అప్పట్లో ఎడిటర్‌గా ఉన్న గజ్జల మల్లారెడ్డి ఆ విషయం చెప్పి వేలాది ఉత్తరాలు తమ కార్యాలయానికి వచ్చినట్లు తెలియ జేశారు.

రాజకీయాలలో ప్రకాశంగారు ఆచార్య రంగాతో కలవటం. విభేదించటం, రాష్ట్ర రాజకీయాలను చాలా మలుపులు తిప్పింది. అలాగే పట్టాభి సీతారామయ్యతో విభేదించి రాజకీయాన్ని నడిపిన ప్రకాశం కాంగ్రెస్‌కు భిన్న నాయకత్వం చూపారు. ఏమైనా టంగుటూరి ప్రకాశంగారితో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానూ, ఆ తరువాత చిరుపరిచయం నా అనుభవాలలో చిరస్మరణీయమైనది. ఆనాడు ప్రకాశం గారంటే ఒక రాజకీయ హీరోగా, ధైర్యానికి మారుపేరుగా ఉండేది. చివరి రోజులలో ఆయన కుమారుడు హనుమంతరావు వలన కొంత చెడు పేరు వచ్చిందని వినికిడి. ప్రకాశంగారికి ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చినా రాజకీయాలలో రిటైర్ కాకుండా చనిపోయిన నాయకుడాయన.

మహాత్మా గాంధీ తిరుగులేని నాయకుడుగా ఉన్నప్పుడు క్విట్ ఇండియా ఉద్యమం అనంతరం జైలు నుండి బయటకు వచ్చిన ప్రకాశం జనం దగ్గర డబ్బు వసూలు చేసి లెక్కలు చెప్పకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకున్నాడని, అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి తగడని అన్నారు. ప్రకాశం ధీరోదాత్తంగా గాంధీని ఎదిరించి, ప్రజా నాయకుడుగా కామరాజు నాడార్ సహకారంతో మద్రాసు ముఖ్యమంత్రి అయ్యాడు. రాజగోపాలచారి కూడా గాంధీజీతో చేతులు కలిపి ప్రకాశాన్ని ఎదిరించాడు. వాటన్నిటినీ తట్టుకుని తిరుగులేని ప్రజా నాయకుడుగా, మదరాసు ముఖ్యమంత్రిగా ప్రకాశం తన సత్తా చూపాడు. ఆ విధంగా గాంధీజీకి గుండె చూపిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం.

ముఖ్యమంత్రులతో నేను కలిసిన, పరిచయం చేసుకున్న తొలివ్యక్తి టంగుటూరి ప్రకాశం కాగా అది జీవితంలో మంచి అనుభూతి మిగిల్చింది. అతి కొద్ది పర్యాయాలు అతి స్వల్ప పరిచయంతోనే నేను సరిపెట్టుకోవలసి వచ్చింది. నేను తొలిసారి కలిసేటప్పటికే ప్రకాశంగారు 80వ పడిలోకి రావడం ఆ తరువాత కొద్ది సంవత్సరాలకే ఆయన చనిపోవడం జరిగింది.

⁕

రాజకీయాలలో పెద్ద మనిషి-

# బెజవాడ గోపాలరెడ్డి



(1907-1987)

ఆంధ్రకు మలి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి. 1950లో బెజవాడను విజయవాడగా మార్చారు. బెజవాడ గోపాలరెడ్డిని అప్పటినుండి విజయవాడ గోపాలరెడ్డి అంటారా అని జోక్ వాడుకలోకి వచ్చింది.

నేను హైస్కూల్లో చదువుతున్నప్పుడే బెజవాడ గోపాలరెడ్డి గురించి తెలుసుకుంటుండేవాడిని. పత్రికలు అందుకు ఆధారం. ఆయన 1937 నాటికే మంత్రి పదవి చేపట్టిన సీనియర్ నాయకుడు. కర్నూలు ఆంధ్ర రాజధానిగా ఉన్నప్పుడు నేను కొన్ని కారణాలుగా తరచు అక్కడికి వెళ్ళడం తటస్థించింది. అప్పుడే తొలిసారి గోపాలరెడ్డిగారిని ఆయన బంగళాలో కలిశాను. గౌతు లచ్చన్న, గోవాడ పరంధామయ్యలతో కలిసి ఆయన బంగళాకు వెళ్లినప్పుడు నేను కాలేజీ విద్యార్థిని మాత్రమే. నమస్కరించి, పెద్దలు మాట్లాడుకుంటుంటే వింటూ కూర్చున్నాను. మధ్యలో నన్ను పరిచయం చేసి, లచ్చన్నగారు "మిమ్మల్ని చూడాలి అని అంటే వెంటబెట్టుకొచ్చాను" అని చెప్పారు. సంతోషం అంటూ గోపాలరెడ్డిగారు ఏవో కుశల ప్రశ్నలు వేశారు. ఆ తరువాత చాలా కాలం నేను గోపాలరెడ్డిని కలవలేదు. కాని ఆయన రాజకీయ జీవితాన్ని గమనిస్తూవచ్చాను. నేను కర్నూలులో రెండవ సారి గోపాలరెడ్డిగారి బంగళాకు వెళ్ళినప్పుడు సినీనటి భానుమతి అక్కడ ఉన్నది. గోపాలరెడ్డిగారి ఇంటికి కళాకారులు, కవులు రావడం ఆనవాయితీ. సంస్కృతి, భాష, కళల పట్ల అభిమానం గల గోపాలరెడ్డిగారు ఎక్కడికి వెళ్ళినా అలాంటి వారిని పిలిపించుకునేవారు.

1955 ఉప ఎన్నికలలో గోపాలరెడ్డిగారి ఉపన్యాసాలు విన్నాను. మిగిలిన వారికీ ఆయనకూ విమర్శలలో స్థాయీభేదం ఉన్నది. నెల్లూరు యాసతో చక్కగా, హుందాగా మాట్లాడేవారు. ఎన్నికల అనంతరం గోపాలరెడ్డిగారి ప్రాధాన్యత రాష్ట్రంలో తగ్గిపోయింది. ఆ తరువాత ఆయన గవర్నరుగా, కేంద్రమంత్రిగా వెళ్ళారు. చాలాకాలం నేను ఆయన్ను కలుసుకోలేదు. చివరి దశాబ్దంలో మళ్ళీ సన్నిహితంగా ఉండగలిగాం. హైదరాబాదు వచ్చినప్పుడల్లా ఆయన కబురు చేసేవారు. జూబ్లీహిల్స్‌లో మాగుంట సుబ్బరామిరెడ్డి గెస్ట్‌హౌస్‌లో బస చేసేవాడు. అక్కడ కలుసుకొని విందు ఆరగించి, కవితలు విని, కబుర్లు చెప్పుకోవడం రివాజు

అయింది. నగరంలో ఏవైనా కార్యక్రమాలుంటే నన్ను తోడు తీసుకెళ్ళేవారు. 'మిసిమి' పత్రిక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ సన్నిహిత మిత్రులుగా గోపాలరెడ్డిని కలుస్తుండేవారు. కొన్ని పర్యాయాలు మేము ముగ్గురం కలసి కార్యక్రమాలకు వెళ్ళేవాళ్ళం. గోపాలరెడ్డిగారు ఉత్తర ప్రత్యుత్తరాలకు పెట్టింది పేరు. మేము ఇరువురం ఆవిధంగా చాలా ఉత్తరాలు రాసుకున్నాము. అందులో కొన్నిటిని నేను హైదరాబాదులోని స్టేట్ ఆర్కైవ్స్‌కు ఇచ్చాను. ఎప్పుడైనా నెల్లూరు వెడితే ఇంటికి వెళ్ళి కాసేపు కాలక్షేపం చేసేవాడిని. ఒకసారి అలా వెళ్ళినప్పుడు పెద్ద ఇంట్లో ఆయన ఒక్కరే కూర్చుని ఉన్నారు. ఆయన శ్రీమతి లోపల ఎక్కడో ఉన్నారు. నాకు కనీసం ఒక కప్పు కాఫీ ఇద్దామని సహాయకుడికోసం కేక వేస్తే ఎవరూ పలకలేదు. నేను అందుకొని మీతో కాసేపు హాయిగా కబుర్లు చెప్పుకోవ డానికి వచ్చాను. కాఫీలు అక్కరలేదు. మీరు ఆ విషయం పట్టించుకోనక్కరలేదు అని చెప్పాను. కానీ ఏమీ ఇవ్వలేకపోయాననే ఫీలింగు ఆయన ముఖంలో కనిపించింది. ఎన్నో పదవులు నిర్వహించిన గోపాలరెడ్డిగారు రిటైర్ అయిన తర్వాత అంత సాధారణ జీవితం గడిపారు. నేటి రాజకీయ నాయకులతో పోల్చుకుంటే తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

గోపాలరెడ్డిగారు తరచు మదరాసు వెళ్ళినప్పుడు మిత్రులను తన వద్దకు రప్పించుకొనడం, తానే వారి దగ్గరకు వెళ్ళటం ఆనవాయితీగా ఉండేది. అలా కలిసేవారిలో చందూర్, డి.ఆంజనేయులు మొదలైనవారుండేవారు. నేను ఆంజనేయులుగారింట్లో కొన్నిసార్లు గోపాలరెడ్డిగారిని కలిశాను. అనేక సందర్భా లలో గత రాజకీయ జీవిత ఘట్టాలలో వివిధ అంశాల గురించి అరమరికలు లేకుండా అడిగేవాడిని. కొన్నిటిని దాటవేసేవారు. మరికొన్నిటిని పరిమితంగా చెప్పే వారు. ఆయనకు ఠాగోర్ కవితలు ఇష్టం. కొన్నిటిని తెలుగులోకి అనువదించారు. ఆ ప్రభావంలో కొన్ని రచనలు చేసారు. బెంగాల్ ప్రభావం ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. అది నాకంత ఆకర్షణీయంగా అనిపించలేదు. కానీ, ఆయన మాత్రం తన రచనలు ప్రచురించినప్పుడు నాకు ఒక ప్రతి ఇచ్చేవారు. 'ఆమె' అనే శీర్షికన రాసిన కవితలు వినిపించినప్పుడు, ఈ ఆమె అనే పాత్ర నిజ జీవితంలో ఎవరినైనా పోలి ఉన్నదా? అని ప్రశ్నిస్తే ఆయన సూటిగా సమాధానం చెప్పలేదు.

గోపాలరెడ్డిగారితో పరిచయం, సంభాషణలు, కాలక్షేపాలు ఎక్కువగా రాజకీయే తరంగానే గడిచాయి.

విశ్వనాథ సత్యనారాయణకు జ్ఞానపీఠ్ అవార్డు విషయమై ఉన్న సందేహాలు తెర వెనుక జరిగిన కథనం, అవార్డు ఇప్పించిన తీరు గురించి ఎన్నిసార్లు గుచ్చి గుచ్చి అడిగినా గోపాలరెడ్డిగారు, అవన్నీ ఇప్పుడు ఎందుకులే అయిపోయిందేదో అయిపోయింది అని చెప్పారే తప్ప అసలు విషయాలు బయట పెట్టలేదు. నేను కూడా తెగేదాకా లాగకూడదని అంతటితో వదిలేశాను.

గోపాలరెడ్డిగారికి కళలు, చెస్, హిందీ భాషాభివృద్ధి బాగా ఇష్టమైన విషయాలు. ఆయన చుట్టూ ఎప్పుడూ కవులూ, గాయకులు, కళాకారులు కొలువు తీరుతుండేవారు.

❋

మిత్ర శత్రువుగా

# నీలం సంజీవరెడ్డి



(1913-1996)

ఆంధ్ర, ఆంధ్రప్రదేశ్, దేశ రాజకీయాలలో ఒక ఊపు ఊపిన రాజకీయ దిట్ట నీలం సంజీవరెడ్డి. ఆయన చదివింది ఇంటర్మీడియట్ అయినా రాష్ట్రపతి వరకూ ఎదిగి కీలకపాత్ర వహించిన వ్యక్తి. మొట్టమొదటిగా ఆయనను కర్నూలు రాజధానిలో కలుసుకున్నాను. అది సన్నిహిత పరిచయం కాదు. ఆయన అప్పటికే చాలా వివాదాస్పదమైన వ్యక్తి. ఆచార్య రంగా వ్యతిరేకంగా ఉన్నందున ఆయనపట్ల నేను సుముఖత కనబరచలేదు. కానీ అశ్రద్ధ చేయడానికి వీలులేని రాజకీయ నాయకుడుగా సంజీవరెడ్డిని పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తూపోయాను.

తెనాలిలో ఆవుల గోపాలకృష్ణమూర్తి 1954-55లో మునిసిపల్ ఛైర్మెన్‌గా ఉన్న రోజులలో, సంజీవరెడ్డి మంత్రి హోదాలో వచ్చారు. అప్పుడు మున్సిపల్ ఛైర్మన్ గోపాలకృష్ణమూర్తి సభాముఖంగా సంజీవరెడ్డిని రెండు రోడ్లు తెనాలికి మంజూరు చేయవలసిందిగా కోరారు. అందుకు సంజీవరెడ్డి స్పందిస్తూ అడిగిన రెండింటిలో ఒకటి మంజూరు చేస్తున్నట్లు, అంటే 50 శాతం ఇచ్చినట్లు అని ప్రకటించి, ఇలా ఇవ్వడం అపూర్వమని మిగిలిన చోట్ల ఇవ్వనివిధంగా ఇస్తున్నానని చెప్పారు. గోపాలకృష్ణమూర్తి ధన్యవాదాలు చెపుతూ రెండులో ఒకటి సగం కాదని, అడిగిన రెండింటిలో ఒక రోడ్డు లక్షన్నర విలువకాగా రెండవది 50 వేలు మాత్రమే నని కనుక లక్షన్నర విలువచేసే రోడ్డు నిర్మాణం అంగీకరిస్తే సంతోషిస్తామని చెప్పగా సభలో పెద్ద పెట్టున చప్పట్లు కొట్టారు. తరువాత ట్రావెలర్స్ బంగళాలో సంజీవరెడ్డి తనను తెనాలి ఆహ్వానించి తీసుకువచ్చిన ఆలపాటి వెంకట్రామయ్యపై ఆగ్రహం కనబరిచి, నన్ను సభాముఖంగా ఇలా అవమానం చేయిస్తాడా అని అన్నారు. అప్పుడు నేను సభలో ప్రేక్షకుణ్ణి మాత్రమే. గోపాలకృష్ణమూర్తి అభిమానిని కూడా.

సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు తిరుపతిలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చారు. నాటి వైస్ ఛాన్సలర్ గోవిందరాజులు నాయుడు ఏకపక్షంగా ప్రజాస్వామ్య విరుద్ధంగా సెనేట్‌కు చెప్పకుండానే నిర్ణయం తీసుకోవటం అప్రజాస్వామికమని మా అన్న విజయరాజ కుమార్ సెనేటు సభ్యులుగా కోర్టులో కేసు వేశారు. అది తేలేవరకూ డాక్టర్ అని తన పేరు ముందు వాడవద్దని సంజీవరెడ్డి పక్షాన చీఫ్ సెక్రటరీ భగవాన్‌దాస్

ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు కోర్టులో ఆ కేసును ఆవుల గోపాలకృష్ణమూర్తి చేపట్టారు. కొంతకాలం విచారణ జరిగిన తరువాత తమ పరిధిలో లేదని ఆ విషయాన్ని అంతటితో వదిలేశారు. ఉత్తరోత్తర నేను కలిసినపుడు మీ మీద కోర్టులో గౌరవ డిగ్రీ విషయమై కేసు పెట్టిన వ్యక్తి మా అన్న అని చెప్పినప్పుడు ఆయన సీరియస్‌గా తీసుకోలేదు. తరువాత మేము మిత్రులమయ్యాము.

1955 ఉప ఎన్నికల సందర్భంగా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార ఉద్యమం ముమ్మరంగా ఆంధ్రలో సాగినప్పుడు సంజీవరెడ్డి, రంగా కలిసి పర్యటించారు. మా అన్న విజయరాజకుమార్ రంగా పక్షాన ఆ పర్యటనలో చాలా సభలలో పాల్గొన్నాడు. రంగాగారి సన్నిహితులుగా నేను కొన్ని సందర్భాలలో సంజీవరెడ్డిని కలవటం తటస్థించింది. ఆ తరువాత ముఖ్యమంత్రిగాను, కేంద్రమంత్రిగాను ఉన్న సంజీవరెడ్డితో నేను కలిసింది తక్కువే. హైదరాబాదులో ఒకేసారి ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజులలో గోరాగారు అనుచరులతో సత్యాగ్రహం తలపెట్టారు. నిరాడంబరంగా ఉండాలని, పూలమొక్కల బదులు కూరగాయలు పెంచాలని ఆ ఉద్యమంలో ప్రధానాంశాలుగా ఉన్నవి. సంజీవరెడ్డి గ్రీన్ లాండ్స్ గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రిగా బసచేసినప్పుడు (1963) దాని ఎదురుగా గోరా, ఆయన భార్య సరస్వతి, పత్తి శేషయ్య, వెంపో, కానా మరికొందరితో పాటు నేనూ రోడ్డుమీద కూర్చున్నాను. సంజీవరెడ్డి కబురుపెట్టి గోరాని పిలిపించుకొని భోజనం పెట్టి చర్చలు జరిపి పంపించారు. ఆ సందర్భంగానే మిగిలినవారిని కూడా లోనికి పిలిచి నిర్ణయాలు చెప్పమని గోరా కోరినప్పుడు, ఆయన మమ్మల్ని లోపలికి పిలిచినప్పుడు కలవటం జరిగింది. అక్కడ నన్ను గుర్తుపట్టి లోగడ కర్నూలులో, తెనాలిలో కలిశావు కదా అన్నారు. మీకు చాలా గుర్తున్నదే అన్నాను.

చాలాకాలం తరువాత రాజకీయ సుడిగుండంలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చిన తరువాత సంజీవరెడ్డి జనతా పార్టీ నాయకుడుగా ఉన్నప్పుడు నేను కలవడం తటస్థపడింది. ఎమ్.వి.ఎస్. సుబ్బరాజు అప్పుడు సంజీవరెడ్డికి ప్రియశిష్యుడుగా ఉండేవాడు. ఆయన నాకు కుటుంబ మిత్రులు. ఆ విధంగా కొన్ని పర్యాయాలు సంజీవరెడ్డిని దగ్గరగా కలుసుకున్నాను. 'కమెండో' పత్రిక ఎడిటర్ వినుకొండ నాగరాజు ఎలాగో సంజీవరెడ్డికి చాలా సన్నిహితుడయ్యారు. ఆయన నాకు మిత్రుడు కనుక మేము హైదరాబాదు సరోవర్ హోటల్‌లో కొన్ని సందర్భాలలో కలిసి మాట్లాడటం వలన దగ్గరగా వచ్చాము. వినుకొండ నాగరాజు జనతాపార్టి

పక్షాన పోటీచేసి ఓడిపోవడం ఆ తరువాత రాష్ట్రపతిగా ఉన్న సంజీవరెడ్డి దగ్గరకు అప్పుడప్పుడూ ఢిల్లీ వెళ్ళటం కూడా జరిగేది. నేను ఢిల్లీలో కలవలేదు. కాని హైదరాబాదులోనే అనేక సందర్భాలలో సంజీవరెడ్డిని కలిసే అవకాశం లభించింది. 'మిసిమి' ఎడిటర్ ఆలపాటి రవీంద్రనాథ్ చిరకాలంగా సంజీవరెడ్డికి సన్నిహితులు. అలా కూడా మేము విడిది గృహాలలో సంజీవరెడ్డిని కలిశాము.

చివరి రోజులలో నా మిత్రుడు, బుక్ లింక్స్ పుస్తక ప్రచురణ సంస్థ యజమాని కె.బి.సత్యనారాయణ ద్వారా సంజీవరెడ్డి తన జీవిత గాథను ప్రచురించాడు. అప్పుడు నేను వ్రాతప్రతిని చూడటం కొన్ని సలహాలు చెప్పటం వలన మరికొంత సన్నిహితులమయ్యాము. తొలి ప్రతిలో నిష్కర్షగా చాలా విషయాలు బయటపెట్టిన సంజీవరెడ్డి తీరా ప్రచురణ సమయానికి ఎందుకోగాని వాటన్నిటినీ ఉపసంహరించారు. వివాదాలు అనవసరమని భావించారు. నేను కొంతమేరకు ఆశ్చర్యపోయాను. పుస్తకం పేరు 'ఫ్రం ఫామ్ హౌస్ టు రాష్ట్రపతి భవన్'. ఆయన రాసిన మరొక స్వీయగాథను 'వితౌట్ ఫియర్ ఆర్ ఫేవర్' అనే శీర్షికన అలైడ్ పబ్లిషర్స్ వెలికి తెచ్చారు. స్పీకర్‌గా, రాష్ట్రపతిగా సంజీవరెడ్డి చాలా అధునాతన సాహిత్యం చదివారు. ఒకసారి ఎం.సి.చాగ్లా అది తెలిసి ఆశ్చర్యపోయి మెచ్చుకున్నారు. సంజీవరెడ్డి మిగిలినవారితో పోల్చితే నిరాడంబరంగా జీవితం గడిపారు. హైదరాబాదు వచ్చేముందు ఎస్.వి.పంతులుగారికి కబురు చేసి సరోవర్‌లో బస ఏర్పాటు చేయమనేవారు. ఆవిధంగా కూడా కొన్ని సందర్భాలు మేము కలిసి మాట్లాడటానికి అవకాశాన్నిచ్చాయి. సంజీవరెడ్డి ఎదిగాడు. సంజీవరెడ్డి చివరి రోజులలో చాలా సన్నిహితంగా వ్యవహరించటం నాకు సంతోషదాయకమైన విషయం. ఇందిరాగాంధీ 1975లో విధించిన ఎమర్జెన్సీని అప్రజాస్వామికమైనదిగా సంజీవరెడ్డి వ్యతిరేకించటం గొప్ప హైలైట్. మొదటిసారి తన బావమరిది తరిమెల నాగిరెడ్డి (కమ్యూనిస్టు) చేతిలో అనంతపురంలో ఓడిపోయిన తరువాత మళ్ళీ జిల్లాలో ఎప్పుడూ పోటీ చేయలేదు. బయటనుండే గెలిచారు. సంకుచిత కాంగ్రెస్ రాజకీయాల నుండి ఆయన ఎదిగి జనతా రాజకీయాలలో ప్రజాస్వామిక వాదిగా పరిణమించటం విశేషం.

*

దళితుల ప్రథమ ముఖ్యమంత్రి

# దామోదరం సంజీవయ్య



(1921-1972)

నాకు బాగా ఇష్టమైన వ్యక్తి దామోదరం సంజీవయ్య. కానీ, ఆయనతో నాకున్న పరిచయం చాలా స్వల్పమనే చెప్పాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా రెండుమూడు పర్యాయాలు సన్నిహితంగా కలసి మాట్లాడగలిగాను. ఆ రెండుసార్లూ కూడా తెనాలిలోనే కలవటం అనుకోకుండా జరిగిన విషయమే. తెనాలి శాసన సభ్యులు, సోషలిస్టు ప్రముఖులయిన నన్నపనేని వెంకట్రావు ద్వారా 1970లో కలిసినపుడు సుదీర్ఘ చర్చలు చేశారు. సంజీవయ్య ముఖ్యమంత్రి అయిన సందర్భంగా తెనాలిలో మూడురోజులపాటు బడుగువర్గాల సమస్యలపై చర్చాగోష్ఠి వి.ఎస్.ఆర్.కాలేజీలో ఏర్పాటు చేశారు. దానికి వెంకట్రావుగారు నా సహాయం అడిగారు. చర్చకు కావలసిన హంగులు, పిలవాల్సిన వ్యక్తులు, చర్చించాల్సిన అంశాలు, అందుకు భూమికగా తోడ్పడే సాహిత్యం సమకూర్చడానికి నేను యధాశక్తి తోడ్పడ్డాను. ఇది 1970 నాటి మాట. సంజీవయ్య వచ్చిన తరవాత గోష్ఠిలో చర్చలు, ఉపన్యాసాలు చాలా లోతుపాతులతో హుందాగా జరిగాయి. డా॥ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు, డా॥ రాఘవేంద్రరావు, రావెల సోమయ్య, సూర్యదేవర హను మంతరావు మరెందరో పాల్గొని చర్చల స్థాయిని పెంచారు.

సంజీవయ్యకు దళితుల, బడుగు వర్గాల అభివృద్ధిపట్ల అపారమైన శ్రద్ధ, ఆసక్తి ఉండేవి. కానీ అందుకు తగ్గట్టు ఆయన చేయలేకపోవటానికి కారణం కాంగ్రెస్ పార్టీ రాజకీయాలే. ఒకవైపు కులం, మరొకవైపు ముఠాలు, ఇంకోపక్క అగ్రకులాల వ్యతిరేకతలు ఇత్యాది సమస్యలతో సంజీవయ్య సతమతమయ్యారు.

సంజీవయ్య మంచి వక్త. తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ధారాళంగా, మనోరంజకంగా మాట్లాడేవారు. అందునా తనకిష్టమయిన బడుగు వర్గాల అభివృద్ధి అంశం గనుక, చాలా ఆవేదనతో, ఉద్విగ్నంగా ప్రసంగించేవారు. విడిగా ఆయనతో వివిధ కోణాల నుంచి బడుగు వర్గాల సమస్యను చర్చించాము. కాంగ్రెసు పార్టీలో సంజీవయ్య ఉన్నందున అనుకున్నవన్నీ అమలు పరచటానికి వీలులేని పరిమితులు ఉన్నాయి. అంబేద్కర్ భావాలు, లోహియా ఆలోచనలూ, ఎం.ఎన్.రాయ్ ధోరణి బడుగువర్గాల ఉన్నతికి తోడ్పడేదిగా, అగుపించినా, పార్టీ ఓట్లు రాజకీయం వలన చాలా అంశాలలో ముందుకుపోలేని స్థితి కాంగ్రెసు

పార్టీలో ఉన్నది. చర్చలలో అటువంటి విషయాలను సంజీవయ్య ప్రస్తావించినా, వేదికపై అలా మాట్లాడడానికి వీలుకాలేదు. కానీ బడుగు వర్గాల సమస్యలపట్ల ఆయన వెలిబుచ్చిన ఆవేదన మాత్రం చెప్పుకోదగ్గది. నా అభిప్రాయాలు ఆయనతో చెప్పినప్పుడు సంతోషించి నన్ను గురించి వివరాలు అడిగారు. నన్నపనేని వెంకటరావుగారు రాడికల్ హ్యూమనిస్టుగా నాకు సంబంధించిన అంశాలు చెప్పారు. ఏదైనా ఆ అనుభవాలు చాలా హత్తుకుపోయిన అంశాలు.

మరొకసారి తెనాలిలోనే ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి వద్ద సంజీవయ్యగారిని కలుసుకోగలిగాను. ఆ సన్నివేశం భిన్నమయినది. ముఖ్యమంత్రిగా పర్యటన చేస్తున్న సంజీవయ్య విజయవాడ వెళ్ళి, పాత బస్తీలో ఒక అనాథ బాలికల ఆశ్రమాన్ని సందర్శించవలసి ఉన్నది. సంజీవయ్య అక్కడివరకు వెళ్ళారు. ఒక కొండ గుట్టపై ఆ అనాథబాలికల బడి ఉన్నదని తెలిసి, "అంతపైకి నేను ఎక్కలేను" అని తిరిగి వెళ్ళిపోయారు. ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న అనాథ బాలికలు, యాజమాన్యం కుంగిపోయారు. ఈ విషయాల్ని ఆంధ్రపత్రికలో వార్తగా ప్రచురించారు. ఆవుల గోపాలకృష్ణమూర్తి అది చూచి "ముఖ్యమంత్రి పదవికి దేకగలిగిన వాడు ఆమాత్రం గుట్ట ఎక్కలేకపోయాడా?" అని వ్యాఖ్యానించాడు. అదే మాటలని యథాతథంగా ఆంధ్రపత్రిక తెనాలి విలేఖరి వెంకటప్పయ్యశాస్త్రి పంపగా ప్రముఖంగా ప్రచురితమయింది. అది చూసుకున్న ముఖ్యమంత్రి సంజీవయ్య వెంటనే స్పందిస్తూ, ఆ వ్యాఖ్య బావున్నది. నాకు తగిలింది. నచ్చింది. నేను తక్షణమే కార్యక్రమం వేసుకొని అనాథ బాలికల ఆశ్రమానికి వెళుతున్నానని చెప్పి వెళ్ళారు. అక్కడ నుండి తెనాలికి వచ్చి గోపాలకృష్ణమూర్తిని కలిసి అభినందించారు. అప్పుడు నేనక్కడే ఉన్నాను. చాలాసేపు అనేక విషయాలు మాట్లాడుకున్నాము. గోపాలకృష్ణమూర్తిగారిపట్ల ఆయన ఎంతో ప్రేమ, ఆసక్తి కనబరిచారు.

దామోదరం సంజీవయ్య రాజకీయాలలోకి వచ్చిన కొత్తలోనే మద్రాసులో రాజగోపాలాచారిని ఆకర్షించారు. ఆ తరువాత ఆంధ్రలో వివిధ దశలలో హుందాగా ప్రవర్తించి పేరు తెచ్చుకున్నారు. కర్నూలు నుంచి వచ్చిన సంజీవయ్య ఢిల్లీలో జనహర్ లాల్ నెహ్రూను ఆకర్షించటం విశేషం.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి హఠాత్తుగా సుప్రీంకోర్టు వ్యాఖ్యల వలన రాజీనామా చేయవలసి వచ్చింది. బస్సుల జాతీయాకరణను

చేయడంలో పక్షపాతం వహించి తన ప్రత్యర్థి అయిన పిడతల రంగారెడ్డిని దెబ్బ కొట్టాలని కర్నూలు జిల్లా బస్సురూట్లు జాతియీకరణ చేశారు. అప్పుడు సుప్రీంకోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందువల్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో తాత్కాలికంగా కేంద్ర మధ్యవర్తిగా దామోదరం సంజీవయ్యను 1960 జనవరిలో రాష్ట్రానికి తీసుకువచ్చారు. కనుక సంజీవయ్య శాసనసభలో అధిక సంఖ్యాకుల బలంతో వచ్చిన వ్యక్తి కాదు. సహజంగా కుల, ముఠా రాజకీయాల మధ్య సతమతమయ్యారు. బలీయమైన రెడ్డి వర్గం ఎ.సి.సుబ్బారెడ్డి నాయకత్వాన ఎదురుతిరిగి సొంత పక్షం పెట్టకున్నారు. 1962లో ఎన్నికలు జరిగి తిరిగి కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చినపుడు సంజీవయ్య పోటీ చేద్దామను కున్నారు. కానీ ఢిల్లీ నాయకత్వం అందుకు అంగీకరించలేదు. ఆ విధంగా సంజీవయ్య ముఖ్యమంత్రిత్వం స్వల్ప కాలానికే పరిమితం కావడంతో దళితులకు ఏమంతగా చేయలేకపోయారు. ఎ.సి.సుబ్బారెడ్డి మరీ తలబిరుసుతనంతో కులం పేరు ఎత్తి సంజీవయ్యను ఎద్దేవ చేసాడు. ముఖ్యమంత్రిగా 1962లో దిగిపోయిన సంజీవయ్య, గవర్నర్‌కు రాజీనామా సమర్పించారు. ఆ మర్నాడే సికిందరాబాదులో తన భార్యను వెంటబెట్టుకుని అజంతా టాకీసులో సినిమాకని నడిచివెళ్ళారు. త్రోవలో ఎస్.వి.పంతులు కనిపిస్తే రా పంతులూ సినిమాకి పోదాం అని ఆయనను కూడా వెంటబెట్టుకు వెళ్ళారు. ఈనాటి ముఖ్యమంత్రులలో అలాంటి ప్రవర్తన వూహించటం కష్టం.

కేంద్రానికి వెళ్ళిపోయిన దామోదరం సంజీవయ్య మంత్రిగా కొనసాగారు. చక్కని పేరు తెచ్చుకున్నారు. కార్మిక సమస్యలు బాగా పట్టించుకున్నారు. పారిశ్రామిక రంగంలో ఎదుర్కొంటున్న విషయాలు అధ్యయనం చేశారు. ఆయన రాసిన ‘‘లేబర్ ప్రాబ్లమ్స్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్’’ పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ వారు ప్రచురించారు -

సంజీవయ్య 1972లో చనిపోవటం దళితులకు, బడుగు వర్గాలకు పెద్ద లోటు. ఆయనతో నాకున్న పరిచయం పరిమితమే అయినా అపరిమిత అనుభవాన్నిచ్చింది.

*

రాజకీయ జీవిగా

# కాసు బ్రహ్మానందరెడ్డి



**(1909-1994)**

ఆద్యంతాలూ రాజకీయవాదిగా జీవితం గడిపిన కాసుబ్రహ్మానందరెడ్డి రాష్ట్రంలోను, కేంద్రంలోనూ తనదైన ముద్ర వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవుదామని విఫల ప్రయత్నం చేసి ఆంధ్రప్రదేశ్‌లో సంజీవరెడ్డి మంత్రివర్గంలో తొలిసారి అమాత్యులుగా జీవితాన్ని ఆరంభించారు. అప్పటినుండి చివరివరకూ రాష్ట్ర, కేంద్ర పదవులు ఎన్నో చేపట్టి కొనసాగారు.

1950 ప్రాంతాలలో ఆయన ప్లీడరుగా గుంటూరులో ఉన్న రోజులలో కలుసుకున్నాను. నేను ఎ.సి.కాలేజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు నా సోదరుడు విజయరాజకుమార్ పెళ్ళి ఆహ్వానం కార్డు ఇవ్వడానికి వెళ్ళాను. గుంటూరులో అమరావతి రోడ్డులో ఉంటున్న బ్రహ్మానందరెడ్డి కాఫీ ఇచ్చి సాదరంగా కార్డు స్వీకరించినా పెళ్ళికి మాత్రం రాలేదు. అంతకుముందు ఎ.సి. కాలేజీకి ఎదురుగా ఎల్.వి.ఆర్. అండ్ సన్స్ క్లబ్బులో రోజూ బ్రహ్మానందరెడ్డి వచ్చి పేకాడటం చూసేవాడిని. అదే ప్రాంగణంలో మా అన్న ఒక పుస్తకాల షాపు పెట్టారు. నేను తీరిక వేళల్లో కూర్చుని అమ్ముతుండేవాడిని. ప్రక్కనే బ్రహ్మానందరెడ్డి, సలాం, ఇంకా కొందరు గుంటూరు ప్రముఖులు పేకాడుతుంటే మధ్యమధ్యలో నేను కాసేపు నిలబడి వారి మాటలు వింటూండేవాడిని. ఒకసారి గమ్మత్తయిన సంభాషణ చెవిన పడింది. మదరాసు శాసనసభ కౌన్సిల్ సభ్యుడుగానూ, గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడుగానూ ఉన్న ప్లీడరు సలాం మంచి హాస్య ప్రియుడు. సంభాషణా చతురుడు. ఆయనను ఉద్దేశించి, "ఏం సలాం! మరీ పాతిక్కీ - పరక్కీ కక్కుర్తి పడుతున్నావటగా" అని బ్రహ్మానందరెడ్డి ఒక విసురు విసిరాడు. వెంటనే సలాం- "ఏం చేస్తాం, వందా, రెండువందలూ అయితే నీతో పనేంటయ్యా, బ్రహ్మానందరెడ్డి ఉన్నాడుగా అంటున్నారు మరి" అనేసరికి అందరూ గొల్లున నవ్వారు. అలా సాగుతుండేవి వారి సరసాలు.

బ్రహ్మానందరెడ్డి క్రమంగా జిల్లా నుండి రాష్ట్రానికి ఎదిగారు. మొదటినుండి ముఠా రాజకీయాల్లో మునిగితేలారు. తొలుత సంజీవరెడ్డి కుడి భుజంగా రాజకీయాలలో చక్రం తిప్పి కీలక స్థానంలోకి వచ్చారు. ఆ తరువాత ఆయనకే ఎదురు తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. కేంద్రంలో అత్యంత ప్రముఖ నాయకుడుగా కాంగ్రెసు పార్టీని చీల్చి రెడ్డి కాంగ్రెసు అధ్యక్షుడు కూడా అయ్యాడు. ఆర్థిక వ్యవహారాల నిపుణుడుగా పేరు తెచ్చుకున్నారు.

బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా నేను వివిధ సందర్భాలలో కలిశాను. 'తెలుగు విద్యార్థి' (కొల్లూరి కోటేశ్వరరావు సంపాదకుడు) మాసపత్రికకు ఇంటర్వ్యూ చేసి ప్రచురించాము. పాత హైదరాబాదులో మత కల్లోలాలు జరిగి నప్పుడు (1968) వివిధ సంఘాలను పిలిచి జూబిలీహాలులో సంప్రదింపులు జరిపారు. అప్పుడు మానవవాద సంఘం తరపున నన్ను పిలవగా నాకు తోచిన సూచనలు ఇచ్చాను. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి త్వాన్ని బాగా దెబ్బ కొట్టింది. ఆయన, ఆయన మంత్రులూ ఒకదశలో స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అటువంటి సందర్భాలలో తేళ్ళ లక్ష్మీకాంతమ్మ (లోక్‌సభ సభ్యురాలు), నేను కలసి బ్రహ్మానందరెడ్డి దగ్గరకు వెళ్ళి మాకు తోచిన విషయం చెపుతుండేవాళ్ళం. ఆయన బంగళా నిర్మానుష్యంగా ఉండేది. కొంత కాలం ఆయన కుంగి పోయినట్లు కనిపించేవాడు. అలాంటప్పుడు కలుస్తుంటే ఎంతో సహాయపడినట్లుగా భావించేవాడు. అదే సందర్భంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమకారులు కొందరు హైదరాబాదులో గోడలపై బ్రహ్మానందరెడ్డి భార్య రాఘవమ్మను ఉద్దేశించి చాలా అసహ్యకరమైన, అశ్లీల, శృంగార నినాదాలు రాశారు. మేము నిరసన తెలిపాము. తెలంగాణాలో ప్రముఖ స్త్రీ నాయకురాళ్ళు జె.ఈశ్వరీబాయి, సంగం లక్ష్మీబాయి, సరోజినీ పుల్లారెడ్డి మొదలైనవారు అటువంటి నినాదాలను ఖండించి వారే స్వయంగా చెరిపివేయడానికి పూనుకున్నారు. అటువంటి క్లిష్ట దశలో మేము కలుస్తుండడం బ్రహ్మానందరెడ్డికి ఊరటనిచ్చింది.

రాజకీయవాదిగా బ్రహ్మానందరెడ్డి చాలా ముఠా కక్షలతో సంకుచిత ధోరణిలో ప్రవర్తించాడు. ఆంధ్రజ్యోతి దినపత్రికపై, దాని సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావుపై ప్రభుత్వపరంగా దాడి చేసి అదుపు పెట్టాలని చూశాడు. వారికి ప్రకటనలు ఆపివేయాలనుకున్నాడు. ప్రెస్ బిల్లు పెట్టే చర్యకు ఉపక్రమించగా మేము హేతువాద సంఘం పక్షాన తీవ్ర ప్రతిఘటన చేశాము. మామిడిపూడి వెంకట రంగయ్యని పిలిచి హైదరాబాద్‌లో సభ జరిపి ప్రెస్ బిల్లును ఎండ గట్టాము. దీనిపై అఖిల భారత స్థాయిలో పత్రికలు ప్రతిధ్వనించాయి. బ్రహ్మానందరెడ్డి ఆ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపి తప్పుకున్నారు.

బ్రహ్మానందరెడ్డి జీవిత చరిత్రను కపిల కాశీపతి బ్రహ్మానందయాత్ర పేరిట పెద్ద గ్రంథంగా వెలువరించారు. అందులో చాలా వివరాలు, నిశిత పరిశీలనలు చేశారు. అయినప్పటికీ దానిని బ్రహ్మానందరెడ్డి స్నేహపూర్వకంగానే స్వీకరించటం విశేషం. జూబిలీహాలులో సభ పెట్టి అందరికీ కాపీలు ఉచితంగా ఇచ్చి, ప్రసంగాలు

విన్నారు. నేతి చలపతి అధ్యక్షతన బ్రహ్మానందరెడ్డిపై ఒక విచారణ సంఘాన్ని కాంగ్రెసు కమిటీ నియమించింది. ఆయన జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఉండగా అరాచక చర్యలకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉండగా అవి చాలావరకూ వాస్తవాలని నేతి చలపతి కమిటీ నిర్ధారించిందట. ఆ విషయం నిజమేనా అని నేను బ్రహ్మానందరెడ్డిని అడిగితే టోపీ వెనక నుంచి ముందుకు తిప్పి నవ్వి సమాధానం దాటేశారు. అసెంబ్లీలోనూ, బయటా బ్రహ్మానందరెడ్డి నుండి సమాధానం రాబట్టటం చాలా కష్టమయ్యేది. ఆయన ఏమి ఆలోచిస్తున్నాడో సహచరులకు, పార్టీ వారికీ అంతుపట్టేది కాదు. ఏదైనా అడిగితే గాంధీ టోపీని వెనక నుంచి ముందుకు తిప్పుకుని పెట్టుకునేవారు.

రాజకీయాలలో తనకు బద్ధ విరోధిగా ప్రారంభమైన జలగం వెంగళరావును మంత్రివర్గంలోకి ఆహ్వానించి, హోంమంత్రిశాఖ కేటాయించి బ్రహ్మానందరెడ్డి తన రాజకీయ చతురతను చూపారు. ఆవిధంగా ప్రత్యర్థులను ఆకర్షించటం, మరో పక్క దెబ్బ కొట్టడం ఆయన రాజకీయ జీవితంలో మామూలే. సంజీవరెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉంటూ, తరువాత తీవ్ర వ్యతిరేకిగా మారిపోయాడు. సంజీవరెడ్డి కేంద్రమంత్రిగా ఉక్కు కర్మాగారాలశాఖ నిర్వహిస్తున్నప్పుడు ఆంధ్రులకు విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పరచటం అవసరమని ఆందోళన జరిగింది. అందుకు గాను తమనంపల్లి అమృతరావు అనే కాంగ్రెస్ వాదిని నిరాహారదీక్షకు పురిగొలిపి ఆందోళన పెంచటానికి బ్రహ్మానందరెడ్డి హస్తం ఉందనేవారు. ఆ సందర్భంగా జరిగిన అలజడులలో విజయవాడలోని సంజీవరెడ్డి విగ్రహాన్ని పగులగొట్టారు. దీనికి బ్రహ్మానందరెడ్డి పరోక్ష కారణం అంటారు. ఆయన మంత్రివర్గంలో ఉంటూ వచ్చిన చెన్నారెడ్డి కేంద్రానికి వెళ్ళి కోర్టు తీర్పు ద్వారా పదవి పోగొట్టుకుని తెలంగాణా ఉద్యమంలోకి ప్రవేశించి బ్రహ్మానందరెడ్డి వ్యతిరేకిగా ఆందోళన చేశారు. అయితే ఒక పట్టాన బ్రహ్మానందరెడ్డి లొంగలేదు. శాసనసభలో ఆయన మెజారిటీకి తిరుగు లేకుండా ఉండేది. అయినప్పటికీ ఇందిరాగాంధీ రాష్ట్ర ప్రయోజనం దృష్ట్యా ఆయనను తొలగించి పి.వి.నరసింహారావును ముఖ్యమంత్రిగా తీసుకువచ్చింది.

మహారాష్ట్ర గవర్నరుగా, కేంద్రమంత్రిగా ఆయన చిరకాలం వివిధ పదవులు అనుభవించిన రాజకీయవాది. సంతానం లేదు. రాజకీయాలలో తన పాత్రను ఏమేరకు నిలబెట్టుకున్నాడనేది చరిత్ర చెపుతుంది. ఆయనకు పదవిలేనప్పుడు కూడా నేను తరచు కలసి మాట్లాడుతుండేవాడిని.

*

దేశ ఆర్థిక భవిష్యత్తును మార్చిన

# పి.వి.నరసింహారావు



(1921-2004)

"ఈ పాములు, తేళ్ల బాధ పడలేకుండా ఉన్నాము" అని జి.సి.కొండయ్య (ప్రముఖ జనతా నాయకుడు) ఆరోజులలో వ్యాఖ్యానించేవారు. మొదట్లో ఆ మాటలకు అర్థం తెలిసేది కాదు. తరువాత పాములపర్తి వెంకట నరసింహారావు, తేళ్ళ లక్ష్మీకాంతమ్మ సన్నిహిత సహచర్యాన్ని దృష్టిలో పెట్టుకుని అంటున్నాడని గ్రహించి నవ్వుకున్నాము.

పి.వి.నరసింహారావు విద్యామంత్రిగా, బ్రహ్మానందరెడ్డి కేబినెట్‌లో నాకు పరిచయం అయ్యారు. 'తెలుగు విద్యార్థి' మాసపత్రిక (ఎడిటర్ కొల్లూరి కోటేశ్వర రావు, మచిలీపట్నం) ఇంటర్వ్యూలు, ఉపన్యాసాలూ ఆయన చాలా చక్కగా చెప్పేవాడు. అలా మొదలైన మా పరిచయం క్రమేణా సాన్నిహిత్యానికి దారి తీసింది. 1968లో నాటి ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకుడు (లోగడ తెలుగు స్వతంత్ర సంపాదకుడు) గోరాశాస్త్రికి కర్నూలులో 50వ జన్మదినం జరిపినప్పుడు ముఖ్య అతిథిగా పి.వి. నరసింహారావును తీసుకెళ్ళాము. అప్పుడు కోట్ల విజయ భాస్కరరెడ్డి జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా ఉండేవాడు. వ్యవసాయ బ్యాంక్ శాఖాధికారి మండవ శ్రీరామమూర్తి, తెలుగు భాషా సంఘాధికారి సి. ధర్మారావు, నేనూ పూనుకొని సన్మానం చేసి గోరాశాస్త్రికి కొంత ఆర్థిక సహాయం చేయగలిగాము. ఒక సంచిక కూడా వెలువ రించాము. ఆ సభలో పి.వి.నరసింహారావు గొప్ప ఉపన్యాసం చేశారు. ఆయనతో చాలా సేపు కాలక్షేపం చేసి అనేక విషయాలు అడిగాను.

హైదరాబాదులో ఆయన మంత్రిగా ఉండగా, ముఖ్యమంత్రిగా కొనసాగి నప్పుడు వివిధ సందర్భాలలో గోరాశాస్త్రి, తేళ్ళ లక్ష్మీకాంతమ్మలతో కలిసి పి.వి. దగ్గరికి వెళ్ళటం ఆనవాయితీ అయింది. తేళ్ళ లక్ష్మీకాంతమ్మ మా కుటుంబానికి సన్నిహిత స్నేహితురాలు. ఆమె చిరకాలంగా రాజకీయాలలో ఉంటూ పి.వి.కి దగ్గరైంది. చాలా చనువుగా కొన్ని పర్యాయాలు చులకనగా పి.వి.నుద్దేశించి మాట్లాడేది. అది చాటున కాదు, ఎదుటే. నేను ఆశ్చర్యపోయిన సందర్భాలున్నాయి. ఉత్తరోత్తరా పి.వి. ఇంగ్లీషులో "ది ఇన్ సైడర్" అనే నవల రాసి లక్ష్మీకాంతమ్మను ఒక పాత్రగా చేసి అన్యాపదేశంగా ఎత్తిపొడిచారు. అది గ్రహించిన లక్ష్మీకాంతమ్మ బాహాటంగానే ఆయనను ఖండించింది.

నన్ను రాడికల్ హ్యూమనిస్టుగానే పి.వి. పరిగణిస్తూ పోయారు. ఆయన పదవిలో ఉన్నా లేకపోయినా నేను స్నేహపూర్వకంగానే కలుస్తూ ఉండేవాడిని. చనువుగా ప్రశ్నలడిగేవాడిని. కానీ ఆయన దగ్గరనుండి అసలు విషయం రాబట్టటం అంత తేలిక కాదు. కరణం లౌక్యం అంతా ఉపయోగించేవాడు. ఉదాహరణకు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించబోయేముందు కొన్నాళ్ళు పి.వి.ని దూరంగా పెట్టింది. అప్పుడు హైదరాబాదు ఆదర్శనగర్‌లో పి.వి. ఉండేవారు. ఆమెపై వ్యంగ్య విమర్శనాత్మక రచన ఒకటి తలపెట్టారు. నేను కలసినప్పుడు ఒకటి రెండు పేరాలు వినిపించారు. అయితే అది ఇందిరాగాంధీని ఉద్దేశించిందా అని అడిగితే చెప్పలేదు. ఈలోగా ఇందిరాగాంధీ పిలుపు రావడం, ఢిల్లీ రాజకీయరంగంలో పి.వి. ప్రవేశించడం, కీలకపాత్ర వహించడంతో ఆమెపై ఆగ్రహాన్ని దాచేశారు.

విశ్వనాథ సత్యనారాయణ సుప్రసిద్ధ నవల వేయిపడగలు హిందీలో 'సహస్రఫణి' శీర్షికన పి.వి.నరసింహారావు అనువదించారు. నేను ఒకటి రెండుసార్లు ఈ విషయమై నిరసనను ఆయనకు సూచన ప్రాయంగా తెలియజేసాను. ఆయనేమీ అభ్యంతరపెట్టలేదు. అయితే హైదరాబాదు ఆకాశవాణిలో హిందీ విభాగంలో రామమూర్తి రేణూ పనిచేస్తుండేవారు. అదే విభాగంలో నా మిత్రుడు

దండమూడి మహీధర్ ఉన్నందున నేను వెళ్ళి రామమూర్తిగారిని కూడా పలకరిస్తూ ఉండేవాడిని. అప్పుడు తెలిసిన విషయం ఏమంటే సహస్రఫణి ఆయన రాస్తున్నాడని, కొన్నాళ్ళ తరువాత అది పి.వి.నరసింహారావు పేరుతో ప్రచురితమైంది. ఇరువురిలో ఎవరు ఏమేరకు అనువదించారో వివరాలు తెలియవు. రామమూర్తి గారిని ఒకసారి ఆ విషయం ప్రస్తావించి మీరు అనువదిస్తున్న సహస్ర ఫణి పి.వి. గారి పేరుతో వచ్చిందేమిటి? అంటే ఆయన మౌనంగా సమాధానం ఇచ్చారు.

శాసనసభలో, లోక్‌సభలో పి.వి. చాలా బాగా రాణించిన రాజకీయవాది. ఆయన బాగా సిద్ధపడి వచ్చి మాట్లాడేవాడు. ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో సమైక్యవాదిగా నిలబడ్డారు. తరువాత ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు, సీలింగు పరిమితులు తలపెట్టినప్పుడు ఆయనపై భూస్వామ్య వర్గాలు తిరుగబడ్డాయి. అప్పుడు వచ్చిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాన్ని కూడా చేదు అనుభవంగా పి.వి. చవిచూశారు.

ఆయన కేంద్రానికి వెళ్ళిన తరువాత నేను కలుసుకోవటం తగ్గింది. హైదరాబాదు వచ్చినప్పుడు రాజ్‌భవన్‌లో కొన్నిసార్లు కలిసి మాట్లాడుకున్నాం.

పి.వి. ప్రధానిగా ఉన్నప్పుడు ఒకసారి అమెరికా రాజధాని వాషింగ్టన్‌కు వచ్చి అక్కడ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. (దానిని హౌస్ అంటారు) నేను ప్రెస్‌లాబీలో ఉండి ఆయన ప్రసంగం విన్నాను. బాగా మాట్లాడారనిపించింది. ఆ రోజులలో నేను వార్త దినపత్రిక విదేశీ ప్రతినిధిగా వాషింగ్టన్‌లో ఉన్నాను. అటువంటి అక్రెడిషన్ రావడానికి మిత్రులు, వార్త ఎడిటర్ కె.రామచంద్రమూర్తి గారు తోడ్పడ్డారు. అక్కడనుండి తరచు వార్త వ్యాసాలు, ఇతర విశేషాలు పంపగా ప్రచురించేవారు. ఆశ్చర్యమేమంటే దేశ ప్రధానిగా పి.వి. మాట్లాడితే మర్నాడు అమెరికా దినపత్రికలలో ఒకమాట రాలేదు. నేను ఆశ్చర్యపోయాను. అంత క్రితం చిన్న దేశాలైన కొరియా వంటి దేశాల ప్రధానులు మాట్లాడితే ప్రముఖంగా ప్రచురించడం చూశాను. ప్రెస్‌క్లబ్‌లో కొందరిని కదిలించి చూస్తే పి.వి. బాగా

మాట్లాడటం ప్రధానం కాదు. అందులో కొత్త అంశం కానీ, అగ్రరాజ్యాన్ని ఆకర్షించే ప్రతిపాదనలు లేనందువలన అశ్రద్ధకు గురైందని చెప్పారు. అదే సందర్భంగా ఆయన ఒక మ్యూజియం సందర్శిస్తే అది ముఖ్యమైన వార్తగా వేశారు. అప్పుడు పి.వి.ని కలిశాను. ఆయన వెంట కొందరు జర్నలిస్టులు వచ్చారు. అలా వచ్చిన వారిలో కల్యాణీశంకర్ ఉన్నది. ఆమె హైదరాబాదులో జర్నలిస్టుగా యు.ఎన్.ఐ.లో సీతారాం దగ్గర పనిచేసింది. తరచు ప్రెస్ కాన్ఫరెన్సుల తరువాత నా దగ్గరకు వచ్చి వివరాలు వివరణలు అడిగి రాసుకునేది. ఆ తరువాత ఆమె ఢిల్లీలో జర్నలిస్టుగా ఉంటూ చాలా ప్రముఖ స్థానాలు ఆక్రమించింది. పి.వి.కి బాగా దగ్గరైంది. ఒక సందర్భంలో ఆమెను పక్కన కూర్చుండబెట్టుకుని తిరుపతిలో కల్యాణ మహోత్సవంలో కూడా పాల్గొన్నారు.

పి.వి. ప్రధానిగా ఉండగా మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా తీసుకు రావడం దేశ ప్రగతిలో కీలక మార్పుకు నాంది పలికింది. ఆ ఖ్యాతి పి.వి.కిదక్కాలి. మరొకవైపు బాబ్రీ మసీదు కూలగొట్టడం కూడా ఆయన హయాంలోనే జరిగింది. చూసీ చూడనట్లు పోనిచ్చాడనే నెపం ఆయనపై ఉన్నది.

పి.వి. వృద్ధాప్యంలో కంప్యూటర్ నేర్చుకుని వాడటం విశేషం. ఆయన రాజకీయ జీవితాన్ని జర్నలిస్టుగా ప్రారంభించి, కాకతీయ పత్రిక నడిపి అందులో జయ అనే మారుపేరుతో 1950 ప్రాంతాలలో రాసేవాడు. బహుభాషలు నేర్చి ప్రయోగించాడు.

పి.వి. పెయ్యనాకుడు విధానాన్ని అనుసరించి సమస్యలు తేల్చకుండా నాన్చి రాజకీయాలలో జిడ్డు వ్యవహారాలు నడిపాడని పేరున్నది. కొన్నిటిలో ఇది నిజమే. అలా ఉన్నప్పుడు సమస్యలు వాటంతటవే సద్దుకుపోతుండేవి. పి.వి.లో మరొక కోణం ఏమంటే కళలు, సాహిత్యం, రసజ్ఞత పట్ల అభిరుచి ఉండటం.

పి.వి.కి చాలామంది సన్నిహితులుగా ఉండేవారు. కొంతమందికి పరోక్షంగా మరికొంతమందికి ప్రత్యక్షంగా సహాయపడ్డారు. తన బాల్యమిత్రుడు సుప్రసిద్ధ

కవి కాళోజీ నారాయణరావుకు పద్మభూషణ్ ఇప్పించినప్పుడు ఇబ్బందికర సన్నివేశం ఏర్పడింది. కమ్యూనిస్టులతో సన్నిహితంగా ఉంటున్న కాళోజీ అది స్వీకరించడానికి తటపటాయిస్తే పి.వి. పట్టుబట్టి ఒప్పించారు.

పి.వి.ని గ్రామంలో దొర అనేవారు. ఆయన దేశ్‌ముఖ్. ఎన్నో ఎకరాల ఆస్తి సాగులేకుండా వృథాగా పడుండేది. దేశంలో పరోక్షంగా బి.జె.పి. మతతత్వాన్ని వెనకేసుకొచ్చినట్లు బాబ్రీమసీదు సంఘటనతో విమర్శకులు ఆరోపణలు చేయక పోలేదు. తెలుగువాడు ప్రధాని అవుతున్నాడని ఆయనపై నంద్యాల పార్లమెంట్ సీటు ఎన్నికలలో ఎన్.టి.రామారావు ఆయనపై పోటీ పెట్టకపోవడం గమనార్హం.

❊

# జలగం వెంగళరావు



(1922-1999)

కాంగ్రెస్ పార్టీ ఆఖరి ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు పేరు చరిత్రలో చిరస్థాయిగా ఉంటుందని 1978లో శ్రీశ్రీ ఒక ఇంటర్వ్యూలో జోస్యం చెప్పారు. అది దారుణంగా విఫలమయింది. ఆ తరువాత కాంగ్రెస్ ముఖ్య మంత్రులు రాష్ట్రాన్ని పరిపాలిస్తూనే ఉన్నారు.

ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా, పంచాయత్‌రాజ్ ఛాంబర్ అధ్యక్షుడుగా వివిధ దశలలో వెంగళరావును నేను కలుసుకున్నాను. ఆయనతో సన్నిహితత్వం కూడా ఏర్పడింది. ముఖ్యమంత్రిగా ఆయన ఛాంబర్‌లో కలుస్తున్నప్పుడు కొందరు పత్రిక విలేఖరులను చులకనగా, ఒక్కొక్కసారి అరే, ఒరే అని కూడా సంబోధించే వారు. అందుకు మినహాయింపుగా హిందూ పత్రిక రాజేంద్రప్రసాద్, నేను, ఇంకొందరం ఉండేవాళ్ళం. ఆయన అలా కొందరిని పిలవటం మాకు కష్టంగా ఉన్నా ఆ విలేఖరులు అభ్యంతర పెట్టకపోవటం ఆశ్చర్యం వేసింది. ఉత్తరోత్తరా తెలిసిందేమంటే, కక్కుర్తిపడి చిన్న చిన్న పనులకోసం చేయి చాపుతూ ఆశ్రయించిన వారు అలా పడి ఉన్నారని తెలిసింది. అయినా అదేమంత గౌరవప్రదమయిన విషయం కాదు.

పంచాయతీ వ్యవస్థపట్ల ఆయనకుగల ఆసక్తి, శ్రద్ధను బట్టి నేను, జి.రామిరెడ్డి, కె.శేషాద్రి ఆయనకు దగ్గరయ్యాము. అనేక విషయాలు చర్చించాము. ఆ సంబంధం కొనసాగింది. తరువాత వెంగళరావు ఖమ్మం జిల్లా ముఠా రాజకీయాల నుండి ఎదిగి, రాష్ట్రస్థాయిలో సంజీవరెడ్డి అనుకూలుడుగా రాజకీయాలలో కీలకపాత్ర పోషించాడు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఆరంభమయినప్పుడు, ఖమ్మంలో రవీంద్ర అనే విద్యార్థిని నిరాహారదీక్షకు కూర్చుండబెట్టి ఆందోళనకు నాంది పలికింది వెంగళ

రావే. అచిర కాలంలోనే ఆయన మంత్రివర్గంలో చేరి హోంమంత్రి అయ్యారు. అంతటితో ప్రత్యేక తెలంగాణా వదిలేశారు. హోంమంత్రిగా వెంగళరావు పోలీసుకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఆయన చెప్పిందొకటే. మీరేంచేస్తారో నాకనవసరం. కానీ నక్సలైట్ల గురించి నాదాకా ఫిర్యాదులు రాకూడదు. మీమీదకు ఎలాంటి నెపం లేకుండా చూసే బాధ్యత నాది. అది ఆసరాగా తీసుకొని పోలీసులు విజృంభించి ఎన్‌కౌంటర్ల పేరుతో చాలామందిని హతమార్చారు. ఉత్తరోత్తరా ఈ విషయమై ఆరోపణల పరంపరను తట్టుకోవడానికి జస్టిస్ విమద్ లాల్ కమిషన్ వేశారు. మానవవాద సంఘాలలో కృషి చేస్తున్న మేము వెంగళరావు ధోరణిని నిరసించాము. విమద్ లాల్ కమీషన్ ముందు వాదించటానికి జస్టిస్ వి.ఎం. తార్కొండేను ఒప్పించి, ఎం.వి.రామమూర్తి, నేను తీసుకువచ్చాము. మిత్రులు, పెద్దలు కన్నభిరాన్ అండగా నిలిచారు. వామపక్షాలు ఆయన వాదించటం పట్ల చాలా సంతోషించాయి.

వెంగళరావు ముఖ్యమంత్రి కావడం విచిత్ర సన్నివేశం. ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాల వూపు తరవాత పరిస్థితి సద్దుమణగడానికి ప్రత్యేకాధికారి సరీన్‌ను నియమించారు. ఆరు నెలలు రాజకీయాలకు స్వస్తి పలికేసరికి అధికారం చవిచూచినవారు గిలగిలలాడిపోయారు. మరొకవైపు కేంద్రంలో శ్రీమతి ఇందిరా గాంధీ ఉభయ ప్రాంతాలకు అమోదయోగ్యమయిన తెలంగాణా వ్యక్తి ఉంటే బాగుంటుందని ఆలోచించారు. అప్పుడు నూకల రామచంద్రారెడ్డి, జి. రాజారాం పేర్లు ప్రముఖంగా వచ్చాయి. ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన పి.వి.నరసింహా రావు ఈ విషయంలో లోపాయికారిగా వెంగళరావు పేరు తెచ్చారు. సయోధ్య అయోధ్య వాదాల మధ్య వెంగళరావుకు మద్దతు ఎంత ఉన్నదో బేరీజు వేస్తే 155 మంది వ్యతిరేకత చూపారు. కానీ రాజకీయాలలో తెరవెనుక జరిగే తంతు జనానికి ఒక పట్టాన తెలియదు. నవభారత్ కంపెనీ చౌదరి చిరకాలంగా వెంగళరావుకు అనుకూలుడు. ఆయన మరికొందరు కలిసి ఎలాగైనా వెంగళరావు ను రంగంమీదకు తీసుకురావాలని ప్రయత్నించారు. కేంద్రంలో ఇందిరాగాంధీకి దగ్గరగా ఉన్న దీక్షిత్ వంటివారికి వెంగళరావు పేరు సూచించారు. కొత్త రఘు

రామయ్య కూడా అందుకు అనుకూలత కనబరిచారు. ఆయనకు ఉన్న వ్యతిరేకత విషయం దాచిపెట్టి పూర్తి మద్దతు ఉన్నట్లు చెప్పారు. ఒకసారి ఇందిరాగాంధీ పేరు చెప్పినతరువాత వ్యతిరేకత కాస్తా అనుకూలంగా మారింది. ఇందులో కొందరు ప్రముఖ పోలీసులు సైతం తమ పాత్ర నిర్వహించకపోలేదు. మొత్తం మీద వెంగళరావు ముఖ్యమంత్రి కావటం ఆయన అదృష్టం. పైగా ఆయన హయాంలో ఎమర్జెన్సీ ఉండటం వల్ల ఎదురులేని పాలన సాగింది. విమద్ లాల్ కమిషన్ విచారణ సయితం ఆయన పదవిని కదిలించలేకపోయింది.

ముఖ్యమంత్రిగా వెంగళరావు నిర్ణయాలు తీసుకోవటం అమలు పరచటం చకచకా చేసేవాడు. డబ్బు మనిషి అనే పేరు తెచ్చుకోలేదు. ఆయన దగ్గరున్న సిబ్బంది అవసరమైతే డబ్బు విషయాలు చూసేవారు. కనుక ప్రత్యక్షంగా ఆయనపై నెపం వెయ్యడానికి వీలుండేది కాదు.

ఎమర్జెన్సీ ప్రకటించటంతో ఇందిరాగాంధీ నిర్ణయం వెనుక ఉన్న రహస్యాన్ని వెంగళరావు బయటపెట్టదలుచుకున్నారు. రాజకీయాల నుండి విరమించిన తరువాత నా జీవితకథ అనే శీర్షికన పుస్తకం వ్రాశారు. ఆ సందర్భంగా జస్టిస్ ఎమ్.ఎల్.సిన్హా అలహాబాద్ హైకోర్టులో ఇచ్చిన పిలుపుపై వ్యాఖ్యానాలు చేశారు. దీనికి ఆయన తీవ్ర అభ్యంతరం తెలియజేస్తూ కోర్టు ధిక్కార నేరం కింద కేసు పెడతానన్నారు. వెంగళరావు క్షమాపణ చెప్పి బేషరతుగా పుస్తకాన్ని వెనక్కు తెప్పించి ఆ అంశాన్ని తొలగించి మరొక ప్రచురణ చేశారు. ఆయన రాసిన చరిత్రలో పి.వి. నరసింహారావు, నాదెండ్ల భాస్కరరావు, కాసు బ్రహ్మానందరెడ్డిలపై అనేక విషయా లలో విమర్శలు చేశారు.

వెంగళరావు పదవిలోనూ ఆ తరువాత హైదరాబాదులోని ద్వారకాపురి కాలనీ ఇంట్లో ఉండేవారు. బాగా పుస్తకాలు చదవటం అలవాటు చేసుకున్నారు. నేను, ఎస్.వి.పంతులు నిరంతరం ఆయనను కలుస్తుండేవాళ్ళం. పోలీసు అధికారి బాలాజీ నమ్మినబంటుగా వెంగళరావుపట్ల ఇష్టంగా సేవలు చేసేవాడు. అనేక విషయాలు అరమరికలు లేకుండా అడిగినవాటికి తడుము కోకుండా వెంగళరావు

చెప్పేవారు. ఎమర్జెన్సీ కాలంలో వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉండగా సంజయ్ గాంధీ ఆంధ్రలో పర్యటించడం ఆ సందర్భంగా వచ్చిన ఆరోపణలు, కళాపోషణ అంశాలు ప్రస్తావిస్తే దాటవేసేవారు. రాజకీయాలలో ఇలాంటివి ఎన్నో వస్తూనే ఉంటాయి అనేవారు.

నేను ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్‌గా వెంగళరావును కలిసే రోజులలో ఒకసారి అసెంబ్లీ ఎన్నికలు రాగా ముఖ్యమంత్రి ఛాంబర్‌లోనే వెనుక గదిలో అభ్యర్థులకు డబ్బులు పంచటం గమనించాను. ఆశ్చర్యపోయాను. వెంగళరావు దగ్గర ఉండే ప్రకాశరావు, సీతాపతి వంటివారు ఆఫీసులో కీలకపాత్ర వహించేవారు. ప్యూనుగా ఉన్న లోకయ్య ఎంతో ప్రముఖుడుగా ఉండేవాడు. వెంగళరావు సమయపాలన బాగా పాటించేవారు. అందువలన ఆయన కార్యక్రమాలకు పేచీ ఉండేది కాదు.

1975లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు తన మంత్రి మండలి వెంకటకృష్ణారావుకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. సభలు జయప్రదంగా జరిగాయి. అటు వెంగళరావుకు ఇటు వెంకటకృష్ణారావుకు మంచి పేరు వచ్చింది. ఆ సందర్భంగా నేను ప్రొఫెసర్ రాబర్ట్ ఫ్రికెన్ బర్గ్‌ను వెంకట కృష్ణారావుకు పరిచయం చేశాను. ఆయన వెంగళరావు దగ్గరకు తీసుకువెళ్ళి ప్రొఫెసర్ పూర్వాపరాలు చెప్పారు. అదొక గొప్ప అనుభవం. ఫ్రికెన్ బర్గ్ ఒక పాస్టర్ కుమారుడు. గుంటూరు జిల్లాలో పుట్టాడు. తెలుగు బాగా మాట్లాడేవాడు. తరువాత ఆయన అమెరికాలో విస్కాన్ సిన్ యూనివర్సిటీలో రాజకీయ చరిత్ర ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. అక్కడే వెల్చేరు నారాయణరావుగారు కూడా పనిచేశారు. నేను ఫ్రికెన్ బర్గ్‌తో అమెరికాలో ఉండగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాను. ఆయన చాలా సంతోషించారు. వెంగళరావు, వెంకట కృష్ణారావును గుర్తుపెట్టుకుని అభినందించారు. ఆయన 'గుంటూరు జిల్లా' అనే శీర్షికన మంచి చారిత్రక పరిశోధనాత్మక పుస్తకం వ్రాశారు. దానిని ఆక్స్‌ఫర్డ్ ప్రచురణల వారు వెలువరించారు. ఆయనతో ఇప్పటికీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూనే ఉన్నాను.

ఒకసారి సత్తుపల్లిలో కాళోజీ నారాయణరావు స్వతంత్ర అభ్యర్థిగా వెంగళరావుపై పోటీ చేసినప్పుడు వామపక్షాలవారు ఆయనను సమర్థించారు. రిపోర్టరుగా నేను పర్యటన చేసి ఎన్నికల వార్తలు సేకరించాను. అప్పుడు వెంగళరావును కలిస్తే డిపాజిట్టు పోయే సీటకు వామపక్షాలవారి హడావుడి ఇంతెందుకు అన్నారు. ఆయన అలా మాట్లాడటం అలవాటే.

ఖమ్మం జిల్లాలో కొన్నిసార్లు ఆయన పర్యటిస్తున్నప్పుడు నన్ను, ఎస్.వి. పంతులును వెంటబెట్టుకెళ్ళారు. చాలా ఆదరంతో చూసేవారు. గిరిజన ప్రాంతాలలో అధికార పర్యటన ఏర్పాటు చేసినపుడు హెచ్.కె.బాబు ఆ శాఖ డైరెక్టరుగా ఉండేవారు. నేను గిరిజన వాసులను ఇంటర్వ్యూ చేసి ప్రత్యక్షంగా విషయాలు తెలుసుకొని ఆంధ్రజ్యోతిలో పెద్ద రిపోర్టు రాశాను. అందులో కొన్ని ప్రభుత్వానికి వ్యతిరేకమైన వ్యాఖ్యలున్నాయి. డైరెక్టరు హెచ్.కె.బాబు నాపై వెంగళరావుకు ఫిర్యాదు చేశాడు. ఆయన పట్టించుకోకపోగా ప్రభుత్వం కళ్ళు తెరిపించినందుకు నన్ను అభినందించారు.

⁕

రెండుసార్లు ముఖ్యమంత్రి

# డా॥ మర్రి చెన్నారెడ్డి



(1919-1996)

'దేవర్ బాబా' కాలు చెన్నారెడ్డి నెత్తిపై పెట్టి దీవించాడు. ఆయన ఉత్తర ప్రదేశ్‌లో ఒక చెట్టుకొమ్మ మీద కూర్చుండే బాబా. అక్కడ డా॥ చెన్నారెడ్డి గవర్నర్‌గా చేశారు. ఆ ఫొటో 'సెక్యులరిస్ట్' ఇంగ్లీషు మాసపత్రిక ముఖచిత్రంగా వేశారు. అప్పట్లో దానికి ఎడిటర్ ప్రొ॥ ఎ.బి.షా. అది చెన్నారెడ్డి దృష్టికి వచ్చింది. ఆయన ఆగ్రహంతో ఊగిపోయి, 'పిలవండి...ఆ ఇన్నయ్య ఎక్కడ ఉన్నాడో, సంగతేంటో తేల్చుకుందాం' అన్నాడు. నాకు కబురు చేశారు. వెళ్ళాను. ఆ పత్రికను చూపి విసిరికొట్టి, నా మీద నీకు ఎంత కోపం ఉంటే మాత్రం ఇలా చేస్తావా అన్నాడు.

నేను చెన్నారెడ్డి షష్ఠిపూర్తి సంచికలో పూర్తి పేజీలో రంగులతో వేసిన దేవర్ బాబా కాలు పెట్టి దీవించిన చిత్రం ఆయన ముందు పెట్టాను. అది చెన్నారెడ్డి ఆమోదంతో ఆయన అభిమాని పరమహంస తయారుచేసిన సావనీర్. చెన్నారెడ్డి అవాక్కయిపోయాడు. ఆగ్రహంలో వివేచన మరచిపోవడం సహజం. నాకు చెన్నారెడ్డికి 1958 నుండి సన్నిహిత పరిచయం మొదలైంది. ఆది నుండి అది లవ్-హేట్ సంబంధంగానే కొనసాగింది. స్వతంత్ర పార్టీ ఆవిర్భవించిన తొలి రోజులలో విజయవాడలో ఆచార్య రంగా మొదలైనవారి సమక్షంలో జరిగిన సభలో చెన్నారెడ్డి ఆవేశంగా మాట్లాడుతూ, కాంగ్రెస్‌లో ఉండేబదులు, కృష్ణలో దూకి చావటం మేలని చప్పట్ల మధ్య ప్రసంగించారు. తరువాత హైదరాబాద్ వచ్చి కాంగ్రెస్‌లో చేరిపోయాడు. ఆయన మాట్లాడిన సభలో నేను, ఎస్.వి.పంతులు మొదలైనవారంతా ఉన్నాము. అప్పుడే చెన్నారెడ్డితో నా తొలి పరిచయం. ఆ తరువాత ఆయన చనిపోయే వరకూ అన్ని పరిస్థితులలోనూ కలుస్తూనే ఉన్నాము.

మరోసారి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర రాసినప్పుడు కూడా చెన్నారెడ్డి పదవిలో ఉండగా అవినీతి విషయాలను ప్రస్తావించిన సంగతులు కొందరు ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. నా పుస్తకాన్ని విసిరి కొట్టినట్లు అక్కడ ఉన్నవారు చెప్పారు. ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి రాకముందు, ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సారధిగా ఆయన వుర్రూత లూగించినప్పుడు ఎన్నిసార్లు కలిశానో చెప్పలేను. నా మీద ఎంత కోపమున్నా, మరొక పక్క ఆదరంగానే చూసేవాడు. తెలంగాణా ఉద్యమం తారాస్థాయిలో ఉండగా కొందరు ఆంధ్రప్రాంత మిత్రులు ఆయన్ను కలవాలనే కోరిక వెళ్ళబుచ్చారు. అడ్వకేట్ ఎన్.కె.ఆచార్య, మానవవాది కొసరాజు సాంబశివ రావు, జర్నలిస్ట్ ఎ.ఎల్.నరసింహారావు వారిలో ఉన్నారు. ఆనాడు చెన్నారెడ్డి ఒక టెర్రర్. ఆంధ్రులు ఆయన్ని కలిసేవారు కారు. నేను వీరిని

వెంటబెట్టుకుని తార్నాకాలో ఆయన గృహానికి వెళ్ళినప్పుడు, 'మీరంతా తెలంగాణా వారితో కలిసి ఉద్యమంలో పాల్గొంటే మీ జోలికి ఎవరూ రారు' అని సలహా చెప్పారు. వెళ్ళినవారు మౌనంగా వచ్చేశారు. నేను తరువాత ఆయనతో, అయితే తెలంగాణా వారితో ఉద్యమంలో కలవకపోతే ఏమైనా చేయవచ్చు అని సందేశం ఇస్తున్నారా అని అడిగాను. ఆయన కాసేపు కూర్చోబెట్టి ఆచార్య రంగా, లచ్చన్న మొదలైన వారి విషయాలు అడిగారు. మా ఇరువురికి అవి కామన్ టాపిక్స్.

ముఖ్యమంత్రిగా ఉండగా ఎన్నిసార్లు చెన్నారెడ్డితో తారసిల్లానో చెప్పలేను. ఒకసారి జర్నలిస్ట్ కాలనీకి వచ్చినప్పుడు, ఆయన ఉపన్యాసం చెబుతూ, కొత్త జర్నలిస్ట్ కాలనీలు ఏర్పాటు చేద్దామని ఉందనీ, అయితే జర్నలిస్టుల పేర్లు పెట్టాలంటే సుప్రసిద్ధ తెలుగు వారి పేర్లు కనిపించటం లేదని అన్నారు. 'ఎం. చలపతిరావు కాలనీ'కి ప్రారంభోత్సవం చేస్తూ అన్నమాటలవి. కొండా లక్ష్మారెడ్డి నన్ను ధన్యవాదాల ప్రసంగం చేయమన్నాడు. అప్పుడు నేను మాట్లాడుతూ కొత్త జర్నలిస్టుల కాలనీలు ఇస్తామని అన్నందుకు చెన్నారెడ్డిగారికి ధన్యవాదాలని అంటూ ఎన్ని కాలనీలు పెడితే అంతమంది సుప్రసిద్ధ తెలుగు జర్నలిస్టుల పేర్లు చెబుతామని, ఉదాహరణగా నార్ల వెంకటేశ్వరరావు, కోటంరాజు పున్నయ్య, కోటం రాజు రామారావు, సి.వై. చింతామణి, ఖాసా సుబ్బారావు అలా పేర్లు వల్లించాను. జనం చప్పట్లు కొట్టారు. చెన్నారెడ్డికి మళ్ళీ కోపం వచ్చింది. కానీ ఏమీ అనలేదు.

చెన్నారెడ్డి మంత్రివర్గం ఏర్పాటు చేసినప్పుడు ఆయనకు అతి సన్నిహితు డను అని చెప్పుకుంటున్న నాదెండ్ల భాస్కరరావుకు తొలుత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆయన అలిగి కూర్చున్నప్పుడు తరువాత ఆర్థిక ప్రణాళిక శాఖ ఇచ్చాడు. మళ్ళీ కొన్నాళ్ళకు ఆయనను బాగా తగ్గించేశారు. భాస్కరరావు ఎన్ని ఫిర్యాదులు చేసినా చెన్నారెడ్డి ఏమీ చేయలేకపోయాడు. అనేక ప్రెస్ మీటింగులలో ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసేవాణ్ని. కొన్నిసార్లు ఆయన సమాధానం చెప్పటానికి కుదరక నీవే దానికి జవాబు చెప్పు అనేవాడు. మరోసారి ఢిల్లీ నుండి తిరిగి బేగంపేట విమానాశ్రయానికి వచ్చినప్పుడు చెన్నారెడ్డిని తొలగించి వేరే వారిని పెట్టబోతున్నా రని వార్త ప్రబలింది. విపరీతంగా ప్రెస్ వారు ఎయిర్ పోర్టుకు వచ్చారు. అక్కడ పత్రికల వారిని కలిసినప్పుడు వారంతా ఆయనకు పదవిపోయినట్లు సానుభూతిగా ప్రశ్నలు వేస్తుండగా నేను, కంగ్రాచ్చు లేషన్స్ చెన్నారెడ్డిగారు, మీరు ముఖ్య మంత్రిగా కొనసాగుతున్నారుగా అన్నాను. ఆయన నవ్వుతూ ఏమో నీకే తెలియాలి అని దాటేసి వెళ్ళిపోయారు. ప్రెస్ వాళ్లు ఆశ్చర్యపోయారు. అక్కడ ఉన్న ఉమా

వెంకట్రామరెడ్డి సంతోషంగా, ఆశ్చర్యంగా నా దగ్గరకు వచ్చి, ఏమండి మీరు చెప్పేది నిజమేనా అని ఆత్రుతగా అడిగారు. ఆ తరువాత కొన్నాళ్ళకుగాను చెన్నారెడ్డిని తొలగించి అంజయ్యను పెట్టారు.

చెన్నారెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. దానికి ముందు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. అప్పుడు గాంధీ భవన్‌లో కలిసేవాడిని. ఆ తరువాత ముఖ్యమంత్రిగా మరికొన్నిసార్లు కలుసుకొన్నాను. చెన్నారెడ్డి రాగద్వేషాలు విపరీతంగా ఉన్న వ్యక్తి. ఆగ్రహావేశాలను దాచుకోకుండా వ్యక్తం చేసేవాడు. ఆయన్ను ప్రత్యేక ఇంటర్వ్యూలు చేసినప్పుడు జస్టిస్ పింగళి జగన్‌మోహన్ రెడ్డిని గురించి, కొందరు కాంగ్రెస్ నాయకుల గురించి చాలా ఘాటుగానే స్పందించేవారు. ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలి రోజులలో డాక్టర్‌గా ప్రాక్టీసు పెట్టడం, పత్రిక నడపటం మొదలైన ఎన్నో విశేషాలు వివరంగా చెప్పేవాడు. ప్రత్యేక తెలంగాణాలో ఆయన పాత్ర వేరు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన ధోరణి వేరు. రాజకీయాలలో అవినీతి అంశం చెన్నారెడ్డి కాలంలో ఒక ప్రత్యేకమైన చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తులాభారాలు జరిపించిన తీరు జనాకర్షణ అయింది. చెన్నారెడ్డి నిర్భీతిగా వ్యవహరించేవారు. సభలలో తనకు ఇష్టమైనవారిని స్టేజిమీదకు పిలిచి కూచోబెట్టేవారు. అలాంటి అదృష్టం శ్రీమతి దుర్గా భక్తవత్సలం వంటివారికి దక్కింది. చెన్నారెడ్డి పదవిలో వుంటే క్షేమం అని వి.బి.రాజు అనేవాడు. శత్రువులను సైతం లోబరుచుకొన్న రాజకీయ చతురత ఆయనకున్నది. తనపై పోటీ చేసి ఓడించిన వందేమాతరం రామచంద్రరావును పిలిచి అధికార భాషా సంఘాధ్యక్షుణ్ణి చేసిన చెన్నారెడ్డి, అరమరికలు లేకుండా తన మామ పేరిట కె.వి.రంగారెడ్డి జిల్లా అని రూపొందించారు. మార్క్సిస్టు పార్టీ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యను డ్రైనేజి బోర్డు ఛైర్మన్‌గా ఒప్పించటం చెన్నారెడ్డికే తగింది. ముఖ్యమంత్రిగా ఉండగా ఒకసారి ఆరోగ్యపరీక్షల నిమిత్తం ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి పరీక్షలు చేయించుకున్నారు. ఆ పక్క గదిలోనే మేనకా గాంధీ కూతురుని ప్రసవించింది. అందరికంటే ముందు వెళ్ళి అభినందనలు చెప్పబోగా అక్కడే ఉన్న సంజయ్‌గాంధీ "రాజీనామాకు సిద్ధంగా ఉండండి" అనేసరికి బిత్తర పోయాడు. హైదరాబాదు వచ్చేసరికి అలాంటి సన్నివేశమే జరిగింది.

*

నేను రెడ్డినే అన్న

# ముఖ్యమంత్రి అంజయ్య



(1919-1986)

అసలు పేరు తాళ్ళ అంజయ్య కానీ అది కూడా ఏకాభిప్రాయంతో లేదు. తన పేరు టంగుటూరి కృష్ణారెడ్డి అని, తాను రెడ్డినే అని అంజయ్య ముఖ్యమంత్రి అయిన తరువాత చెప్పారు. అంతకుముందు అంజయ్య అంటే వెనుకబడిన తరగతులకు ప్రతినిధి అని అందరూ భావించేవారు.

ఆల్విన్ కంపెనీలో ఆరణాల కూలీగా ఆరంభమైనట్లు చెప్పుకున్న అంజయ్య పేదవారికోసం, గుడిసెలలో బతుకుతున్న వారికోసం చాలా కాలం రాజకీయంగా కృషిచేశారు. ఆడంబరాలు లేకుండా సింపుల్‌గా జీవితం గడుపుతూ చలాకీగా మాట్లాడుతూ, నవ్వుతూ, నవ్విస్తూ ఉండే అంజయ్యను 1969 ప్రాంతాలలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సందర్భంగా కలిశాను. అప్పట్లో చెన్నారెడ్డి ప్రవేశించి ఉద్యమాన్ని ఉధృతం చేసినప్పుడు అంజయ్య కూడా శ్రీమతి ఇందిరాగాంధీపై విసుర్లు విసురుతూండేవాడు. ప్రజాసమితి పక్షాన ఎన్నికలలో పోటీచేసి నెగ్గాడు కూడా. ప్రజాసమితి కాంగ్రెసులో లీనమైన మరునాటి నుండి అంజయ్య తిరుగులేని ఇందిరాగాంధీ భక్తుడైపోయాడు. మిగిలినవారు ఎటు మారినా ఆయన మాత్రం స్థిరంగా ఇందిరా మనిషిగానే నిలిచాడు.

మొట్టమొదట బ్రహ్మానందరెడ్డిని తొలగించి రాష్ట్రంలో మరొక వ్యక్తిని తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న రోజులలో (1972) ముఖ్యమంత్రి కావాలని అంజయ్య ఆశించి ఇందిరాగాంధీని అడిగాడు కూడా. ఆ తరువాత ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టడం దేశంలో ప్రజాబలం కోల్పోవటం జరిగినా అంజయ్య మాత్రం ఆమె పక్షానే నిలిచాడు. తరచు ఢిల్లీ వెళ్లి ఇందిరాగాంధీని, ఆమె కుమారుడు సంజయ్ గాంధీని కలిసేవాడు. సంజయ్ గాంధీకి అత్యంత సన్నిహితుడయ్యాడు. అతను చనిపోయినప్పుడు అంజయ్య అప్‌సెట్ అయ్యాడు. అవన్నీ నేను ప్రత్యక్షంగా గమనించాను. బర్కత్‌పురాలో ఆయన ఇంటికి వెళ్ళి కూర్చొని కబుర్లు చెపుతున్నప్పుడు తోటి కాంగ్రెసు నాయకుల మీద, రాజకీయ విషయాలపైన అరమరికలు లేకుండా వ్యాఖ్యానాలు చేస్తుండేవాడు. మేము నవ్వుకునేవాళ్ళం. ఆయన ముఖ్యమంత్రి అయినప్పటినుండి చెన్నారెడ్డిపై ఫిర్యాదులు చెపుతూనే వుండేవాడు. అవి కొన్ని ఢిల్లీలో కూడా చెప్పాడు. చెన్నారెడ్డి

అపఖ్యాతిపాలై కాంగ్రెసు ప్రతిష్ఠను దిగజారుస్తున్నప్పుడు ముఖ్యమంత్రి కావాలనే తన కోరికను మళ్ళీ అంజయ్య వెలిబుచ్చాడు. ఆయనకు పి.వి.నరసింహారావు మద్దతు పలికాడు. మరొకవైపు సంజయ్‌గాంధీ ఇష్టుడు కావటం వలన ఇందిరా గాంధీ అంజయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. తన చిరకాలవాంఛ తీరినందుకు అంజయ్య సంతోషించాడు.

ముఖ్యమంత్రిగా రాకముందే అంజయ్య కేంద్ర కాంగ్రెసు నాయకులతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. బీహారు కాంగ్రెసు వ్యవహారాలు కూడా కొన్నాళ్ళు చూసాడు. హిందీ, ఉర్దూ మాట్లాడటం, కాళ్లు మొక్కటం కాంగ్రెసు సంస్కృతిలో అంజయ్యకు కలిసివచ్చాయి.

ముఖ్యమంత్రిగా ఆయన 61 మందితో జంబో జెట్ మంత్రివర్గాన్ని ఏర్పాటుచాడు. రాజకీయవర్గాలన్నీ విస్తుపోయాయి. అప్పుడు ఆయనను విలేఖర్లు గా మేము అడిగితే ఏమంత్రికి ఎవరి సిఫారసు ఉన్నదో బయటపెట్టాడు. ఆ విధంగా కాదనలేక జాబితా పెంచుతూ పోయాడు. అయితే కేంద్రం దీనిపై వెంటనే స్పందించి మంత్రివర్గాన్ని కుదించమని చెప్పటంతో ఒక 20 మందిని తొలగించి, వారికి వేరే పదవులు ఇస్తానన్నాడు. అంజయ్య తన మంత్రివర్గంలో నాదెండ్ల భాస్కరరావుకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఒక స్థాయిలో భాస్కరరావు అంజయ్యను లెక్కచెయ్యనట్లుగా ప్రవర్తించాడు. దానిపై అంజయ్య ఆగ్రహించి ఆయనను మంత్రివర్గంనుంచి తొలగించాడు కూడా. భాస్కరరావు 17 పేజీల ఫిర్యాదు రాసి ఇందిరాగాంధీకి పంపించాడు. అయితే, వాటిపై విచారణ జరిపిస్తామని తొందరపడి మరోపార్టీ పెట్టే ప్రయత్నాలు చేయవద్దని ఆమెకు బాలరాజ్ చోప్రా ద్వారా కబురు పెట్టారు. అంజయ్యకు ఢిల్లీలో తగినంత సానుభూతి లేకపోలేదు. ఎవరెన్ని చెప్పినా ఢిల్లీ ఆయనను ఆదరిస్తూనే వచ్చింది.

అప్పట్లో నేను అంజయ్యను చాలా ఎక్కువగా కలుసుకునేవాడిని. ఆయన ప్రియశిష్యుడైన పి.జనార్ధనరెడ్డికి పురావస్తుశాఖ ఇచ్చాడు. ఒకసారి నన్ను పిలిచి మనవాడికి కాస్త దాని సంగతి చెప్పు అన్నాడు. నేను జనార్ధనరెడ్డిని వెంటబెట్టుకుని స్టేట్ ఆర్కైవ్స్ (తార్నాక, హైదరాబాదు)కు వెళ్ళి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించమన్నాను. శాసనసభలో కూడా ప్రశ్నలకు కొన్నిసమాధానాలు ఆయనకు చెపుతుండేవాడిని. జనార్ధనరెడ్డి చాలా వినయంగా స్వీకరించేవాడు.

వివిధ రాజకీయ ఉత్సవాలలో మేము పాల్గొంటున్నప్పుడు, ముఖ్యమంత్రి అంజయ్య యధాలాపంగా, “మన డ్రైవర్లకు, ఆ ప్రెస్ వాళ్ళకు ముందుగా పెట్టండ్రి” అని సదుద్దేశంతోనే అనేవాడు. అందువలన గోల తగ్గుతుందని ఆయన ఉద్దేశ్యం.

అంజయ్య మాట్లాడేదే అసలైన తెలుగని ఆనాడు కవి దాశరథి వ్యాఖ్యానిస్తే పత్రికలు వ్యంగ్య చిత్రాలు వేసి ఎగతాళి చేశాయి. అంజయ్య జోక్స్ కొన్ని ఆయన చెప్పినవి కొన్ని ఆయన పేరిట ప్రచారంలోకి వచ్చినవి వాడుకలో ఉండేవి. ‘సముద్రంలో తేల్ పడిందంట. మనకు ఇంక ఆయిలు కరువు లేదు’ లాంటి ఉర్దూ కలిపిన పదాలు ఆయన ఎన్నో వాడుతుండే వారు. కంటి ఆసుపత్రికి వెళ్ళి అక్కడ లేబర్‌వార్డు లేదా అని అడిగినట్లు చెపుతారు. ఆయనకు లేబర్ అంటే ఉన్న ఇష్టాన్ని ఆవిధంగా చిత్రించారు. ఇలాంటివి ఎన్నో ఉండేవి.

అంజయ్య ముఖ్యమంత్రిగా ఉండగా రాజీవ్‌గాంధీ హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు రాగా ఆయనకు భారీ ఎత్తున స్వాగతం పలికే ఉద్దేశ్యంతో అంజయ్య మందీ మార్బలాన్ని వెంటబెట్టుకుని బేగంపేట విమానాశ్రయానికి వెళ్ళారు. అది నచ్చని రాజీవ్‌గాంధీ ముఖ్యమంత్రి అని కూడా గమనించక, బఫూన్ అని ఈసడిస్తూ మాట్లాడారు. పత్రికలలో అది పతాక శీర్షికలలో వచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు దానిపై స్పందించాయి. అంజయ్య రాజీనామా ఇద్దామనుకున్నాడు. ఆయన అనుచరులు పట్టుబట్టి ఆపారు. కానీ ఆ తరువాత కొద్దికాలానికే అసెంబ్లీ ఎన్నికలు రావటం అంజయ్యకి జరిగిన అవమానం తెలుగువారికి జరిగినట్లుగా ప్రచారంలో విపరీతంగా పాకిపోవటం, కాంగ్రెసు పతనానికి ఒక ప్రధాన కారణం అయింది. అప్పుడే తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది.

ఇంత జరిగిన తరువాత అంత అవమానించిన రాజీవ్‌గాంధీ అదే అంజయ్యను తన మంత్రివర్గంలోకి తీసుకోవటం కాంగ్రెస్ సంస్కృతికి దర్పణం.

అంజయ్య అట్టే కాలం జీవించలేదు. 1986లో చనిపోయాడు. అంజయ్య మిత్రత్వానికి మంచి వ్యక్తి. అది స్వానుభవం.

*

రెడ్డి తొలగించుకున్న

# భవనం వెంకట్రామ్




(1932-2002)

కాంగ్రెసు సంస్కృతి పూర్తిగా రాష్ట్రంలో అమలు జరుగుతున్న రోజులలో కేంద్రం తన ఇష్టం వచ్చినట్లు ముఖ్యమంత్రులను పేకముక్కల వలె మార్చేసింది. చెన్నారెడ్డిని తొలగించి అంజయ్యను, ఆయనను పక్కన పెట్టి భవనం వెంకట్రామ్‌ను ముఖ్యమంత్రిగా చేశారు. అదంతా ఇందిరాగాంధీ అధిష్టానవర్గ చదరంగంలో భాగమే.

1978లో భవనం వెంకట్రామ్ విద్యామంత్రి అయ్యాడు. చెన్నారెడ్డి ఆయనను తరువాత కౌన్సిల్ సభ్యుడుగా చేశారు. ఆ దశలో డా॥ తంగిరాల సుభాష్ నాకు భవనం వెంకట్రామ్‌ను పరిచయం చేశాడు. భవనం వెంకట్రామ్ సోషలిస్టు భావాలతో ఉన్న కాంగ్రెసు వాది. కళలు, సంస్కృతి, భాష, సినిమాల పట్ల బాగా ఆసక్తి ఉన్న రాజకీయవాది. రెడ్డి కులస్తుడైనా కమ్మ కులానికి చెందిన జయప్రదను పెళ్ళి చేసుకున్నాడు. ఇరువురూ గుంటూరు జిల్లాకు చెందినవారే. మెట్ట, మాగాణి అలవాట్ల కలయిక కూడా వారి జీవితంలో ఉన్నది. భవనం వెంకట్రామ్ చక్కగా మాట్లాడేవారు. ఎదుటివారిని ఒప్పించి అంగీకరింప చేయటంలో చాకచక్యులు. కానీ కాంగ్రెసు ముఠా రాజకీయాలలో ఇమడలేక పోయారు.

భవనం వెంకట్రామ్ విద్యామంత్రిగా ఉండగా కేంద్రంలో నెహ్రూ కుటుంబానికి సన్నిహితురాలైన శ్రీమతి షీలాకౌర్ ఢిల్లీలో విద్యామంత్రిగా ఉండేవారు. ఆమె రాష్ట్రానికి వచ్చినప్పుడు భవనం వెంకట్రామ్ పని తీరును ఆయన అభిరుచులను, సంస్కృతిని గమనించి అభినందించారు. ఉత్తరోత్తర అది చాలా పనిచేసింది. ఇందిరా గాంధీకి దగ్గరయిన షీలాకౌర్ రాష్ట్రంలో సంక్షోభం తొలగించటానికి అంజయ్య స్థానే ఎవరిని ముఖ్యమంత్రిని చెయ్యాలా అని ఆలోచిస్తున్న తరుణంలో షీలాకౌర్ భవనం వెంకట్రామ్ పేరు సరైన సమయంలో సరైన వ్యక్తులకు చేరవేసింది. మిగిలినవారెందరో తాము ఒక సమిధను సమర్పించామన్నప్పటికీ అసలు కీలకం అది.

భవనం వెంకట్రామ్‌కు విద్యామంత్రిగా చక్కని అనుభవం వచ్చింది. ఆయన కొన్ని సదస్సులలో పాల్గొని ప్రసంగించటానికి నేను తోడ్పడ్డాను.

ఉదాహరణకు సైంటిస్టులను ఉద్దేశించి హైదరాబాదు జూబిలీ హాలులో విద్యామంత్రిగా ప్రారంభోపన్యాసం చేయవలసి వస్తే నేను ఆయన ప్రసంగాన్ని రాసి ఇచ్చాను. సైంటిఫిక్ మెథడ్ ఎలా అమలు జరపాలి సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళటానికి రాజ్యాంగం రీత్యా దాని ఆవశ్యకతను అందులో రాశాను. ఎ.బి.షా. రాసిన సైంటిఫిక్ మెథడ్‌ను ఆధారంగా తయారుచేసిన ఆ ఉపన్యాసాన్ని భవనం వెంకట్రామ్ బాగా చదువుకొని సభలో మాట్లాడాడు. సైంటిస్టులు చాలామంది ఆయనను అభినందిం చారు. అనుకోని అభినందనకు భవనం పొంగిపోయాడు. తరువాత వచ్చి నాకు చాలా ధన్యవాదాలు చెప్పారు. అప్పటి నుండి మేము అతుక్కుపోయాము.

భవనం వెంకట్రామ్ తటపటాయింపు ఎక్కువగా చేసిన వ్యక్తి. ఒక పట్టాన నిర్ణయాలు తీసుకోగలిగేవాడు కాదు. దానికి కారణం ఆయనకు మద్దత్తుగా రాజకీయ వాదులు లేకపోవడమే. కానీ అన్ని పార్టీల నుండి ఆయనను మెచ్చుకునేవారు ఉండటం గమనార్హం.

ముఖ్యమంత్రి అవుతున్న సందర్భంలో ఢిల్లీ యాత్రలు జరుగుతుండగా భవనం వెంకట్రామ్ నన్ను తోడుగా తీసుకెళ్ళేవారు. ముఖ్యమంత్రి అయిన తరవాత కూడా ఆయన అధికారంలో ఉన్న కొద్దికాలం ఢిల్లీ ఎన్నిసార్లు వెళ్ళినా అన్ని పర్యాయాలు నేనూ వెళ్ళాను. అది మంచి అనుభవం. ఇందిరాగాంధీతో సన్నిహితంగా కలవడానికి ఆమెకు ఆనాడు పి.ఏ.గా ఉన్న పోద్దార్ బాగా తోడ్పడ్డాడు. ఢిల్లీదంతా అర్ధరాత్రి రాజకీయం. భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రిగా ఇందిరాగాంధీని చాలా పొద్దుపోయిన తరవాతనే కలిసేవాడు. అప్పుడే మంతనాలు చేసేవాడు. అది కాంగ్రెసు సంస్కృతిలో భాగమైపోయింది.

ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్‌కు నేను సన్నిహితంగా ఉండటం వలన నా సిఫారసుల కోసం అనేకమంది తిరుగుతూండేవారు. నేను ఏవీ పట్టించుకోక పోవడంవల్ల, నా వల్ల పనులు జరగవని నిర్ధారించుకుని దూరంగా పోతుండేవారు. అదొక గమ్మత్తయిన రాజకీయ వాతావరణం.

నేను స్నేహితుడుగానే భవనం వెంకట్రామ్‌కు మిగిలాను. అయితే రాజకీయాలపై వ్యాఖ్యానాలు చేసేటప్పుడు మాత్రం సన్నిహితత్వాన్ని పక్కకి పెట్టి విమర్శను వ్రాశాను. అది భవనంకు కష్టమనిపించేది. తరువాత మర్చిపోయేవాడు.

మా ఇంటికి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించి ఎన్నో కబుర్లు చెప్పేవాడు. హైదరాబాదు ఆదర్శ్‌నగర్‌లో నేను వుంటున్న ఒక అద్దె ఇంటికి భవనం వెంకట్రామ్ తరచు వచ్చేవాడు. అప్పుడు ఆయన కోసం వచ్చిన ప్రముఖులలో వై.యస్.రాజశేఖర్ రెడ్డి, నారాచంద్రబాబు నాయుడు, పాలడుగు వెంకట్రావు మొదలైనవారుండేవారు. అది నిత్యకృత్యంగా ఉండేది. అయినప్పటికీ నేను మాత్రం రాజకీయాల జోలికి పోకుండా ఉండగలిగాను. భవనం పదవి నుండి దిగిపోయిన తరువాత కూడా మా సన్నిహితత్వం అలాగే కొనసాగింది.

భవనం ముఖ్యమంత్రిగా ఉండగా ఏమీ చేయలేకపోయాడనే చెప్పాలి. ఎన్.జనార్ధనరెడ్డి వంటివారు ఆయన మంత్రివర్గంలో ఆయనను ఖాతరు చేసేవారు కాదు. నాదెండ్ల భాస్కరరావు ఆయన ద్వారా ఏదో ఒక పదవిలో ప్రవేశించాలని విఫల ప్రయత్నం చేశారు. భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రమాణ స్వీకారానికి ఎన్.టి.రామారావు రావటం చాలామందికి ఆశ్చర్యం వేసింది. వారిరువురూ గుంటూరులో కాలేజీలో చదువుతున్నప్పటినుండి విద్యార్థిదశలో స్నేహితులు. అదీగాక సినీరంగంలో భవనానికి కూడా ఆసక్తి ఉండేది. పి.వి.నరసింహారావు అంటే భవనానికి ఇష్టం ఉండేది. ఏడు మాసాల ముఖ్య మంత్రిగా చరిత్రలో ఆయన నిలిచిపోయాడు.

1982లో ఎన్నికలు వచ్చినప్పుడు ఇందిరాగాంధీ ఢిల్లీ నుండి సూట్‌కేసులతో నిధులు తెచ్చిందని చెబితే నేను మొదట్లో నమ్మలేదు. తరువాత భవనం వెంకట్రామ్ ను పిలిచి కొంత డబ్బిచ్చి అనంతపురంలో కాంగ్రెస్ అభ్యర్థులకు పంచమన్నారు. ఆయన ఆ విషయం నాతో చెప్పకుండా, అనంతపురం వెళ్ళొద్దాం రమ్మని కారులో తోడు తీసుకెళ్ళారు. ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళాం. ట్రావెలర్స్ బంగళాలో బి.టి.ఎల్.ఎన్. చౌదరికి కాంగ్రెస్ నిధిని ఎన్నికల ఖర్చుల నిమిత్తం భవనం వెంకట్రామ్ ఇస్తున్నప్పుడు గమనించాను. ఆయన డబ్బు చాలదని సిఫారసు చేసి మరికొంత ఇప్పించమని అడిగాడు. ఆయన వెళ్ళిపోయిన తరవాత భవనాన్ని అడిగితే ఇందిరాగాంధీ నిధులు తెచ్చి పంచిన మాట నిజమేనని అందులో ఒక భాగమే తనకు అప్పగించారని చెప్పారు.

భవనం ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబునాయుడు స్టేట్ మంత్రి హోదా వుండేది. ఆయనను కేబినేట్ హోదాకు పెంచాలని వై.ఎస్.రాజశేఖరరెడ్డి

కోరిక. ఢిల్లీ వెడుతున్నప్పుడు నాకావిషయం చెప్పి నన్ను కూడా వీలైతే ఒక మాట చెప్పమన్నాడు. రాజశేఖరరెడ్డి మిత్రులకు అరమరికలు లేకుండా అలా సహాయం చేసిన ధోరణి కనబరిచాడు. కానీ నేను అందులో పాత్ర వహించలేదు.

అసలు విషయం ఏమంటే కేంద్రం ఆమోదం లేకుండా ఏ మార్పూ చేసే అవకాశం భవనానికి లేదు. తన నిస్సహాయతను భవనమే నాకు చెప్పాడు.

ముఖ్యమంత్రికి సన్నిహితుడుగా ఉన్నందున నాకు కొన్ని మంచి అవకాశాలు లభించేవి. సుప్రసిద్ధ గాయని లతామంగేష్కర్ తన తండ్రి పేరిట ముషీరాబాద్‌లో సంస్థ పెట్టటానికి స్థలం అడుగుదామని ఒకరోజు పొద్దున్నే భవనం ఇంటికి వచ్చింది. సమయానికి ఎవరూ లేరు. నన్ను ఆమెతో మాట్లాడుతుండమని, ఈలోగా తాను తయారయి వస్తానని భవనం చెప్పారు. ఆవిధంగా చాలా సేపు లతామంగేష్కర్‌తో మాట్లాడి ఆమె అనుభవాలు తెలుసుకునే అవకాశం లభించింది. ఆశ్చర్యమేమంటే ముఖ్యమంత్రి ఇంట్లో అలాంటి సుప్రసిద్ధ గాయని వచ్చినప్పుడు అందరం కలిసి ఫోటో తీయుంచుకుందామంటే కనీసం కెమెరా లేదు. నేటి ముఖ్యమంత్రులకు, నాటి ముఖ్యమంత్రులకు ఎంతో తేడా అనిపించింది.

భవనం వెంకట్రామ్ విద్యామంత్రిగా ఉండగా యు.జి.సి. ఛైర్మన్ మాధురీ దీక్షిత్ అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి వచ్చింది. భవనం వెంకట్రామ్ నేను కలిసి వెళ్ళాం. అయితే ఆమె సత్యసాయిబాబా భక్తురాలిగా పుట్టపర్తిలోని డీమ్డ్ యూనివర్సిటీకి వెళ్ళాలని నిర్ణయించుకున్నది. అది అవమానకరమని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ప్రాధాన్యత ఇవ్వాలి కానీ వ్యక్తిగత భక్తి ముఖ్యం కాదని నేను వెంకట్రామ్‌కు చెప్పాను. భవనం అందుకు అంగీకరించి సాయిబాబా విద్యాసంస్థకి వెళ్ళలేదు.

బాబాలు, మాతలు భవనం వెంకట్రామ్ దగ్గరకు వచ్చినా ఆయన పట్టించు కునేవాడు కాదు. ఒకసారి కడప నుండి శివస్వామి వచ్చి విభూది, పండు ఆయన చేతిలో పెట్టాడు. గాలిలోనుంచి అవి సృష్టించినట్టు చెప్పాడు. పక్కనే కూచున్న నేను భవనం వెంకట్రామ్ చెవిలో - ఒక గుమ్మడికాయ ఇవ్వమనండి అని చెప్పాను. ఆయన అలాగే అడిగాడు. ఆ స్వామి తెల్లబోయి ఇవ్వలేనన్నాడు. చేతిలో పట్టే

వస్తువులయితే హస్తలాఘవంతో కనికట్టు విద్యతో అవతలి వాళ్ళని భ్రమలో పడేస్తారు. ఆ స్వామి జూనియర్ కాలేజీ పర్మిషన్ కోసం వచ్చి ఇలాంటివి అడిగాడు. మొత్తం మీద వాళ్ళను భవనం దూరంగానే ఉంచేవాడు.

ఆయన హయాంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పోస్టు భర్తీ చేయవలసి వచ్చింది. అనుకోకుండా నన్ను అడిగితే అప్పుడే హైకోర్టులో ఛీఫ్ జస్టిస్‌గా రిటైర్ అయిన ఆవుల సాంబశివరావు పేరు చెప్పాను. భవనం వెంటనే అంగీకరించి నన్నే వెళ్ళి ఒప్పించమన్నారు. నేను ఆపని చేయగలిగాను.

భవనం హయాంలో జరిగిన ఒక మంచి కార్యక్రమం ఓపెన్ యూనివర్సిటీకి నాంది పలకటం. చదువుకోవటానికి అవకాశం లేక గ్రామాలలో ఉంటున్న వారికి విద్యాబుద్ధులు గరపటానికి పథకం ఉండాలని భవనం తలపెట్టాడు. ఆ ప్రయత్నంలోనే జి. రామిరెడ్డిని పిలిచి విషయాన్ని పరిశీలించమన్నాడు. ఆయన ఇంగ్లండు వెళ్ళి ఓపెన్ యూనివర్సిటీ పద్ధతిని చూసి వచ్చి రిపోర్టు ఇచ్చాడు. యూనివర్సిటీ నాగార్జున సాగర్ వద్ద పెట్టాలని భవనం తలపోశాడు. చివరి దశలో వైస్ ఛాన్సలర్‌గా జి.రామిరెడ్డికి పోటీగా జెన్‌టిక్స్ శాఖాధిపతి ఓ.యస్.రెడ్డి ముందుకు వచ్చాడు. కానీ మేమంతా రామిరెడ్డినే బలపరిచాము. ఓ.యస్.రెడ్డి నాకు మిత్రుడే. ఆయనకు కష్టం వేసింది కూడా. కానీ భవనాన్ని ఒప్పించి చివరకు రామిరెడ్డి పేరుకే మొగ్గు కనబరిచాము.

భవనం వెంకట్రామ్ దిగిపోయిన తరవాత రాజకీయాలలో చురుకైన పాత్ర నిర్వహించలేదు. కానీ చివరి వరకూ నాతో సన్నిహితంగానే ఉండేవాడు. ఆయన ఆరోగ్యం కూడా క్షీణించింది. ఆయన వద్దకు అట్టే ఎవరూ వచ్చేవారు కాదు. పదవి లేనప్పుడు కాంగ్రెస్ సంస్కృతి అంతే.

*

# కోట్ల విజయభాస్కర రెడ్డి



**(1920-2001)**

**1968**లో మొదటిసారి కర్నూలులో కోట్ల విజయభాస్కరరెడ్డిని కలిశాను. అప్పుడు తెలుగు స్వతంత్ర, ఆంధ్రభూమి సంపాదకుడు, రేడియో నాటికల రచయిత గోరాశాస్త్రి (గోవిందు రామశాస్త్రి)కి 50వ జన్మదినోత్సవం జరపటానికి సభ ఏర్పాటు చేసిన సందర్భం అది. కర్నూలు జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా ఉన్న విజయ భాస్కర రెడ్డి బాగా సహకరించి సభ జయప్రదం కావటానికి తోడ్పడ్డారు. ఆయన ఆనాడు చక్కటి ప్రసంగం చేశారు. అప్పటి పరిచయంతో ఆ తరువాత హైదరాబాద్ లో అప్పుడప్పుడు కలుసుకునేవాళ్ళం. మిగిలిన రాజకీయ వాదులతో పోల్చితే విజయభాస్కరరెడ్డి పెద్ద మనిషి.

హైదరాబాద్‌లో పాత ఎం.ఎల్.ఏ క్వార్టర్స్‌లో, గోపీ హోటల్‌లో మిత్రులతో సరదాగా పేకాడుకోవడం ఆయన హాబీ. రాష్ట్ర రాజకీయాల నుండి కేంద్రానికి వెళ్ళిన విజయ భాస్కర రెడ్డి చాలా కాలం స్థానిక విషయాలు పట్టించుకోలేదు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా ఉందని 1982ఎన్నికలలో విజయావకాశాలు క్షీణించాయని భయపడి విజయ భాస్కర రెడ్డిని ముఖ్యమంత్రిగా తీసుకువచ్చారు. అప్పటికి ముగ్గురు ముఖ్యమంత్రు లని రాష్ట్రంలో మార్చేసిన ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని అభాసుపాలు చేసింది.

విజయ భాస్కరరెడ్డి వలన పరువు దక్కుతుందని పదవిలోకి తీసుకు వచ్చారు. అయితే ఆనాటి రాజకీయ ప్రభంజనంలో రంగప్రవేశం చేసిన ఎన్.టి.రామారావు సుడిగాలి పర్యటనకు, ప్రజాదరణకు విజయ భాస్కర రెడ్డి సరితూగలేకపోయారు. రామారావు ఇస్తున్న హామీలకు మారుగా కాంగ్రెస్ పార్టీ

పక్షాన తాను కూడా కిలో బియ్యం రూ. 1.90పైసలకే ఇస్తామని చెప్పినా జనం పట్టించుకోలేదు.

విజయ భాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు భవనం వెంకట్రాం, ఆవుల మదన్ మోహన్, నేను ఎదురుగా కూర్చున్నాం. రాష్ట్రంలో 11 మెడికల్ సీట్లు కర్ణాటకకు, అక్కడి స్థానాలు 11 ఆంధ్రకు ఇచ్చి పుచ్చుకునే పద్ధతిలో ఏర్పాటు చేశారు. దిగిపోబోయే ముందు భవనం వెంకట్రామ్ ఆ ఫైలు సంతకం చేసి వెళ్ళారు. కానీ రానున్న ముఖ్యమంత్రి వాటిని ఆమోదించ వలసి ఉంది. ఒకవైపు భవనం వెంకట్రామ్ మరోవైపున మదన్‌మోహన్ (నాటి ఆరోగ్య శాఖమంత్రి) నన్ను వెళ్ళి విజయ భాస్కర రెడ్డితో ఆ ఫైలుపై సంతకం చేయమని చెప్పమన్నారు. ఆమాట చెప్పటానికి వారికి మొఖం చెల్లక నన్ను కోరారు. నేను ఎదురుగా ఉన్న విజయ భాస్కర రెడ్డి దగ్గరకు వెళ్ళి ఆ విషయం చెబితే ఆయన అప్పటికప్పుడే ఛీఫ్ సెక్రటరీకి చెప్పి ఫైలు తెప్పించి సంతకం చేయటం నన్ను ఆశ్చర్యపరచింది. కర్నూలులో ఏర్పడిన మా మిత్రత్వం ఆ విధంగా తోడ్పడింది.

నేను ఆ తరువాత విజయ భాస్కర రెడ్డిని అంత తరచుగా కలవలేదు. ఎప్పుడైనా కలిస్తే ఆప్యాయంగా మాట్లాడేవారు. ముఖ్యమంత్రిగా నాలుగు నెలలకే దిగిపోయిన విజయ భాస్కర రెడ్డి తరువాత ఢిల్లీ వెళ్ళిపోయి మరోసారి ముఖ్యమంత్రిగా పదేళ్ళ తర్వాత వచ్చారు. రెండవసారి కూడా ఆయన విఫల మయ్యారు. రెండు పర్యాయాలు కూడా తన చేతి మీదుగా కాంగ్రెస్‌ను వోడించి ఎన్.టి.రామారావుకు అధికారం కట్టబెట్టిన ఘనత విజయ భాస్కర రెడ్డికే దక్కింది. రెండవసారి ముఖ్యమంత్రి అయినప్పుడు నా మిత్రుడు అబ్బూరి వరద రాజేశ్వర రావుకు అధికార భాషా సంఘాధ్యక్ష పదవి ఇచ్చారు. వారిరువురికి ఢిల్లీలో పరిచయం ఉండేది. కానీ పదవి స్వీకరించక ముందే అబ్బూరి జబ్బుతో ఆసుపత్రిలో చనిపోయారు.

విజయ భాస్కర రెడ్డి చివరిదశలో అపోలోలో చికిత్సకై చేరి చనిపోతున్న

రోజులలో ఆయనను పట్టించుకున్నవారు లేదు. పదవులు లేకపోతే మనుషులకు ఉండే ఆదరణ అలాంటిదని కాంగ్రెస్ సంస్కృతి చెబుతున్నది.

⁕

మూడుసార్లు ముఖ్యమంత్రి

# ఎన్.టి.రామారావు



(1923-1996)

"నక్సలైట్లు కూడా దేశభక్తులే బ్రదర్" అంటూ నినదించి, సైనిక దుస్తులు వేసుకుని, తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలు ఢిల్లీవరకూ తీసుకెళ్ళాలని ఎన్నికల ప్రచారంలోకి దిగిన ఎన్.టి.రామారావు రాజకీయ చరిత్ర సృష్టించారు. 1982లో తెలుగుదేశం పార్టీ పెట్టిన ఎన్.టి.రామారావు నవమాసాలు నిండకముందే పార్టీని అధికారంలోకి తెచ్చారు. వామపక్షాలతో సహా అందరూ ఆయనను సమర్థించటం ఒక విశేషం. జీవితమంతా సినిమారంగంలో ఉంటూ హఠాత్తుగా రాజకీయాలలో ప్రవేశించి అనూహ్య మార్పును తెచ్చిన రామారావు, ప్రజల నాడిని తెలుసుకున్నట్లు భావించ వచ్చు.

ఎన్.టి.రామారావు రాజకీయాలలోకి వచ్చేనాటికి నాలుగుతరాల వారిని తన నటనా ప్రాచుర్యంతో ప్రభావితం చేశారు. పౌరాణిక పాత్రలు, సాంఘిక పాత్రలు, ఆయనను జనంలో బాగా జ్ఞాపకం పెట్టుకునేటట్లు చేశాయి. మద్రాసులో ఆయన వుండగా తిరుపతి వెళ్ళిన తెలుగు యాత్రీకులు ఒక మొక్కుబడిగా మద్రాసు వెళ్ళి ఉదయమే ఆయనను దర్శించుకుని వచ్చేవారు. ఎన్నికల నాటికి అవన్నీ పనిచేశాయి.

1981 నాటికి ఇందిరాగాంధీ పేకముక్కలవలె ముఖ్యమంత్రులను రాష్ట్రంలో నలుగురిని మార్చేసింది. అది జనానికి ఏవగింపుగా, అవమానంగా భావించేటట్లు చేసింది. ప్రజాస్వామ్యం, స్థానిక నిర్ణయాలు, తెలుగువారి గౌరవం మంటగలిశాయనే మాట ఆనోటా ఆనోటా ప్రబలింది. అలాంటి వాతావరణాన్ని ఎన్.టి.రామారావు రాజకీయానుభవం లేకపోయినా తనకనుకూలంగా మార్చుకున్నాడు. పార్టీ పెట్టడానికి కొందరిని సంప్రదించాడు. ఆనుపానులు చూచుకున్నాడు. మొత్తం మీద సాహసించి రంగప్రవేశం చేశాడు.

ఆ దశలో నేను ఎన్.టి.రామారావును హైదరాబాదులో అప్పుడప్పుడు కలుసు కునేవాడిని. రామకృష్ణా స్టూడియోస్‌లో ఉదయం నుండే ఆయన సందర్శకులను కలిసి మాట్లాడేవారు. అప్పట్లో నాతోపాటు మహిపాల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి,

తుమ్మల గోపాలరావు మొదలైనవారం ఆయనను కలిశాము. అలా కలుస్తున్నప్పుడు కొందరు పార్టీ అభ్యర్థులుగా తమ పేరు సిఫారసు చేయమని నన్ను కోరారు. ఆ పొరపాటు మాత్రం చేయలేదు. అందువలన రామారావుగారితో ఎప్పుడైనా కకవటానికి యధేచ్ఛగా మాట్లాడడానికి సందేహించాల్సిన పని ఉండేది కాదు.

ఎన్.టి.రామారావు ఎన్నికల ప్రభంజనం తెచ్చినప్పుడు నేను టంగుటూరి ప్రకాశాన్ని గురించి ఈనాడులో ఒక పెద్ద వ్యాసం రాశాను. అందులో ఆయన జీవిత చరిత్ర నుండి ఉదహరించి సైమన్ కమిషన్ మద్రాసు వచ్చినప్పుడు ఒక వ్యక్తి చనిపోతే అతనిని చూడటానికి ప్రకాశంగారు వెళ్ళారని, ఒక పోలీసు అడ్డుపెడితే పక్కనున్నవారు ఆయనను గురించి చెప్పగా పోనిచ్చాడని రాశాను. అంతేగాని గుండీ విప్పి తుపాకి గుండుకి ఎరగా చూపాడనే వదంతి నిజం కాదని రాశాను. ఆ మాటలు ప్రకాశంగారి, తెన్నేటి విశ్వనాథంగారి రచన నుండే తీసుకున్నాను. అయినా వీరాభిమానులు నా మీద ఆగ్రహించారు. ఈ వ్యాసం చదివి ఎన్.టి. రామారావు ప్రభావితుడయ్యాడు అని నేను చెప్పను కానీ, అదే సందర్భంలో ప్రకాశంపై ఆయన కొన్ని విసుర్లు విసరడంతో కొందరు ఆగ్రహించారు.

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా వివిధ సందర్భాలలో నేను విలేఖరిగాను ఇతరత్రా కలిశాను. ఎప్పుడైనా సరే నన్ను ఆదరంగానే చూశారు. హిందీ అకాడమీవారు ఆయన గురించి ఒక వ్యాస సంకలనం ప్రచురించదలిచారు. అందులో ఒకటి నన్ను రాయమని వేమూరి రాధాకృష్ణ కోరారు. హిందీలోకి అనువాదం చేసుకుంటామని చెప్పారు. ఒక వెయ్యి రూపాయలు డబ్బు కూడా ఇచ్చారు. తీరా రాసి ఇస్తే అది నిశిత పరిశీలనతో ఉన్నదని ఎన్.టి.రామారావుగారికి నచ్చకపోవచ్చునని అన్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాదును ఎన్.టి.రామారావు అడిగినప్పుడు ఆ వ్యాసం బాగున్నదని ప్రచురించాలని ఆయన చెప్పారు. అందుకు రామారావు అంగీకరించడంతో వేమూరి వారు ముఖం చిన్నబుచ్చుకున్నారు.

మరొక సందర్భంలో రాజ్యసభ స్థానానికి పర్వతనేని ఉపేంద్ర, యలమంచిలి శివాజి మధ్య ఎవరు ఉండాలి అనేదానిమీద రామారావుగారి దగ్గర సిఫారసుల పర్వం నడిచింది. నేను శివాజీతోపాటు రామారావుగారి దగ్గరకు వెళ్ళటం చూసిన ఉపేంద్ర కొన్నాళ్ళు నామీద అలిగారు.

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా మహిళల హక్కులు, వెనకబడిన వారికి రిజర్వేషన్లు వంటికొన్ని సాహసోపేత నిర్ణయాలు గొప్ప మార్పును తెచ్చాయి. పురోహితులుగా ఎవరైనా ఉండవచ్చుననే అంశం కూడా సామాజిక విప్లవానికి నాంది పలికింది.

ఎన్.టి.రామారావు దగ్గర కొందరు చక్కని సలహాలిచ్చే పోలీసు అధికారులు (పర్వతనేని కోటేశ్వరరావు, అప్పారావు, రామ్మోహనరావు) ఉండేవారు. అలాగే జయప్రకాష్ నారాయణ వంటి ఐ.ఎ.ఎస్. అధికారులు ఆయనకు హేతుబద్ధమైన సలహాలిచ్చేవారు. మూఢనమ్మకాలతో వక్రమార్గాలు పట్టించిన ఐ.ఎ.ఎస్. అధికారులు లేకపోలేదు. రామారావుగారికి బాబాల, మాతల పిచ్చి లేదు. దేవుని పట్ల భక్తి ఉన్నది. బుద్ధునిపట్ల అపార గౌరవమున్నది. అందుకే అతి పెద్ద విగ్రహాన్ని చేయించి హైదరాబాదు హుస్సేన్‌సాగర్ చెరువు మధ్యలో ప్రతిష్ఠింపచేశారు. తెలుగువారి కీర్తిని చాటే ప్రముఖుల విగ్రహాలను టూరిస్టు ఆకర్షణగా నెలకొల్పారు.

ఒక సందర్భంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శివరామమూర్తి కొన్ని ప్రచురణలు రామారావుగారికి బహూకరించడానికి నన్ను తోడురమ్మన్నారు. అలా పొద్దున్నే వెళ్ళినప్పుడు, ఇచ్చి తిరుగు ముఖం పట్టగా, గాడ్ బ్లెస్ యూ అని ఆయన అందరినీ అన్నట్లే పలికారు. నేను వెంటనే "ఏ గాడ్?" అంటూ "మీరే దేవుడనుకొని కాళ్ళు మొక్కుతున్నారు కదా వేరే దేవుళ్ళు ఎందుకు?" అన్నాను. ఆయన దగ్గర అలా మాట్లాడేవారు బహుశ వుండరు. కాని ఆయన రియాక్ట్ అయి, "అరే, నీవేంటయ్యా ఏదో మాట వరసకి అన్నాన్లే" అంటూ నవ్వారు.

సత్యసాయిబాబా పుట్టపర్తి ఆశ్రమంలో హత్యలు జరిగినప్పుడు ముఖ్య మంత్రిగా ఎన్.టి.రామారావు విచారణకు ఉత్తరువులిచ్చి అవసరమైతే సాయి బాబాను అరెస్టు చెయ్యమన్నాడని తెలిసింది. నేను ఆయనను కలిసి అభినందించాను. చిరునవ్వు నవ్వాడు. కాని ముఖ్యమంత్రి ఉత్తరువులు అమలు జరగలేదు. ఆయన చుట్టూ ఉన్న సాయిబాబా భక్తులు ఆయనకు తెలియకుండానే అడ్డు పడ్డారని తరువాత ఆరా తీస్తే తెలిసింది. ముఖ్యమంత్రిగా రామారావు ఉన్నంతకాలం సాయిబాబా హైదరాబాదులో అడుగు పెట్టలేదు. ఒక సినిమాలో

కూడా సాయిబాబా వంటి వ్యక్తిని ఆయన ఎగతాళిగా చిత్రించిన సందర్భం లేకపోలేదు. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి కాగానే సుప్రసిద్ధ జర్నలిస్టు, ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావుగారిని సాంస్కృతిక సలహాదారుగా వేసుకున్నారు. ఆయన అంగీకరించి నా సహాయం తీసుకుని ఫైల్సు చూసి నిర్ణయాలు తీసుకునేవారు. రామారావుగారికి ఆ విషయం చెబితే ఆయన సంతోషించారు. కానీ నార్ల నిర్ణయాలు కొన్ని కొందరికి కంటగింపుగా పరిణమించాయి. ముఖ్యంగా అకాడమీల రద్దు విషయంలో అది గమనించదగింది.

ఎన్.టి.రామారావుకు కొన్నిబలహీనతలు ఉండేవి. వాటిని ఆసరాగా పనులు చేయించుకున్నవారు లేకపోలేదు. ఆచార్య రంగాకు ప్రజలు నిధులు వసూలు చేసి హైదరాబాదులో రంగా భవన్ ఏర్పరచి ఒక ట్రస్టుగా దాని పక్షాన కార్యక్రమాలు జరిపించారు. ఆయన సేవలకు ప్రతిభకు చిహ్నంగా అది జరిగింది. అంతవరకూ బాగానే వుంది. రంగాగారికి సంతానం లేదు. కానీ ఆయన బంధువులు రంగా భవన్‌పై కన్నువేసి ప్రజలిచ్చిన ఆస్తి కాజేయటానికి పబ్లిక్ ట్రస్టును ప్రైవేటు ట్రస్టుగా మార్పించారు. రంగా చేతనే అది అడిగించారు. అందులో వున్న అనౌచిత్యాన్ని పాటించకుండా ఎన్.టి.రామారావు అందుకు అంగీకరించారు. అలాంటి తప్పులు చేయకుండా వుంటే బాగుండేది.

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా వుండగా ఒక విచిత్ర సంఘటన జరిగింది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీపై ఉస్మానియా విశ్వవిద్యాలయ లైబ్రరీలో నేను ఒక సెమినార్ నిర్వహించి ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. ఆధ్వర్యాన చర్చ పెట్టాము. అందులో యూనివర్సిటీ నడుస్తున్న తీరు దాని స్థాపకుడు జి.రామిరెడ్డి తన వందిమాగధులను చుట్టూ చేర్చుకుని ప్రమాణాలు దిగజార్చిన పద్ధతి విమర్శించాను. ఆయన శిష్యులు సెమినార్ లోనే దీనికి నిరసన తెలుపగా డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాదు విమర్శ సదుద్దేశంతో జరిగిందని తప్పొప్పులు చర్చకు పెట్టడం మంచిదేనని అన్నారు. కానీ రామిరెడ్డి శిష్యులు ఒక పట్టాన విమర్శను గ్రహించలేకపోయారు. సమాధానం చెప్పలేకపోయారు. అప్పటికి రామిరెడ్డి ఢిల్లీ వెళ్ళిపోయారు. అయినా ఆయన ఫోనులు చేసి నన్ను ఎదుర్కొనమని పురికొల్పారు. ఎలా ఎదుర్కోవాలో శిష్యులకు తెలియలేదు. అందువలన ఓపెన్ యూనివర్సిటీలో

వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, కొందరు ప్రొఫెసర్లు యూనివర్సిటీ గ్రౌండ్‌లో రోజూ అధికారంలో ఉన్నవారి చుట్టూ తిరిగి నాకు వ్యతిరేక ప్రచారం చేశారు. పత్రికల వారి దగ్గరకు వెళ్ళి నా వ్యాసాలు ప్రచురించవద్దన్నారు. అందుకు ఎడిటర్లు అంగీకరించలేదు. బుక్ లింక్స్ వంటి ప్రచురణ కర్తల దగ్గరకు వెళ్ళి నా పుస్తకాలు అమ్మవద్దన్నారు. కానీ, కె.బి.సత్యనారాయణ వంటివారు అందుకు నిరాకరించారు. సెమినార్‌లో పాల్గొన్న ప్రొఫెసర్ విల్సన్ వంటివారిని క్షమాపణ చెప్పమని ఆయన ఇంటికి వెళ్ళి అడిగారు. ఆయన నిరాకరించాడు. చివరకు చంద్రబాబు నాయుడు, గాలి ముద్దుకృష్ణమనాయుడు, ఇంద్రారెడ్డి, జస్టిస్ జగన్మోహనరెడ్డి, జస్టిస్ ఆవుల సాంబశివరావు దగ్గరకు వెళ్ళి నాపై ఫిర్యాదులు చెప్పి నన్ను బాయ్‌కాట్ చెయ్యమన్నారు. వారు నవ్వుకొని పంపించేశారు. చివరి అస్త్రంగా ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు దగ్గరకు వెళ్ళి నాపై ఫిర్యాదులు చెప్పి చర్య తీసుకోమన్నారు. ఎన్.టి.రామారావు పెద్దగా నవ్వి, "ఏం బ్రదర్, మాకేం సంబంధం ఈ విషయం, విమర్శలొస్తే మీకు చేతనయితే వారికి సమాధానం చెప్పుకోండి" అని పంపించే శారు. ఇదంతా నెలరోజుల ప్రహసనం. జర్నలిస్టులలో వి.హనుమంతరావు దగ్గరకు వెళ్ళి డేటా న్యూస్ ఫీచర్స్ నుండి నన్ను తొలగించమని కోరారు. ఆయన నిరాక రించాడు.

ఈ ప్రహసనం పూర్తయిన తరవాత ఓపెన్ యూనివర్సిటీలో ఒక ప్రొఫెసర్ వ్యాఖ్యానిస్తూ, మాకు నెలతప్పింది కాని ఫలితం మాత్రం దక్కలేదని, మేము ఎంత ఫూల్స్ అనేది రుజువైందని వాపోయాడు. ఈ ఘటనలో పాల్గొన్న వారెవర నుకున్నారు? ప్రొఫెసర్ హరగోపాల్, చేకూరి రామారావు, కె.మధుసూదన రెడ్డి, రిజిస్ట్రార్ నాగరాజు, ప్రొఫెసర్ శివలింగప్రసాద్, వైస్ ఛాన్సలర్ నవనీతరావు, సి.నారాయణరెడ్డి మొదలైనవారు. ఔచిత్యం కోల్పోతే ఎలా ప్రవర్తిస్తారో ఎన్.టి.రామారావు చెప్పేవరకూ వారికి గ్రహింపు రాలేదు.

*

## కుట్రతో ముఖ్యమంత్రి

# నాదెండ్ల భాస్కరరావు




(1935 జననం)

నాదెండ్ల భాస్కరరావు అడ్వకేటుగా ప్రాక్టీసు చేస్తూ రాజకీయాలలో ప్రవేశించారు. కాంగ్రెసు పార్టీ యూత్ విభాగంలో చురుకైన పాత్ర నిర్వహించారు. నేను ఆంధ్రజ్యోతి బ్యూరో ఛీఫ్‌గా ఉండగా హైదరాబాదులోని సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న మా ఆఫీసుకు అనేక పర్యాయాలు వచ్చేవారు. కొన్ని సందర్భాలలో రాజకీయ ప్రకటనలు ఇచ్చేవారు. ఇంచుమించు రోజూ ఫోనులో అనేక విషయాలు మాట్లాడుకునేవాళ్ళం. భాస్కరరావు చురుకైన, తెలివిగల రాజకీయవాది. విషయాలు త్వరగా గ్రహించేవాడు. ఎక్కడికైనా చొచ్చుకుపోయేవాడు. ఆవిధంగానే కాంగ్రెసు పార్టీలో ఆయన అన్ని స్థాయిలవారితో మెసిలారు.

రాజకీయాలలో ప్రవేశించిన తొలి రోజులలో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డికి చేరువయ్యారు. ఆయన తొలి మంత్రివర్గంలో శాసనసభా వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. కానీ, తనకున్న సన్నిహితత్వం వలన ఇంకా పెద్ద శాఖను ఆశించారు. ప్రమాణ స్వీకారాలు జరిగిన తొలి రోజున గవర్నర్ శారదా ముఖర్జీ ఇచ్చిన విందుకు ఆయన అలిగి రాలేదు. తరవాత కొన్నాళ్ళకు చెన్నారెడ్డి మంచి శాఖను ఇచ్చినా భాస్కరరావు అట్టే కాలం నిలుపుకోలేకపోయారు. ఢిల్లీ వెళ్ళి తనపై ఫిర్యాదులు చెబుతున్నాడని చెన్నారెడ్డి ఆగ్రహించి మరొకసారి ఆయనకు అప్రధానమైన శాఖ ఇచ్చారు. ఇలాంటి రాజకీయ ఒడుదుడుకులు చెన్నారెడ్డి కాలంలో ప్రారంభమై అంజయ్య కాలంలో కొనసాగాయి. కనుక అంజయ్య కూడా భాస్కరరావును కుదించి ఒక దశలో ఆయనను మంత్రివర్గంనుంచి తొలగించారు

కూడా. ఆ తరువాత భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రిగా వుండగా భాస్కరరావు ప్రయత్నించినా పదవి రాలేదు. అప్పుడే ప్రత్యామ్నాయ పార్టీకై ప్రతిపక్షాలు కొన్ని ప్రయత్నించడంలో ఎన్.టి. రామారావుకు చేరువై తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర వహించాడు. తనను కో-పైలట్‌గా చిత్రించుకున్నాడు. ఎన్.టి.రామారావు తొలి మంత్రివర్గంలో కీలకశాఖల్ని నిర్వహించాడు. పార్టీలో ఆయనకు ఉపేంద్రకు అసలు పడేది కాదు. అలాగే మరికొందరితో కూడా భాస్కరరావుకు పొత్తు కుదిరేది కాదు. భాస్కరరావుకు రాగద్వేషాలూ ఎక్కువే. ఇందిరాగాంధీ తొందరపడవద్దని సలహా ఇచ్చినా తెలుగు దేశం పార్టీలోకి చేరాడు. కానీ, ఆయనకు పార్టీలో తృప్తిలేదు. జీవితమంతా కాంగ్రెసు సంస్కృతిలో అలవాటుపడిన భాస్కరరావు తెలుగుదేశంలో రామారావు నాయకత్వంలో ఇమడలేకపోయారు.

ఎన్.టి.రామారావు గుండె చికిత్సకు అమెరికా వెళ్ళినప్పుడు కాంగ్రెసు కుట్ర రాజకీయాలు పైకితెచ్చి వివిధ పార్టీలతో గూడుపుఠాణీ జరిపి కేంద్ర కాంగ్రెసు వారి మద్దతుతో రాష్ట్రంలో రామ్‌లాల్ గవర్నర్ సానుకూలతతో కృత్రిమంగా రామారావును అధికారం నుండి తప్పించారు. ప్రజలు ఎన్నుకున్న రామారావు ఆయన పార్టీ ప్రజాస్వామికంగా వస్తే అందుకు పూర్తి విరుద్ధంగా భాస్కరరావు డొంక తిరుగుడు విధానాలతో రామారావును తొలగించి ముఖ్యమంత్రి అయ్యారు. రాజధాని నగరంలో కృత్రిమ కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించారు. తెలుగుదేశంలో ఉన్న బలహీనులకు అనేక ఆశలు చూపి కొందరిని ఆకర్షించగలిగారు. త్రిపురాన వెంకటరత్నం, నన్నపనేని రాజకుమారి మొదలైనవారు అలాగే మంత్రులయ్యారు. నిర్ణయాలు చకచక చేయటం అడిగిన వారికి అడిగినట్లు వరాలివ్వటం, కాలేజీలు, సంస్థలు మంజూరు చేయటం నిమిషాల మీద జరిగిపోయింది. కానీ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా రియాక్షన్ వస్తుందని తాము అభాసుపాలవుతామని భాస్కరరావు అంతగా వూహించి వుండడు. నెలరోజులు తిరక్కముందే భాస్కరరావు కృత్రిమ ముఖ్యమంత్రిత్వం పోయింది. ఎన్.టి.రామారావు మళ్ళీ ముఖ్యమంత్రిగా ప్రజా స్వామికంగానే కొనసాగారు.

ఆశ్చర్యమేమంటే భాస్కరరావును ఆదుకుంటామని అండగా నిలుస్తామని చెప్పిన కాంగ్రెసు ఆ తరువాత ఆయనను గాలికి వదిలేసింది. అవమానించిన అంజయ్యకైనా మళ్ళీ కేంద్రంలో మంత్రి పదవి ఇచ్చారు కానీ భాస్కరరావును మాత్రం రాజకీయంగా అంటరానివాడినిగానే అట్టిపెట్టారు. అది రామారావు దెబ్బ.

భాస్కరరావును నేను ఈ విద్రోహ చర్య అనంతరం కలియడం మాట్లాడడం మానుకున్నాను. అప్రజాస్వామిక విద్రోహ చర్యగా ఆయన ధోరణి నాకు బొత్తిగా నచ్చలేదు.

❊

# నేదురుమల్లి జనార్ధన రెడ్డి



(1935)

నేను ఆంధ్రజ్యోతి బ్యూరో ఛీఫ్‌గా హైదరాబాదులో ఉండగా నేదురుమల్లి జనార్ధనరెడ్డితో పరిచయం అయింది. అనేక సందర్భాలలో కలుసుకుంటూ మాట్లాడు కునేవారం. 1978లో చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు కేబినేట్ మంత్రిగా నేదురుమల్లి ప్రముఖపాత్ర వహించాడు. ఆయనతో రాజకీయాలే కాక సాధారణ విషయాలు కూడా చర్చిస్తుండేవాడిని.

నేను చాలా కాలం నెల్లూరు నుండి వచ్చే జమీన్ రైతు వారపత్రికకు రాజకీయ విలేఖరిగా రాస్తుండేవాడిని. నెల్లూరు శ్రీరామమూర్తిగారి కోరికపై ఆపని చేశాను. అలా జరుగుతూండగా ఆ పత్రికపై ప్రభావితుడై ఉన్న జనార్ధన్‌రెడ్డి రాజకీయ విలేఖరి ఎవరు అని తెలుసుకోవడానికి ప్రయత్నించారు. శ్రీరామమూర్తిగారికి అది ఇబ్బంది కరంగా పరిగణించింది. నేను ఆంధ్రజ్యోతి బ్యూరో ఛీఫ్‌గా ఉన్నాను గనుక నా పేరుతో జమీన్ రైతులో రాయడానికి వీలులేకపోయింది. అయితే జనార్ధన్‌రెడ్డికి నచ్చని విషయాలు, వ్యాఖ్యలు వస్తున్నప్పుడు ఆయన ఎడిటర్‌ని వత్తిడి చేస్తుండే వారు. శ్రీరామమూర్తి నా దగ్గరకు వచ్చి ఈ విషయాలు వెల్లడిస్తుండేవారు. నన్ను మానేయమనడానికి ఆయనకిష్టంలేదు. పాఠకుల నుండి రాజకీయ విలేఖరి వ్యాఖ్యలకు అనుకూలత ఉండటం వల్ల కొనసాగించమన్నారు. అలా కొన్నాళ్ళు జరిగింతర్వాత జనార్ధన్‌రెడ్డి వత్తిడి ఎక్కువై, శ్రీరామమూర్తి నా దగ్గరకు వచ్చి తన ఇబ్బందులు చెప్పుకున్నారు. ఆ దశలో నా అంతట నేనే రాజకీయ విలేఖరిగా రాయటం మానేస్తానని చెప్పాను.

కానీ ఆయన ఒప్పుకోక కొనసాగించమన్నారు. ఆ దశలో శ్రీరామమూర్తిగారు చనిపోయారు. డోలేంద్ర ఎడిటర్‌గా వచ్చారు. కనుక విరమించటం నాకు సులువు అయింది.

జనార్ధన్‌రెడ్డి వ్యక్తిగతంగా నాకు మిత్రుడు. అనేక సందర్భాలలో మేము కలిసి కూర్చుని యధేచ్ఛగా మాట్లాడుకునేవారం. ఆయన మంచి ఆతిథ్యం ఇచ్చేవారు. కొన్నిసార్లు తట్టుకోలేనంతగా మర్యాదలుండేవి. అసెంబ్లీ జరుగుతుండగా ఉదయం సమావేశాలు సాయంత్రానికి వాయిదా పడినప్పుడు మధ్యలో మేమిరువురం ఆయనింటికి వెళ్ళి స్కాచ్ విస్కీ పుచ్చుకుని నెల్లూరు భోజనం చేసి సాయంత్రం సమావేశానికి వచ్చేవారం. జనార్ధన్‌రెడ్డి చాలామందిని అరే ఒరే అని పిలిచేవారు. కొన్నిసార్లు గర్వంగా ప్రవర్తించేవారు.

1978లో చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటినుండి ఆ పదవికి తానూ రావాలని జనార్ధన్‌రెడ్డి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ సఫలం కాలేదు. భవనం వెంకట్రామ్ ముఖ్యమంత్రిగా ఉండగా ఆ పదవికి జనార్ధన్‌రెడ్డి గౌరవం ఇవ్వలేదు. అతని మంత్రివర్గంలో సభ్యుడై వుండికూడా లెక్కలేనట్లు ప్రవర్తించేవాడు. భవనం మెతక తనాన్ని బాగా వాడుకున్నాడు. ఆ తరువాత కొన్నేళ్ళపాటు రాజకీయ రంగంలో తిప్పలు పడి చివరకు 1990లో ముఖ్యమంత్రిగా తన కోరికను తీర్చుకున్నాడు. రెండవసారి చెన్నారెడ్డి విఫలమయినప్పుడు కేంద్రం మరొక వ్యక్తి కోసం అన్వేషిస్తున్న దశలో జనార్ధన్‌రెడ్డి ఆ స్థానానికి రాగలిగాడు. అయితే అధికారంలో ఉండగా చకచక మెడికల్, డెంటల్ కళాశాలలు మంజూరు చేయటం, ఎడాపెడా పనులు జరగడం, రాజకీయ భ్రష్టత్వానికి దారితీసింది. హైకోర్టు కూడా ఆయన చర్యలను నిరసిస్తూ ఉత్తరువులు జారీ చేసింది. బయట వ్యతిరేకత ఎంత ఉన్నా జనార్ధన్‌రెడ్డి కాంగ్రెసు పార్టీలో మాత్రం తన బలాన్ని కాపాడుకోగలిగాడు. 160 మంది శాసన సభ్యులు ఆయనకు మద్దత్తు పలికారు. సంవత్సరం తిరక్కముందే మంత్రివర్గాన్ని పెంచి కొత్తవారిని తీసుకున్నాడు. కానీ


కాంగ్రెసు పరిస్థితి దిగజారిపోతుండడం చూసి కేంద్రం ఆయనను తొలగించి విజయభాస్కరరెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది. ఆవిధంగా ఒకసారి వచ్చిన అవకాశాన్ని జనార్ధన్‌రెడ్డి జారవిడుచుకున్నాడు. కాంగ్రెసులో కూడా ఆయనకు వ్యతిరేకత పెరుగుతూ పోయింది.

వ్యక్తిగతంగా జనార్ధన్‌రెడ్డి నాతో ఎప్పుడూ బాగా వుండేవాడు. వాళ్ళ ఇంట్లో కార్యక్రమాలకు, పెళ్ళిళ్ళకు ఆహ్వానించేవాడు. టీచర్‌గా జీవితం ప్రారంభించి రాష్ట్ర, కేంద్రస్థాయికి ఎదిగిన వ్యక్తి.

⁜

హైటెక్ ముఖ్యమంత్రి

# నారా చంద్రబాబు నాయుడు



(1950)

ఎన్టీరామారావుకు అల్లుడు కాకముందు చంద్రబాబు నాయుడు నాకు పరిచయమయ్యాడు. 1977లో హైదరాబాదులో పాత ఎం.ఎల్.ఎ. క్వార్టర్సులో బండారు రత్న సభాపతి వద్ద కూర్చుని ఉన్నాము. సాయంత్రం నేను ఎస్.వి. పంతులు, రత్నసభాపతి కబుర్లు చెప్పుకుంటూ మొదటి పెగ్గులో ఉండగా హఠాత్తుగా నారాచంద్రబాబు నాయుడు, సుబ్రహ్మణ్యం వచ్చారు. ఎక్కడో కొట్లాడు కుని, హడావుడిగా వచ్చినట్లుంది. అప్పట్లో చంద్రబాబు నాయుడుతో నాకు పరిచయం లేదు. తిరుపతి నుండి సరాసరి వచ్చామని, అక్కడ విద్యార్థుల మధ్య కొట్లాటలు జరిగాయని, ముఖ్యంగా కమ్మ, రెడ్డి కులాల మధ్య పోట్లాటలు విపరీతంగా ఉన్నాయని వారి మాటలను బట్టి మాకు తెలిసింది. వారు చెప్పిందంతా విని, రత్న సభాపతి ఫోన్ తీసుకుని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితో మాట్లాడారు. ఈ కొట్లాటల వ్యవహారం మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని గట్టిగా చెప్పారు. అట్లా తొలిసారి చంద్రబాబు నాయుడ్ని చూడటం జరిగింది. మరుసటి సంవత్సరం ఎం.ఎల్.ఎ.గా ఎన్నికై చంద్రబాబు నాయుడు వచ్చి న్యూ ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్‌లో ఉన్నారు. ఆయనతో పాటు లక్ష్మీనారాయణ ఉండేవారు. అప్పుడు నేను అక్కడ కొల్లూరి కోటేశ్వరరావు క్వార్టర్‌లో ఉంటూండేవాడిని. రెగ్యులర్‌గా మేము కలుసు కోవటం, నేను అసెంబ్లీకి సంబంధించిన ప్రశ్నలు, కాల్ అటెన్షన్ మొదలైనవి రాసిస్తుండేవాడిని. ఆ విధంగా మా పరిచయం బాగా పెరిగింది. తరువాత చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడ్ని, రాజశేఖరరెడ్డిని దూరంగా పెట్టారు. వారిరువురూ చాలా స్నేహంగా కలిసి ఉండేవారు. వారితో పాటు కె.ఇ.కృష్ణమూర్తి, కరణం బలరాం ఉండేవారు. మేము చాలా తరచుగా కలుసుకునేవాళ్ళం. కొద్ది కాలంలోనే చంద్రబాబు నాయుడు జూబ్లీహిల్స్‌లో ఇల్లు తీసుకుని మారారు. ఆయనతో పాటు ఎన్నోసార్లు భోజనాలు చేస్తూ విషయాలు చెప్పుకునేవాళ్ళం. రాజకీయాలు మాట్లాడుకునేవాళ్ళం. అప్పట్లో పి. రాజగోపాల నాయుడు వస్తుండే వారు. ఆయన చిత్తూరు జిల్లాలో చంద్రబాబుకు గురువు. వారంతా ఆచార్య రంగా శిష్యులు. అలా జరుగుతుండగా చెన్నారెడ్డి మారిపోవటం, అంజయ్య ముఖ్యమంత్రి కావటంతో అటు రాజశేఖరరెడ్డి, ఇటు చంద్రబాబు నాయుడు ప్రాముఖ్యత వహించారు. అదే సమయంలో ఎన్.టి.రామారావు కుమార్తెను చంద్రబాబు నాయుడు పెళ్ళి చేసుకునే విషయం వచ్చింది. స్టేట్ మంత్రిగా చంద్రబాబు నాయుడు పశుసంవర్ధక శాఖను,


వై.ఎస్.రాజశేఖరరెడ్డి మెడికల్ సర్వీసెస్‌ను నిర్వహించారు. ఆ తరువాత అంజయ్య తన జంబోజెట్ మంత్రివర్గాన్ని కుదించగా అందులో చంద్రాబాబుకు గ్రంథాలయాలు, రాజశేఖర్‌రెడ్డికి గ్రామీణాభి వృద్ధి ఇచ్చారు. ఎన్.టి.రామారావును రాజ్యసభకు తీసుకురావాలనే ప్రతిపాదన కూడా అప్పుడే కొంతమేరకు సాగేది. తరువాత భవనం వెంకటరామ్ ముఖ్యమంత్రి కావటం. అందులో రాజశేఖరరెడ్డి ఎక్సైజ్ మంత్రిగా ప్రాధాన్యతలోకి రావటం జరిగింది. కానీ చంద్రబాబు నాయుడుకి మైనర్ ఇరిగేషన్ స్టేట్ మంత్రిగా ఇచ్చారు. అప్పుడు రాజశేఖర్‌రెడ్డి ఎలాగైనా చంద్రబాబు నాయుడుకు క్యాబినెట్ ర్యాంకు ఇప్పించేందుకు ప్రయత్నం చేశారు. నన్ను కూడా ఢిల్లీ వెళ్ళినప్పుడు భవనానికి చెప్పమన్నారు. అయితే అలాంటి నిర్ణయాలు కేంద్ర కాంగ్రెస్ అధిష్ఠానవర్గం చేస్తుంది కనుక ఒక పట్టాన చంద్రబాబుకు క్యాబినెట్ రాలేదు. నేను మాత్రం చాలా తరచుగా చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో కలసి సలహాలు చెబుతుండేవాడిని. ఆ తరువాత విజయభాస్కర రెడ్డి మంత్రివర్గం రావటం, అందులో రాజశేఖర రెడ్డికి విద్యాశాఖ, చంద్రబాబుకు సాంకేతిక విద్య వచ్చాయి.

చంద్రబాబు నాయుడు మరోవైపున ఎన్.టి.రామారావు అల్లుడు కావటంతో రాజకీయాల్లో కొన్ని మార్పులు కనిపించాయి. కాంగ్రెస్‌లోనే కొనసాగిన చంద్రబాబు 1982 ఎన్నికలలో పోటీ చేసి తెలుగుదేశం చేతిలో ఓడిపోయారు. ఒకటి రెండు ప్రకటనలలో తన మామ ఎన్.టి.రామారావుకు వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు కూడా చేశారు. కానీ తెలుగుదేశం ప్రభంజనంతో అత్యధిక సంఖ్యా బలంతో గెలిచినప్పుడు ఎన్.టి.రామారావు ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు హైదరాబాద్‌లో లాల్ బహదూర్ స్టేడియంకు వచ్చి హాజరయ్యారు. క్రమంగా కాంగ్రెస్‌కు దూరమై, తెలుగుదేశంలో చేరి, ప్రాధాన్యత వహిస్తూ పోయారు. తొలుత పదవులు లేకపోయినా రాను రాను పార్టీలో రామారావు అల్లుడిగా ఆయనకు చాలా ప్రాధాన్యత లభించింది. రాజకీయ అనుభవం వలన చంద్రబాబు ఆ అవకాశాన్ని బాగా వినియోగించుకున్నాడు. నేను హైదరాబాద్ ఆదర్శనగర్‌లో ఉన్నప్పుడు చంద్రబాబు మా ఇంటికి అనేక పర్యాయాలు వచ్చారు. అలాగే నేనూ ఆయన ఇంటికి వెళుతూ ఉండేవాడిని. ముఖ్యంగా భవనం వెంకటరాం ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన మా ఇంటికి వచ్చినప్పుడల్లా చంద్రబాబు కూడా వచ్చేవారు. ప్రతిసారీ తిరుపతి లడ్డూ తెచ్చేవారు. కానీ మా ఇంట్లో ఆయన మాత్రం ఏమీ

పుచ్చుకునేవారు కాదు.

చంద్రబాబు ఏదైనా విషయం చెబితే అసెంబ్లీ పరంగా గానీ, బయటగానీ బాగా గ్రహించేవారు. తనకు నచ్చితేనే అమలు పరిచేవారు. ఆయనకు నేను సన్నిహితంగా ఉండటం గమనించి చాలామంది రికమండేషన్స్‌కు వచ్చేవారు. అది నాకు గిట్టదు. కనుక చెప్పేవాణ్ని కాదు. ఆ కోపం చాలా మందికి ఉండేది. నంద్యాలలో రేణుకాచౌదరి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్నప్పుడు ఎన్నికల ఖర్చులకు డబ్బు ఇప్పించమని చంద్రబాబుకి చెప్పి త్వరగా పని జరిగేటట్లు చూడమని నన్ను కోరింది. అయితే ఆమె సంపన్నురాలనీ, ఆమెకు పార్టీనిధి అక్కర లేదని చంద్రబాబు అంటుండేవారు. ఎన్.టి.రామారావుపై తిరుగుబాటు చేసిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పుడు నేను లాంఛనంగా కలిసినా అభినందనలు చెప్పలేకపోయాను. ఆ తర్వాత కలవటమే మానేశాను. నేను అమెరికాలో ఉన్నప్పుడు కూడా ముఖ్యమంత్రిగా ఆయన న్యూయార్క్ వచ్చారు. నా కుమారుడు అప్పుడు వాల్ స్ట్రీట్ జర్నల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడకు వచ్చిన చంద్రబాబు నా కుమారుడిని కలిసి ఇండియాకు రమ్మని ఆహ్వానించారు కూడా. ఆయన ఉన్నాడని తెలిసినా నేను కలవలేకపోయాను. ఏమైనా ముఖ్యమంత్రి అయిన తర్వాత మా కలయిక తగ్గిపోవటమే కాక అరుదయింది. ప్రజాస్వామ్యం కోసం ఎన్.టి.రామారావు పక్షాన తీవ్రంగా పోరాడి సంక్షోభాన్ని ఎదుర్కొన్న చంద్రబాబునాయుడు అందరి అభినందనలు అందుకున్నారు. శాసన సభ్యులను కాపాడుకుని హైదరాబాదు నుండి ఢిల్లీకి, మైసూరుకు, బెంగుళూరుకు తరువాత హైదరాబాదుకు తెచ్చి మళ్ళీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటంలో కీలక పాత్ర వహించారు. అలా చేస్తున్నప్పుడు నేను బెంగుళూరులో విద్యామంత్రి రఘుపతి ఇంటికి వెళ్ళి ఉదయం తేనేటి విందులో చంద్రబాబు నాయుడును అభినందించాను. హైదరాబాదుకు బయల్దేరుతూ ఆ కాన్వాయిలో నన్ను కూడా రమ్మన్నాడు. వెంకయ్యనాయుడు, జయపాల్‌రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర మొదలైన వారు అప్పుడున్నారు. నేను బెంగుళూరులో నేను, కాట్రగడ్డ ప్రసూన మొదలైన శాసన సభ్యులు కలిసి నాదెండ్ల భాస్కరరావు ఉచ్చులో పడవద్దని చెప్పాను. అదే చంద్రబాబు నాయుడు కొన్నేళ్ళ తరువాత భాస్కరరావు అడుగుజాడలలో అప్రజాస్వామికంగా ఎమ్.ఎల్.ఎ.లను వైస్రాయ్ హోటలులో అట్టిపెట్టి విద్రోహ చర్యకు పూనుకొనటం బాధాకరమనిపించింది. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో ఆయన గెలిచి రావడం రాష్ట్రాన్ని అంతర్జాతీయరంగంలో పరిచయం చేయటం అమెరికా అధ్యక్షుడు క్లింటన్‌ను తీసుకురావటం సాంకేతిక హైటెక్ రంగాన్ని బాగా పోషించడం అభినంద నీయమైంది.

# వై.ఎస్.రాజశేఖర రెడ్డి



(1949-2009)

మెడిసిన్ చదివినా సూది పట్టని డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 1978లో ఎం.ఎల్.ఎ అయినప్పుడు నాకు పరిచయం అయ్యాడు. అప్పటినుండి చాలా సన్నిహితుల మయ్యాం. నేను అనేక సందర్భాలలో శాసన సభలో వేసే ప్రశ్నలు, కాల్ అటెన్షన్ నోటీసులు, షార్ట్ నోటీసు ప్రశ్నలు ఇస్తుండేవాడిని. అందులో ఆయనకు నచ్చినవి స్వీకరించి వాడేవాడు. నేను ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తెలుగులోను, ఇంగ్లీషు లోనూ రాస్తూ ఉండగా ఆయనకు నా ఇంగ్లీషు మాత్రమే నచ్చేది.

మేమిరువురం కలిసి అనేకమంది మిత్రుల దగ్గరకు వెళ్ళడం, ముచ్చటించ డం జరిగింది. ఒకటి రెండు సార్లు ఒక స్నేహితుడి దగ్గరకు వెళ్ళి విందు ఆరగిస్తేనో, బ్రేక్ ఫాస్ట్ చేస్తేనో తరువాత తప్పనిసరిగా రాజశేఖర్ రెడ్డి ఒకమాట అడిగేవాడు మనం ఆ స్నేహితుడికి ఏమైనా ఉపయోగపడగలమా...అడుగు అనేవారు. అలాంటి వారిలో డి.శేషగిరిరావు, ఆలపాటి రవీంద్రనాథ్ వంటివారున్నారు. కానీ వారు ఏ సహాయమూ అక్కరలేదని కేవలం మిత్రులుగానే కలుసుకుంటున్నామని అనేవారు. రాజశేఖర్ రెడ్డి మిత్రత్వ స్వభావం చెప్పటానికి ఈ విషయాన్ని ప్రస్తావించాను. ఆయన ఎన్నో సందర్భాలలో మా ఇంటికి రావడం, మాతోపాటు భోజనమో, అల్పాహారమో చేయడం మాకుటుంబానికి ఆనందంగా వుండేది. ముఖ్యంగా భవనం వెంకట్రాం విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అలాంటి సందర్భాలు ఎన్ని వచ్చాయో నేను చెప్పలేను. అలాగే మేము రాజశేఖర్ రెడ్డి ఇంట్లో (జూబిలీహిల్స్‌కు వెళ్ళేదారిలో) అనేక పర్యాయాలు కూర్చుని ముచ్చటించుకుని భోజనాలు చేశాము. ముఖ్యంగా భవనం వెంకట్రాం, కె.వి.పి.రామచంద్రరావు, నేను ఒక బ్యాచ్‌గా ఉండేవాళ్ళం. ముందుగా ఒకటిరెండు

పెగ్గుల విస్కీ స్వీకరించి, తరువాత భోజనం చేసేవాళ్ళం. అప్పట్లో కె.వి.పి. డ్రింక్స్ తీసుకునేవారు కాదు. సిగరెట్లు బాగా తాగేవారు. రాజశేఖర్ రెడ్డి భార్య విజయలక్ష్మి ఎంతో చక్కగా వంటలు చేసి, ఆప్యాయంగా వడ్డించేవారు. ఆమె చాలా సహృదయురాలు.

రాజశేఖర్ రెడ్డి ఇంట్లో నేను తొలుత ఆయన తండ్రి రాజారెడ్డిని కలుసుకున్నాను. ఆయన ఎన్నో విషయాలు, స్వానుభవాలు చెప్పారు. తాను బర్మా వెళ్ళి వచ్చినట్లు, తరువాత క్రైస్తవుడుగా తనకుగల అనుభవాలు ఆసక్తిగా చెప్పేవారు. అప్పటినుండి సూరి (సూర్యనారాయణ) అక్కడే ఉండేవాడు. ఒక కుటుంబంవలె మేమందరం అలా ఎన్నో ఏళ్ళు మెలిగాం. భవనం వెంకట్రాం ముఖ్యమంత్రి కాగానే నాకు పదవి ఏదైనా ఇవ్వమని, నాతో చెప్పకుండా రాజశేఖర్ రెడ్డి వత్తిడి చేశారు. ఆయన మాట మీద భవనం నన్ను పిలిచి ఏ పదవి కావాలో కోరుకోమన్నాడు. అది లేనందువలనే మనం మిత్రులుగా కొనసాగుతున్నామని నేను స్పష్టంగా మర్యాదగా చెప్పాను. మిత్రులకు ఎలాగైనా సహాయపడాలనే ధోరణి రాజశేఖర్ రెడ్డికి మొదటినుండి ఉన్నది.

కాంగ్రెసు పార్టీలో తొలుత రెడ్డి కాంగ్రెసులో ఉన్న రాజశేఖర్ రెడ్డి ఆ తరువాత చెన్నారెడ్డికి వ్యతిరేకిగా, ఉత్తరోత్తరా విజయభాస్కరరెడ్డికి నిరసనకారుడుగా, జనార్ధన్‌రెడ్డిని ప్రతిఘటించిన వ్యక్తిగా వివిధ ఘట్టాలలో ఉన్నారు. ఎన్.టి.రామారావు తెలుగుదేశం పెట్టి ఎన్నికల ప్రచారం చేసి గెలిచి వచ్చిన తరవాత, ఆ ప్రభావపు ఉప్పెన ఎంత తీవ్రమైనదో రాజశేఖర్ రెడ్డి నాతో చెప్పారు. చివరకు తన జిల్లాలో, పులివెందులలో సైతం ఒక సునామీ వలె ఆ వాతావరణం ఉన్నదని కష్టంమీద తట్టుకున్నామని చెప్పాడు. కేంద్రంలో, రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి రానురాను అతి కీలకదశలో రాజకీయ ప్రాధాన్యతలోకి వచ్చారు. వ్యవసాయ రంగానికి ఆయనిచ్చిన ప్రాధాన్యత అమెరికా అధ్యక్షుడు బుష్‌ను కూడా ఆకర్షించింది.

ఒకప్పుడు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా రాజశేఖర్ రెడ్డి ఉండగా నేను అమెరికా నుండి అభినందల లేఖ పంపగా వెంటనే సంతోషంగా సమాధానం ఇచ్చాడు. ముఖ్యమంత్రి అయిన తరవాత నేనాయనను తరచుగా కలుసుకోలేదు. ఎప్పుడైనా కొన్ని సంఘటనలలో నా ప్రస్థావన విలేఖరుల సమావేశంలో వచ్చినప్పుడు "ఇన్నయ్య ఇండియాలో ఉన్నాడా?" అని అడిగేవారు. నేను దూరంగా ఉంటూ రాజకీయాలు పట్టించుకోనందువలన అటువంటి స్థితి ఏర్పడింది. కానీ, రాజశేఖర్ రెడ్డి హఠాత్తుగా చనిపోవటం మాత్రం దారుణ సంఘటనగా భావించాను. అదే విషయాన్ని నేను హెలీకాప్టర్ ప్రమాదం నాడు టి.వి.5 ఛానల్‌లో చెప్పాను కూడా. రాగద్వేషాలు రాజకీయాలలో మెండుగా కనబరిచిన రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలో తిరుగులేని మార్పులు చేసి తనదైన ముద్ర వేశారు.

❊

అనుకోని ముఖ్యమంత్రి

# కొణిజేటి రోశయ్య



(1933)

"ఇన్నయ్యా, ఎవరికి వాళ్లు తాము అందంగా ఉన్నామని అనుకోకపోతే బతకలేరయ్యా'' అని 1954లో గుంటూరులో తన గదిలో గెడ్డం గీసుకుంటూ అద్దంలో చూస్తూ రోశయ్య అన్నమాటలు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నాయి. ఆనాడు గుంటూరు హిందూ కాలేజీలో విద్యార్థి నాయకుడుగా రంగాగారి శిష్యుడుగా రాణించిన వ్యక్తి రోశయ్య. కాలేజీ విద్యార్థి యూనియన్‌కి విద్యార్థి సమ్మేళన్ తరఫున (కృషీకార్ లోక్ పార్టీ విద్యార్థి విభాగం) పక్షాన అధ్యక్షుడుగా పోటీచేసి ఎన్నికలలో గెలిచాడు. మేమంతా ఆయనకు ప్రచారం చేసిపెట్టాము. నేను అప్పట్లో ఎ.సి.కాలేజీలో చదువుతుండేవాడిని. ఆయనకు కార్యదర్శిగా జాస్తి జగన్నాథం (రాడికల్ హ్యూమనిస్టు) గెలిచారు. ఆ రోజులలో విద్యార్థి సమ్మేళనం కోసం చందాదారులను చేర్పించి ఆ డబ్బుతో ఉదయం కాఫీలు, టిఫిన్లు సేవిస్తుండేవారు. మధ్యలో నన్ను పిలిచేవారు. రోశయ్య చాలా చురుకుగా కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. ఉపన్యాసాలు చేసేవారు. కవి సమ్మేళనాలు ఆర్గనైజ్ చేశారు. ఆయన తెనాలి దగ్గర వేమూరు నుండి వచ్చారు. ఆచార్య రంగా 1951లో కాంగ్రెసు నుండి చీలివచ్చి కృషికార్ లోక్ పార్టీ పెట్టినప్పుడు తెనాలిలో తొలి రాష్ట్ర మహాసభ జరిగింది. కార్యకర్తగా రోశయ్య తన రాజకీయ జీవితాన్ని అక్కడ ఆరంభించాడు. ఆయనతో తొలి పరిచయం అప్పుడు జరిగింది. ఆ తరువాత స్నేహితులుగా మేము కలిసిమెలిసి ఉన్నాము.

రంగాగారు 1955లో కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఐక్య కాంగ్రెసు పక్షాన రాష్ట్రంలో ప్రచారం చేసినప్పుడు ఆయన శిష్యులుగా రోశయ్య, వీరాచారి, విజయ రాజకుమార్, సుంకర సత్యనారాయణ మొదలైనవారు రాష్ట్రమంతా సుడిగాలి పర్యటన చేసి కమ్యూనిస్టులను ఓడించటానికి తోడ్పడ్డారు. ఆ తరువాత రంగా గారు కాంగ్రెసు నుండి దూరమై స్వతంత్ర పార్టీ అధ్యక్షులైనప్పుడు గౌతు లచ్చన్నతో పాటు రోశయ్య కూడా పార్టీలో ప్రముఖంగా ఉన్నారు. తొలిదశలో చెన్నారెడ్డి కూడా చేరి తరువాత దూరమయ్యారు. తెనాలి ఆ రోజులలో ఏ రాజకీయ నాయకుడు వచ్చినా రంగాగారి పక్షాన రోశయ్య స్వాగతం పలికి వారి ఉపన్యాసా లకు అనువాదం కూడా చేసేవారు. రాజగోపాలచారి ఉపన్యాసానికి అలాగే చేశారు.

ఆ విధంగా కార్యకర్తగా ప్రారంభించిన రోశయ్య నాయకుడుగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో ప్రముఖులయ్యారు. ప్రతిపక్ష స్థానంలో ఆయనకు చాలా ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన పక్షాన ఎన్నో సందర్భాలలో ఆయన కోరికపై మేము ప్రకటనలు ఇవ్వటం అవి ప్రముఖంగా పత్రికలలో రావడం జరిగింది. ఈ నేపథ్యంలో నాతో పాటు ఎస్.వి.పంతులు బాగా కృషిచేశారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా రోశయ్యకు తోడ్పడి శాసనమండలి సభ్యులు కావటానికి చేయూతనిచ్చారు.

1972 నుండి నేను న్యూ ఎం.ఎల్.ఎ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు రోశయ్య పక్కక్వార్టర్‌లో ఉండేవారు. ఇంచుమించు రోజూ కలుసుకొని మాట్లాడుకునే వాళ్ళం. ఆయన 1978లో చెన్నారెడ్డితో చేతులు కలిపేవరకు అలా సాగింది. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి రోజులలో అతి తీవ్ర విమర్శలు చేసి చెన్నారెడ్డిని చెమట పట్టించిన వ్యక్తి రోశయ్యే. అప్పట్లో నన్నూ, ఎస్.వి.పంతులును కుడి భుజం, ఎడమ భుజం అనేవారు. అటువంటి దశలో ఒకరోజు చెన్నారెడ్డి పిలిచి ఆయనకి మంత్రి పదవి ఇచ్చారు. అప్పటివరకూ ప్రతిపక్షంలో రాణించిన రోశయ్య కాంగ్రెసులో స్థిరపడిపోయారు. ఎవరు పదవిలో ఉన్నా రోశయ్యను కాదనలేని స్థితి తెచ్చుకున్నాడు. ఆ విధంగానే కేంద్రస్థాయివరకూ ఆయన సుపరిచితుడయ్యారు. హైదరాబాదులో అమీర్‌పేటలో సొంత ఇల్లు ఏర్పరచుకొని ఉంటున్నప్పుడు కూడా మేము కలుస్తుండేవాళ్ళం. మా కుటుంబాన్ని గురించి పరామర్శ చేస్తుండేవారు.


వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హఠాత్తుగా చనిపోవటంతో చక్కని మార్గాంతరంగా కేంద్ర కాంగ్రెసు నాయకత్వం రోశయ్యను ముఖ్యమంత్రి స్థానానికి తీసుకువచ్చింది. బహుశ ఆయన జీవితంలో అది పెద్ద మలుపు.



అప్పటిరకూ రోశయ్య అప్పుడప్పుడూ నాతో అంటుండేవారు “జీవితమంతా రాజకీయం తప్ప మరొక వ్యాపారం చెయ్యలేదు. తెలియదు కూడా. ఇప్పుడు ఈ దశలో ఇంకేమీ చేసే స్థితి కూడా లేదు. రాజకీయాలు కొనసాగించాల్సిందే” అది ఆయన ధోరణి.

నవంబరు 24, 2010న రోశయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అధిష్టానం పిలుపునందుకొని హడావుడిగా ఢిల్లీకి చేరిన ఆయన అధినేత్రి ఆదేశాల మేరకు సోనియాకే రాజీనామా లేఖ సమర్పించారు. వయోభారం, పని ఒత్తిడి కారణంగా రాజీనామా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

*








# నేనుకలిసిన మానవవాదులు






# సెక్యులరిస్ట్, మానవవాది
# ఎ.బి.షా.



హైదరాబాదులో సెక్యులర్ సొసైటీ ఫోరమ్‌లో ప్రసంగిస్తున్న ఎ.బి.షా.
ప్రక్కన హమీద్ దిల్వాయ్ (ముస్లిం పాలిటిక్స్ రచయిత)



రాడికల్ హ్యూమనిస్ట్ స్టడీ క్యాంప్, 1965, అవనిగడ్డ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.
L to R మండవ శ్రీరామ మూర్తి, కోనేరు కుటుంబరావు,
ఎ.బి.షా, ఎన్. ఇన్నయ్య

భారత మానవవాద, సెక్యులర్ ఉద్యమంలో ఎం.ఎన్.రాయ్ అనుచరుడుగా ఎ.బి.షా కీలక పాత్ర వహించాడు. 1964లో ఆయనతో నాకు పరిచయం కాగా, అత్యంత సన్నిహితులమై మా మిత్రత్వాన్ని కొనసాగించాం. 1982లో ఆయన చనిపోవడంతో వుద్యమానికి చాలా దెబ్బ తగిలింది.

1966లో అవనిగడ్డ గ్రామంలో (కృష్ణాజిల్లా), ఐదు రోజుల మానవ వాద శిక్షణ శిబిరం జరిగింది. కోనేరు కుటుంబరావు నిర్వహించిన ఆ శిబిరం ఎంతో ఉపయోగకరం కాగా ఎ.బి.షా శిబిరం జరిగిన అన్ని రోజులు వుండి, శ్రద్ధగా పాల్గొని, చర్చలు బాగా నడిపించి, తెలుగు ప్రసంగాల సారాంశాన్ని ఇంగ్లీషులో చెప్పించు కొని, అందరికీ ప్రోత్సాహకారిగా వున్నాడు. అది మంచి అనుభవం.

ఆవుల గోపాలకృష్ణమూర్తి, అధ్యయన తరగతుల ప్రిన్సిపాల్. ఆయన తెలుగులో మాట్లాడి అవసరమైన మేరకు ఎ.బి.షా.కు ఇంగ్లీషులో చెప్పేవారు. శిబిరంలో పాల్గొన్న వారిలో రావిపూడి వెంకటాద్రి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఎన్.వి.బ్రహ్మంల ప్రసంగాల సారాంశం ఇంగ్లీషులో తెల్సుకొని అందులో పలుకు వున్నదని ఎ.బి.షా వారిని ప్రోత్సహించారు.

మల్లాది రామమూర్తి, జి.వి.కృష్ణారావు, కల్లూరి బసవేశ్వరరావు, మేకా చక్ర పాణి సి.హెచ్.రాజారెడ్డి, ఎం.వి.రమణయ్య, త్రిపురనేని గోకుల్‌చంద్, బచ్చు వెంకటేశ్వర్లు, గవిని వెంకటస్వామి వచ్చి పాల్గొన్నారు.

నేను ఎ.బి.షాకు తోడుగా వుండేవాడిని. క్యాంప్‌లో పాల్గొన్న వారిలో చాలా మంది షాకు కంపెనీ ఇవ్వగలవారు లేరు. అంటే సమావేశానంతరం యిష్టాగోష్ఠి కబుర్లు, కొద్దిగా (2 పెగ్గులే అనుకోండి) ఔపోశన పట్టడం వుండేవి. ఎ.బి.షా. పైప్ తాగేవారు. రావిపూడి వెంకటాద్రి చుట్ట తాగేవారు.

మండవ శ్రీరామమూర్తి మాకు చేదోడుగా కాంప్ విజయానికి ఎంతో కృషి చేశారు. కుటుంబరావు ఏర్పాట్లు, అతిథ్యం చాలా మెచ్చుకోదగినవి. అదొక సఫలమైన స్టడీక్యాంప్.

ఎ.బి.షా. అనేక పర్యాయాలు నా ఆహ్వానంపై ఆంధ్ర పర్యటన చేశారు. ఎ.బి.కె.తో సన్నిహితులయ్యారు. ఆయన గుండెపోటుతో మంచంలో వుండగా (1967), మేమిరువురం వెళ్ళి, చేతిలో చేయి వేయించుకొని, మద్రాసు వెళ్ళి చికిత్స చేయించుకోమన్నాం. కాని అది జరగక ముందే మరోసారి గుండెపోటుతో ఆయన దారుణంగా చనిపోవడం జరిగింది.

ఎ.బి.షాను గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ తీసుకు వెళ్ళి వివిధ సభలు పెట్టించాను. కోర్టు న్యాయవాదుల సభలో ప్రసంగాలు చేశారు. ఎ.సి. కాలేజీలో పెద్ద సమావేశంలో ఆయన ప్రసంగం గొప్పగా అభినందించారు, ఎలవర్తి రోశయ్య తెగ మెచ్చుకున్నారు. ఆయనకు ఒక పట్టాన ఎవరి ప్రసంగం నచ్చేదికాదు. ఎ.బి.షా ప్రసంగం అద్భుతం అన్నారు. హైదరాబాద్‌లో ముస్లిం, హిందూ సంఘాలతో సెక్యులరిజంపై కీలక సమావేశాలు జరిపించాం. దీనికి ఉస్మానియా ప్రొఫెసర్ ఆలం ఖుంద్‌మిరి బాగా సహకరించారు.

ఎ.బి.షాతో నాటి వైస్ ఛాన్స్‌లర్ డి.ఎస్.రెడ్డిగార్లతో కలసి విందారగించాం. ఆ తరువాత వైస్ ఛాన్సలర్ నరోత్తమరెడ్డితో వియ్యమందడానికి ముందు కుటుంబ వివరాలకోసం నా ద్వారా ఆరా తీసాడు. ఎ.బి.షా కుమార్తె, నరోత్తమ రెడ్డి కుమారుల వివాహం విఫలమయింది.

ఆలపాటి రవీంద్రనాథ్‌కు, వి.ఆర్.నార్లకు, షా ను పరిచయం చేశాను.

అప్పట్లో ఎ.బి.షా నచికేత ప్రచురణల పేరిట కొన్ని మంచి పుస్తకాలు వెలుగులోకి తెచ్చారు. ప్రతి సెమినార్ తర్వాత ఒక పుస్తకం వచ్చేది. వాటిని అమ్మగా వచ్చిన లాభంలో సగం అట్టి పెట్టుకొని, మిగిలింది తనకు పంపమనే వాడు. అలా మానవవాద సాహిత్యం అమ్మాం. తెనాలిలో గురిజాల సీతారామయ్య, విజయవాడలో కోనేరు కుటుంబరావు సహకరించారు. 'ఎ.బి.షా వ్యాసాలు',

'సైంటిఫిక్ మెథడ్' పుస్తకాలు తెలుగులోకి అనువదించాను. విజయవాడలో అనుపమ ప్రచురణల వారు వ్యాసాల పుస్తకం ఆవిష్కరణ సభలో కొత్త సచ్చిదానందమూర్తి మాట్లాడారు.

రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక సంపాదక వర్గంలో ఎ.బి.షా వుండేవారు.

తరువాత 'క్వెస్ట్' పత్రికను 'న్యూ క్వెస్ట్'గా మార్చి, అది కూడా బాగా నిర్వహించారు. సెక్యులర్ సొసైటీ స్థాపించి 'ది సెక్యులరిస్ట్' పత్రిక నడిపారు. ఎం.పి.రేగే సహకారంతో 'న్యూక్వెస్ట్' పత్రిక నడిపారు. దిలీప్ చిత్రే కొన్నాళ్ళు సంపాదకులుగా ఉన్నారు. పూరి శంకరాచార్యను వేదాలలో హిందువులు గోమాంస భక్షణ చేశారనే విషయమై ఛాలెంజ్ చేశారు. తర్కతీర్థ లక్ష్మణశాస్త్రి బాగా సహకరించారు.

ఎం.ఎన్.రాయ్ మానవ వాద సూత్రాలను పరిష్కరించి ఆధునిక శాస్త్రం ప్రకారం మార్గాంతరాలు ప్రవేశపెట్టారు. వేదప్రమాణంగా రాయ్ సూత్రాలను స్వీకరించడం సరికాదన్నాడు. శిబ్.రే ఆయనతో ఒప్పుకోగా, వి.ఎం.తార్కుండే పేలవంగా రాయ్‌ను ఒప్పుకున్నారు.

'ఫిలసాఫికల్ కాన్సిక్వెన్సెస్ ఆఫ్ మోడరన్ సైన్స్' ప్రతిని ఆయన ద్వారా నేను చదివాను. అది ఎడిట్ చేసి ప్రచురించక ముందే ఎ.బి.షా చనిపోయారు.

షా రచనలు చాలా పద్ధతిగా శాస్త్రీయంగా వుంటాయి.

1978లో అమెరికాలో గార్డన్ స్టయిన్ నుండి నాకో ఉత్తరం వచ్చింది. భారత దేశంలో మానవవాద, హేతువాద సెక్యులర్ ఉద్యమాల గురించి 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ అన్ బిలీఫ్' అనే గ్రంథానికి రాయమన్నారు. ఎ.బి.షా నా పేరు సూచించాడన్నారు. ఒప్పుకొని రాశాను. ఆ తర్వాత గార్డన్ స్టెయిన్‌ను కలిశాను. అతడు ప్రచురణ అనంతరం కేన్సర్‌తో చనిపోయాడు.

ఎ.బి.షా ద్వారా కొందరు విద్యావేత్తలు పరిచయమయ్యారు. వారిలో వి.వి. జాన్, జె.బి.నాయక్, అమ్రిక్ సింగ్ ప్రముఖులు.

ఎ.బి.షా గుజరాత్‌లో దిగంబర జైన కుటుంబంలో పుట్టి, ఎం.ఎన్.రాయ్ ప్రభావంతో మానవవాదిగా మారాడు. మహరాష్ట్రకు వచ్చి తొలుత పూనాలో నివసించి ఆ తర్వాత బొంబాయిలో స్థిరపడ్డారు. ఎమర్జెన్సీలో జయప్రకాశ్ నారాయణ్ పక్షాన నిలిచారు.

వి.కె.సిన్హా నేడు సెక్యులరిస్ట్ పత్రిక నడుపుతున్నారు. ఆయన ఎ.బి.షా శిష్యుడు. బి.ఎ.వి. శర్మ కూడా షా అనుచరుడుగా వుంటూ, బొంబాయి నుండి హైదరాబాద్ వచ్చి చాలాకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ చనిపోయారు. ఆయన కూడా సెక్యులర్ వుద్యమంలో మేథావిగా పనిచేశారు. అలాంటి వారిలో శ్రీనివాసన్, ప్రభాకర్ పాఢీ కూడా ఉన్నారు.

మహారాష్ట్రలో 'సత్య శోధక్ మండలి' పెట్టి, హమీద్ దల్వాయ్‌ను పైకి తెచ్చినవారు ఎ.బి.షా. దిలీప్ చిత్రే అనువాదాల వలన హమీద్ రచనలు ఇంగ్లీషులో రాగా 'ముస్లిం పాలిటిక్స్' అనే గ్రంథం నేను తెలుగు చేసి 'ప్రసారిత'లో ప్రచురించాను.

భవనం వెంకట్రాం ముఖ్యమంత్రిగా, విద్యామంత్రిగా వుండగా ఎ.బి.షా.ను పరిచయం చేశాను. ఇరువురూ భావసారూప్యతతో మిత్రులయ్యారు. ఎడ్వర్ట్ షిల్స్, షికాగో నుండి 'మినర్వా' పత్రిక నడిపారు. అది నమూనాగా ఎ.బి.షా. 'హ్యూమనిస్ట్ వే' అనే పత్రికను కొద్దికాలం నడిపారు. జి.డి.పరేఖ్‌తో సన్నిహిత మిత్రత్వంగల ఎ.బి.షా, ఆయన రచనలు కొన్ని ప్రచురించారు. క్రిటిక్ ఆఫ్ హిందూయిజం, తిలక్‌పై వ్యాసాలు, 'హ్యూమనిస్ట్‌వే'లో వచ్చాయి. 8 సంచికలతోనే అది ఆగి పోయింది.

హైదరాబాద్‌లో వై.ఎం.సి.ఎ.లో ఒక సెమినార్ కోసం ఎ.బి.షా వచ్చారు. నారాయణగూడా తాజ్‌మహల్ హోటల్‌లో బసచేశారు. సెమినార్ సమయానికి టాక్సీ పిలిపించమన్నారు. వై.ఎం.సి.ఎ. ఫర్లాంగ్ దూరాన వున్నది. అయినా ఎందుకు టాక్సీ కావాలన్నారో తెలియలేదు. ఆ తరువాత గాని నాకు జ్ఞానోదయం కాలేదు. ఆ సాయంత్రం షాకు తెలిసిన డాక్టర్లు పక్కనే వుండగా అక్కడకు తీసుకెళ్ళాం.

గుండెకు సంబంధించిన వ్యవహారం బయటపడింది. రైలులో పూనా వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రషీదుద్దీన్‌ఖాన్, వై. రాఘవయ్య, జి. రాంరెడ్డి, కె. శేషాద్రి, పి.వి.రాజగోపాల్ మొదలైన వారిని షాకు పరిచయం చేశారు. వారు ఆయన మేథస్సును గుర్తించారు.

గాంధీ, నెహ్రూలపై షా ప్రచురించిన పుస్తకాలు సెమినార్ల ఫలితమే. ఆయన రచనల్లో 'సైంటిఫిక్ మెథడ్', 'ట్రెడిషన్ అండ్ మోడర్‌నిటి', 'ఛాలెంజెస్ టు సెక్యులరిజం' పేర్కొనదగినవి. అశ్లీలం అంటే ఏమిటనే చర్చ జరిపి ఒక గ్రంథం తెచ్చారు.

*

# శిబ్ నారాయణ్ రే



శిబ్ నారాయణ్ రే తో ఇన్నయ్య

'ఎక్స్ ప్లోరేషన్స్' అనే శీర్షికన శిబ్ నారాయణ రాసిన వ్యాసాలు 1958 ప్రాంతాలలో చూచాను. అనువాదం చేయబోతే అంత బాగా నడవలేదు. వదిలేశాను. అప్పట్లో శిబ్ రే ఆస్ట్రేలియాలో ఇండియన్ స్టడీస్ శాఖాధిపతిగా మెల్బోర్న్‌లో పనిచేశారు. ఆయన తిరిగి ఇండియా వచ్చిన తరువాత రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక సంపాదక వర్గంలో వున్నారు. నేను ఎప్పుడైనా అడపదడపా వ్యాసాలు రాసేవాడిని. ఒకసారి ఆవుల గోపాలకృష్ణమూర్తి ప్రసంగ పాఠం పంపాను. చీరాలలో 1958లో రావిపూడి వెంకటాద్రి మాట్లాడిన సందర్భంగా కొంత చర్చ జరిగింది. అది రవీంద్రనాథ్ ఠాగోర్ పై నిశిత పరిశీలన సారాంశం. అది వేయడానికి శిబ్ రే అభ్యంతర పెట్టారు. నేను పట్టుబట్టాను. 'రాడికల్ హ్యూమనిస్ట్'లో విమర్శను ఆహ్వానించకపోవడం ఆశ్చర్యం అన్నాను. తరువాత వి.బి.కార్నిక్ నుండి ఉత్తరం వచ్చింది. అయినా పట్టు సడలించకపోవడంతో వాళ్ళు ఆవుల గోపాలకృష్ణమూర్తికి విషయం రాశారు. ఆయన చెప్పగా అంతటితో విరమించాను. తాను చెప్పింది, నేను రిపోర్టు చేసింది సరైనదే అయినా, శిబ్ రే కోరికపై వూరుకుంటున్నామన్నాం. తరువాత ఎప్పుడో శిబ్ రేను కలసి అడిగితే, ఏదో కుంటిసాకు చెప్పారు. బెంగాల్ సెంటిమెంట్, ఠాగోర్ పై ప్రేమ కనిపించింది. ఠాగోర్ కవితలలో, రచనలలో కనిపించిన ఆధ్యాత్మిక పులుముడు వాదాన్ని ఎజికె తీవ్రంగా విమర్శించారు. ఠాగోర్ కంటె శరత్ రాసిన శేషప్రశ్న, అందులో కమల పాత్ర గొప్పదని ఎజికె అన్నారు. లోగడ ఎం.ఎన్.రాయ్ అదే విషయాన్ని రాశారు. శిబ్ రేకు ఆ విషయం మింగుడుపడక, మా రిపోర్టును ప్రచురించలేదు.

ఆ తరువాత బొంబాయి కలకత్తా, ఢిల్లీ, హైదరాబాద్‌లలో శిబ్ రేతో అనేక పర్యాయాలు కలసి వున్నాం. హైదరాబాద్‌లో ఆయన్ను ఆలపాటి రవీంద్రనాథ్‌కు, వి.ఆర్.నార్లకు పరిచయం చేశాను. సాలార్ జంగ్ మ్యూజియంకు తీసుకెళ్ళగా ఒక రోజంతా చూస్తూ, సుదీర్ఘ నోట్స్ రాసుకున్నారు. మరో పర్యాయం తెలుగు యూనివర్సిటీలో, ఇంకోసారి ఆలయన్స్ ఫ్రాన్సిస్ హాలులో రాడికల్ హ్యూమనిస్టు సమావేశాలకు శిబ్ రేను పిలిపించాం.

ఎం.ఎన్.రాయ్ జీవిత చరిత్ర శిబ్ రే రాడికల్ హ్యూమనిస్టులో వరుసగా ప్రచురించారు. అది ఇంగ్లీషులో పుస్తకంగా రాకముందే నేను తెలుగు చేయగా తెలుగు యూనివర్సిటీ ప్రచురించింది. శిబ్ రే ఆనందంతో ఎందరికో యీ విషయం చెప్పారు. అప్పుడు పుస్తక ఆవిష్కరణ సభకు శిబ్ రేతో పాటు తార్కుండే, ఇందుమతి కూడా వచ్చారు. బొంబాయి కళాశాలలో శిబ్ రే పనిచేస్తున్నప్పుడు, ఎ.బి.షా.తో కలసి హ్యూమనిస్ట్, సెక్యులరిస్ట్ వుద్యమాలకై బాగా కృషి చేశారు. ఎ.బి.షా నిర్వహించిన సెమినార్ల ఫలితంగా గాంధీ, నెహ్రూలపై మంచి రచనలు వచ్చాయి. శిబ్ రే గాంధీపై రచనల్ని పరిష్కరించి ప్రచురించారు. నచికేత ప్రచురణవారు వాటిని వెలువరించారు. 'క్వెస్ట్' పత్రికకు ప్రామాణిక వ్యాసాలు రాశారు. 'జిజ్ఞాస' అనే (త్రైమాసిక) బెంగాలీ పత్రిక కలకత్తా నుండి జీవితమంతా నడిపారు శిబ్ రే. ఉబ్బస వ్యాధితో సతమతమౌతూనే రోజు కలకత్తా ట్రాంలలో, బస్సులలో రినైజాన్స్ ఆఫీసుకు వచ్చేవారు. శాంతినికేతన్‌లో వారికి ఇల్లు ఉండేది. 2008లో అక్కడే చనిపోయారు.

ఎం.ఎన్.రాయ్ జీవిత చరిత్రను పరిశోధనాత్మకంగా రాశారు. రాయ్ తిరిగిన దేశాలలో కొన్నింటికి వెళ్ళి మరికొన్ని చోట్ల నుండి విషయ సేకరణ చేసి, సమగ్రంగా రచన చేశారు. ఎం.ఎన్.రాయ్ రచనలన్నీ క్రోడీకరించారు. అందులో 4 సంపుటాలు ఆక్స్‌ఫర్డ్ వారు ప్రచురించగా ప్రపంచ వ్యాప్తి చెందాయి. ఇంకా రెండు సంపుటాలు రావలసి వుంది. రాయ్ పై డాక్యుమెంటరీలకు ప్రయత్నించారు. రాడికల్ డెమోక్రటిక్ సిద్ధాంతాలుగా 22 సూత్రాలు రూపొందించడంలో కీలక పాత్ర వహించారు. 1948లో ఆయన ఉపన్యాసాలు విన్నట్లు ఆవుల గోపాల కృష్ణమూర్తి చెప్పారు. ఎమ్.ఎన్.రాయ్. శిబ్ రేలు కలసి 'ఇన్‌మేన్స్ ఓన్ ఇమేజ్' అనే సిద్ధాంత గ్రంథంలో 22 సూత్రాల విపులీకరణ చేశారు. ఉత్తరోత్తరా వాటిలో చాలా మార్పులు అవసరమని ఎ.బి.షా అనగా శిబ్ రే అంగీకరించారు.

తస్లీమా నస్రీన్ రచనల్ని బాగా ప్రోత్సహించి ఆమెకు కలకత్తాలో శిబ్ రే అండగా నిలిచాడు. శిబ్ రే అంటే తస్లీమా చాలా యిష్టపడేది. పెద్ద దిక్కుగా భావించాం హ్యూమనిస్టు ఉద్యమాన్ని శిబ్ రే ప్రోత్సహించినా తానుగా ఎలాంటి

బాధ్యతలు చేబట్టలేదు. తార్కుండే ఉద్యమ కృషికి ప్రోత్సాహం పలికేవాడు. ఆయన చివరి రోజులలో శాంతినికేతన్ సభలలో మేము కలసి వుండగలిగాం. రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమ చరిత్రను రాయ్ జీవితంతో మిళితం చేసి రాసే ప్రయత్నంలో, శిబ్ రే చాలా విషయ సేకరణ చేశారు. ఆంధ్రకు సంబంధించి కొంతమేరకు నేను విషయాన్ని అందించగలిగాను. రాయ్ పర్యటించిన అనేక దేశాలు శిబ్ రే వెళ్ళి విషయ సేకరణ చేశారు. జర్మనీలో, రష్యాలో, మెక్సికోలో, చైనాలో, ఇతరులకు అందుబాటులో లేని అనేక అంశాలను వెలికి తెచ్చారు. జీవితమంతా రాయిస్ట్ చరిత్రకారుడిగా నిలిచారు. సాహిత్య రంగంలో ఆయన అనేక ప్రామాణిక వ్యాసాలను క్వెస్ట్, న్యూ క్వెస్ట్, రాడికల్ హ్యూమనిస్ట్ పత్రికల్లో రాశారు. సెమినార్‌లలో మంచి వక్త కూడా.

⁂

## మానవవాద ప్రచారకుడు
# వి.ఎం. తార్కుండే



తార్కుండే తో ఇన్నయ్య



హైదరాబాదు నిజామ్స్ కాలేజీలో ఉపన్యసించిన సందర్భంగా....

L to R **మొదటి వరసలో** వి.ఎం. తార్కుండే, గోపాలరావు ఎగ్బోటే, ఆవుల సాంబశివరావు. **రెండవ వరుస** - ఎ.హెచ్.వి. సుబ్బారావు, పి.వి.రాజగోపాల్, అబ్బూరి రామారావు, ఎ.ఎల్. నరసింహారావు. **మూడవ వరుస** - అలామ్ ఖుంద్మిరి, జి.ఆర్. దాల్వి . **నాలుగవ వరుస** - ఎన్.కె.ఆచార్య, ఎ.ఎస్. వడ్యాల్కర్ ఎన్. ఇన్నయ్య. **ఐదవ వరుస** - జాస్తి శూలపాణి, కొసరాజు సాంబశివరావు, పి.ఎస్. నారాయణ

1940 ప్రాంతాల నుండీ ఆంధ్ర రాడికల్స్‌కు చిరపరిచితుడు తార్కుండే. తమ పూర్వీకులు ఆంధ్ర నుండి వలస వచ్చారనీ, ఇంటిపేరు తాడికొండ అనీ, మరాఠీలో తార్కుండే అయిందని చెబుతుండేవారు. పూర్తి పేరు విఠల్ మహదేవ్ తార్కుండే (03.07.1909 - 22.03.2004).

ఎం.ఎన్.రాయ్‌కు అటు పార్టీలోనూ యిటు ఉద్యమంలోనూ అత్యంత సన్నిహిత మిత్రుడు, అనుచరుడు సహచరుడుగా ఆయన ఉన్నాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి, చదువుకొని అడ్వొకేట్‌గా ప్రాక్టీసు చేస్తూ బొంబాయి హైకోర్టు జడ్జి అయ్యాడు. పాస్‌పోర్టు పొందే హక్కుపై చారిత్రాత్మక తీర్పు యిచ్చి, సంచలనం సృష్టించారు. పౌరులందరికీ పాస్ పాస్‌పోర్టు పొందే హక్కు ఉన్నదని చెప్పారు. ఎం.ఎన్.రాయ్‌తో ఆయనకు సెంటిమెంటల్ అనుబంధం వుంది. రాయ్ సంస్మరణ సభలలో డెహ్రాడూన్ రాయ్ నివాసంలో గతస్మృతులు తలచుకొని కన్నీళ్ళు పెట్టాడు. జడ్జిగా తన స్వేచ్ఛకు పరిమితులు వున్నాయని, వుద్యమానికి ఏమీ చేయలేక పోతున్నాని రాజీనామా యిచ్చి, సుప్రీంకోర్టులో ప్రాక్టీసు పెట్టాక పూర్తిగా ఉద్యమంలో నిమగ్నుడయ్యాడు. రాడికల్ హ్యూమనిస్ట్, రేషనలిస్ట్, రినైజాన్స్ ఉద్యమాలతో బాటు పౌరహక్కుల ఉద్యమం సాగించాడు.

ఎమర్జన్సీలో ఇందిరా గాంధీని వ్యతిరేకించి, జయప్రకాశ్ నారాయణ్‌ను సమర్థించాడు. ముస్లింలలో తీవ్రవాదులను దూరం చేసి, మితవాదులను కలుపు కోవాలనేవాడు. 'రాడికల్ హ్యూమనిస్ట్' పత్రిక నడపడానికి, రాయ్ సాహిత్య ప్రచుర ణకూ చాలా సహాయపడ్డాడు.

దేశవ్యాప్తంగా పర్యటించి సభలు సమావేశాలు, అధ్యయన తరగతులలో ఎందరికో పాఠాలు చెప్పారు. నేను ఆయన్ను బొంబాయి డెహ్రాడూన్‌లో, ఆంధ్రలో, ఢిల్లీలో అనేక పర్యాయాలు కలిశాను. ఉద్యమంలో పనిచేశాం. ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాం. అనేక వ్యాసాలు, ప్రచురణలు చేసిన తార్కుండేకు ఆయన భార్య గౌరి చేయూత నిచ్చేది.

ఢిల్లీలో మాకు ఆయన ఇంట్లో ఎన్నోమార్లు ఆతిథ్యం యిచ్చారు. స్వయంగా కారు నడుపుతూ నన్ను, ఎం.వి.రామమూర్తిని తీసుకువెడితే యింట్లో ఉద్యమ కబుర్లు చెప్పుకునేవాళ్ళం. బొంబాయిలో ఇందుమతి పరేఖ్ ఇంట్లో ఉన్న సమావేశాలలో కలిసేవాళ్ళం. నార్ల వెంకటేశ్వరరావుకి పరిచయం చేశాను. నార్ల తన రచన ఒకటి తార్కుండేకు అంకితం చేశారు. ఆలపాటి రవీంద్రనాథ్‌కి కూడా పరిచయం చేశాను.


1982లో తార్కుండే కుమార్తె మాణిక్ పెళ్ళి ఢిల్లీలో ఇండియా ఇంటర్ నేషనల్ సెంటర్‌లో జరిగింది. నేను ఒక్కడినే ఆంధ్ర నుండి ఆ పెళ్ళిలో అతిథిగా పాల్గొన్నాను. ఆయన ఎంతో ఆనందించారు. ఆ తరువాత మాణిక్‌ను నేను ఎప్పుడైనా కలిసేవాడ్ని. ఆమె ఉద్యమంలో చురుకుగా లేదు. ఆయన భార్య గౌరి కొన్నాళ్ళు వీల్ ఛైర్‌లో వుంటూ చనిపోయింది. తార్కుండేను మాణిక్ చూచుకునేది. రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమానికి ఇండియాలో తార్కుండే వలన గుర్తింపు వచ్చిందని శిబ్ నారాయణ్ రే అనేవారు. ఆయనకు ప్రియ శిష్యుడుగా ఎం.ఎ.రాణె ఒక సంస్మరణ సంచిక చక్కగా వెలువరించారు. రినైజాన్స్ సంస్థ ప్రతి ఏటా తార్కుండే స్మారకోపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నది. వీటి ఏర్పాటులో అజాద్ పాంచొలి, బిడి శర్మ శ్రద్ధ వహిస్తున్నారు. నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపేస్తున్నారనే విషయమై జస్టిస్ భార్గవ కమీషన్ విచారణ చేపట్టింది. అందులో వి.ఎం.తార్కుండే, మావోయిస్టుల హక్కులపై వాదించారు. ఇది 1976 ప్రాంతాల్లో జరిగింది. అప్పుడు తరచుగా ఆయన హైదరాబాద్ వస్తుండేవారు.

ఎం.ఎన్.రాయ్ 22 సిద్ధాంతాలు ఇప్పటికీ సరైనవేనని ఆయన అభిప్రాయం. ఆ విషయంలో ఏ.బి. షా, నేను విభేదించాము. ఆధునిక విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి దృష్ట్యా ఆ సిద్ధాంతాల్లో మార్పులు, చేర్పులు అవసరమని మా వాదన. అలాగే హోమియోపతి తాను కొన్ని సందర్భాలలో వాడానని, కనుక ఇది పూర్తిగా కొట్టి పారేయటానికి వీల్లేదని తార్కుండే అనేవారు. అప్పుడు కూడా మేము ఆయనతో తీవ్రంగా విభేదించి శాస్త్రీయంగా రుజువయ్యేవరకు హోమియోపతి అంగీకరించ రాదు అని గట్టిగా చెప్పేవాళ్ళం. తార్కుండే ఎంత గట్టిగా అభిప్రాయాలను వెల్లడించే వాడో స్నేహితుడిగా అంత సహృదయుడు.

భారత మానవ వాద సంఘాధ్యక్షుడుగానూ, పునర్వికాస ఉద్యమనాయకుడుగానూ ఆయన దేశమంతా పర్యటించి ఇతర సంఘాలను కలుపుకొని అనేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎందరినో ఉద్యమానికి సంసిద్ధులను చేశారు. మంచి వక్త. వ్యక్తిగత స్నేహాన్ని అభిలషించేవాడు. అతిసాధారణ జీవితం గడుపుతూ ఉన్నతంగా ఆలోచిస్తూ రచనలు చేశారు. ఎమ్.ఎన్.రాయ్ సాహిత్యాన్ని, భావాలను జనంలోకి తీసుకువెళ్ళడానికి బాగా తోడ్పడ్డారు. ఆయనతో పరిచయం, సన్నిహితత్వం ఉండడం ఎంతో సంతృప్తిని కలిగించింది.

*

# గొప్ప కార్మిక హ్యూమనిస్ట్
# వి.బి.కార్నిక్



వి.బి.కార్నిక్, ఎమ్.ఎన్.రాయ్, మణిబెన్ కారా

ఎమ్.ఎన్.రాయ్‌తో భుజం మీద చెయ్యివేసి చనువుగా వుండగల మానవ వాద కార్మిక నాయకుడు వి.బి.కార్నిక్. 1930లో ఎమ్.ఎన్.రాయ్ విదేశాల నుండి ముంబయిలో అడుగుపెట్టినప్పుడు తొలుత కలుసుకున్న వారిలో కార్నిక్ ఉన్నాడు. అప్పటి నుండి రాయ్ చనిపోయేవరకు అతి సన్నిహితుడుగా అన్ని విధాల ఉద్యమాలలో అండగా నిలిచాడు.

వసంత భగవంత్ కార్నిక్ ఆయన అసలు పేరు. ముంబయిలో ఆయనను బాబా అని ఆప్యాయంగా పిలిచేవారు. కార్మిక రంగంలో కార్నిక్ మంచి పట్టు సాధించి, రాయ్‌కు మద్దత్తు యిచ్చాడు. యస్.యమ్.జోషితో కలసి కార్మిక రంగంలో చాలా పోరాటాలు సాగించాడు. గిర్నీ కర్మాగార్ యూనియన్ మొదలు ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, రేవు కార్మికుల యూనియన్‌తో సహా అనేక కార్మిక సంఘాలలో ప్రముఖ పాత్ర వహించాడు. రాయ్ జైల్లో వుండగా కార్నిక్ చేతనైనంత ఆదుకున్నాడు. రాడికల్ డెమొక్రటిక్ పార్టీలో, తరువాత వుద్యమంలో కార్నిక్ కీలక పాత్ర వహించాడు. 'రాడికల్ హ్యూమనిస్ట్' పత్రిక, ఇండిపెండెంట్ ఇండియా పత్రికలు సాగించడంలో కార్నిక్ జీవితమంతా తోడ్పడ్డాడు. బొంబాయిలో వుంటూ పర్యటనలు చేసేవాడు.

కార్నిక్ మితభాషి సౌమ్యుడు.

కార్నిక్ బొంబాయిలో రతీలాల్ మేన్షన్, సాహిత్య సహవాస్ భవనాలలో వుండేవాడు. అక్కడ ఎన్నోసార్లు కలిశాను. ఆంధ్రకు పర్యటన నిమిత్తం వచ్చినప్పుడు కలిశాం. 1970లో ఆయన భార్యను హత్య చేశారు. కార్నిక్ పైకి కనిపించకపోయినా చాలా చలించి, మౌనం వహించాడు.

రాయ్ అనంతరం లెస్లిసహని ఫౌండేషన్ పేరిట ప్రజాస్వామ్య వికేంద్రీకరణ వుద్యమం సాగించారు. శిక్షణ తరగతులు నిర్వహించారు. గుంటూరు, హైదరాబాద్‌లలో నేను పాల్గొన్నాను. జి.ఆర్.దల్వి ఆహ్వానంపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల సెమినార్లకు కార్నిక్ వచ్చినప్పుడు అది అవకాశంగా తీసుకొని బయట సమావేశాలు పెట్టాం. ఆ రకంగా ఆయనను సన్నిహితంగా కలుసు కోవడానికి అనుభవాలు పంచుకోవడానికి ఆస్కారం ఏర్పడింది.

డెహ్రాడూన్ స్టడీ కాంప్‌లో (1975 ప్రాంతాలలో) కలసి వున్నాం. అప్పుడు జి.డి.పరేఖ్ వున్నారు.

ఎం.ఎన్.రాయ్ జీవిత చరిత్ర విపులంగా రాసిన వి.బి.కార్నిక్, సంక్షిప్త జీవిత చరిత్ర కూడా రాశారు. అవి రెండూ తెలుగులో అనువదించాను. తెలుగు అకాడమీ వారు పెద్ద గ్రంథాన్ని, నేషనల్ బుక్ ట్రస్ట్ వారు చిన్న రచన అనువాదాన్ని ప్రచురించారు. కార్మికోద్యమ చరిత్ర, ట్రేడ్, యూనియన్ చరిత్ర కూడా నేను తెనిగించగా తెలుగు అకాడమీ ప్రచురించింది. స్వాతంత్ర్యానికి పూర్వం కార్మిక ఉద్యమ చరిత్రకు అవి అద్దం పట్టాయి. డబ్ల్యు.ఎస్.కాణె యిష్టపూర్వకంగా కార్నిక్ రచన ఎం.ఎన్.రాయ్ జీవితచరిత్రను మార్కెటింగ్ చేశారు. కార్నిక్ లా చదివి తొలిదశలో పూనాలో వుంటూ తరువాత ముంబాయిలో స్థిరపడ్డారు. గాంధీజీ శిష్యుడుగా రాజకీయాలలో ప్రవేశించి యమ్.ఎన్.రాయ్ ప్రభావం వలన రాడికల్ హ్యూమనిస్ట్‌గా మారిపోయాడు. 1985 నవంబర్ 5న చనిపోయాడు. ఆయన సన్నిహితులుగా తర్క తీర్థ లక్ష్మణ శాస్త్రి జోషి, మణిబెన్ కార, జె.బి.హెచ్. వాడియా వి.యమ్.తార్కుండే. ఎ.బి.షా., శిబ్‌నారాయణ్ రే ఉండేవారు. 1940 ప్రాంతాల నుండి ఆయన ఎన్నో పర్యాయాలు ఆంధ్రకు వచ్చి వెళ్ళారు.


1962 నాటి కేంద్ర మంత్రి కృష్ణ మీనన్‌కు వ్యతిరేకంగా ఆచార్య కృపలానీ పోటీ చేయగా కార్నిక్ కృపలానీ పక్షాన నిలిచి పోరాడారు.

పూనాలో చదివి, వకీలు వృత్తి కొన్నాళ్ళు చేసి తరువాత ఎమ్.ఎన్.రాయ్ అనుచరుడుగా ఉద్యమాలలో నిమగ్నుడైపోయాడు. మణిబెన్ కారా జీవిత చరిత్ర రాశాడు. మరాఠీ వారపత్రిక 'చిత్ర'ను ఎడిట్ చేశాడు.

⁕

# ఏం చూసి అమెరికా గుర్తించింది?

## ఎ.జి.కె. (ఆవుల గోపాలకృష్ణమూర్తి)





ఉపన్యసిస్తున్న ఆవుల గోపాకృష్ణమూర్తిగారు,
గోరా, ఎమ్.వి. రామమూర్తి, వెనుక ఇన్నయ్య.

ఈ సంఘటన 46 సంవత్సరాల క్రితం జూన్ మాసంలో జరిగింది. హఠాత్తుగా ఒకనాడు తెనాలిలో ఎ.జి.కె. తన కూతురు పెళ్ళి సందడిలో ఉండగా మదరాసు అమెరికా కాన్సలేట్ ఆఫీసు నుంచి సుప్రసిద్ధ రచయిత జర్నలిస్ట్ బి.ఎస్.ఆర్. కృష్ణ వచ్చారు. పెళ్లి జరుగుతున్నది. జయశ్రీ - రాజగోపాల్‌కు. ఆవుల గోపాలకృష్ణమూర్తి కుమార్తె జయశ్రీ. బి.ఎస్.ఆర్. ఆ పెళ్ళికి వచ్చాడని అందరూ భావిస్తుండగా అతడు జేబులోనుండి ఒక కాగితం తీసి ఎజికె (ఆవుల గోపాల కృష్ణమూర్తి)కి అందించాడు. విప్పిచూసి అమెరికా ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా తమ దేశం పర్యటించమని పంపిన ఆహ్వానం అది. అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

ఎ.జి.కె. మంత్రి పదవులు నిర్వహించలేదు. ప్రభుత్వ అవార్డులు, బిరుదులు లేవు. రాజకీయ నాయకుడూ కాదు. సినిమా, క్రీడారంగంలో సెలబ్రిటి కాదు. అలాంటి వ్యక్తికి ఆనాడు అమెరికా ప్రభుత్వం దేన్ని చూసి గుర్తింపు ఇచ్చిందో అప్పటికి తెలియదు. ఆనాడు అమెరికా నుండి అలాంటి ఆహ్వానం రావడం చాలా అరుదు. బహుశ ఆంధ్రప్రదేశ్‌లో ఆ విధమైన గుర్తింపు తొలిసారి వచ్చినట్లు చెబితే అతిశయోక్తి కాదు.

ఎ.జి.కె. కేవలం ఒకసారి తెనాలి పురపాలక సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. వృత్తి కోర్టులో ప్లీడర్. పుట్టింది మూల్పూరు అనే కుగ్రామంలో (1917). ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేసిన ఆవుల సాంబశివరావు కూడా ఆ వూరి వారే. ఎం.ఎ., ఎల్.ఎల్.బి. చదువు లక్నోలో పూర్తి చేశాడు. పెళ్ళి అయింది. ఆరుగురు సంతానం.

స్వాతంత్ర్యానికి ముందూ తరువాతా దేశాన్ని చూచిన వ్యక్తి ఎజికె. పోనీ సుప్రసిద్ధ రాజకీయ పార్టీలలోనూ లేడు. రాడికల్ డెమోక్రటిక్ పార్టీని ఎం.ఎన్.రాయ్ 1940లో స్థాపించగా అందులో ఉన్నాడు. అది కాస్తా 1948లో రద్దయింది.

చదువుకునే రోజులలో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను కలిశాడు. బోసు కాంగ్రెసు అధ్యక్షుడిగా ఓడిపోయినప్పుడు లక్నో వస్తే పలకరించే నాథుడేలేని సందర్భంగా 1938లో ఎ.జి.కె. హాస్టల్‌లో తన గదికి ఆహ్వానించి, ఆదరించాడు. గెలిచిన వాడే గొప్ప అని గుర్తించే సమాజం కదా మనది.

సుప్రసిద్ధ సంస్కరణవాది, సాహిత్యంలో విప్లవ వాది వివాహాలు తెలుగులో చేయించి, స్త్రీ పురుషులు సమానమని చాటిన త్రిపురనేని రామస్వామి తెనాలిలో వుండగా ఎ.జి.కె.కు పరిచయమైంది. అలాగే రచయిత చలంతోనూ సన్నిహితత్వం ఏర్పడింది. వారిరువురినీ ఎం.ఎన్.రాయ్‌కి కలిపి పరిచయం చేశాడు 1940లో.

ఆయన్ను స్నేహితుల సర్కిల్ ఎ.జి.కె. అని ఆప్యాయంగా పిలుచుకునేది.

వ్యాసోపన్యాసకుడు అని ప్రసిద్ధి చెందాడు. 1940 నుండి చిన్న పత్రికలలో విపరీత వ్యాఖ్యాన సహిత వ్యాసాలు రాశాడు. స్వయంగా రాడికల్, రాడికల్ డెమోక్రాట్, సమీక్ష యిత్యాది పత్రికలు నడిపి చేతులు కాల్చుకున్నాడు -

ఇంగ్లీషులో ధారాళంగా వ్యాసాలు రాసినట్లే, ఉపన్యాసాలు చేసేవాడు.

ఆయన పలుకులు ప్రత్యేక ఆకర్షణ. పెళ్లి ప్రసంగాలు మరీ మధురంగా వుండేవి. త్రిపురనేని రామస్వామి వివాహవిధి పద్ధతిలో, తెలుగులో ప్రమాణాలు చేయించి, చక్కని సలహా ప్రసంగాలతో రక్తి కట్టించేవాడు. చిన్న కవుల్ని, చిన్న కళాకారుల్ని, ముఖ్యంగా దళిత, వెనుకబడిన రచయితలను అరమరికలు లేకుండా ఆదరించి ప్రోత్సహించడం ఆయన ఆనవాయితీ. పద్యం, గద్యం హృద్యంగా చదివేవాడు. సునిశిత విమర్శలే కాక మాడు పగిలే ఘాటైన వ్యాఖ్యలు చేసేవాడు. చక్కని కవిత అంటే ఆకర్షితుడయ్యేవాడు. శామ్యుల్ జాన్సన్, మాచ్యూ ఆర్నాల్డ్, స్టీఫెన్ స్పెండర్, ఆడిన్ కవితలు, తెలుగులో కాటూరి, ఏటుకూరి

నరసయ్య, త్రిపురనేని, శ్రీపాద కృష్ణమూర్తి, పెండ్యాల సుబ్రహ్మణ్యం, జాషువా యిలా ఎందరో యిష్టం. సంగీతం, కళలు ప్రియం, ఆటలు ఆడేవాడు. ఆడించేవాడు. క్యారమ్స్ బ్యాడ్మింటన్ ఆటలలో పాల్గొనేవాడు.

మరోపక్క రెడ్ క్రాస్, దళిత సంఘాల కార్యక్రమాలలో, వెనుకబడిన వారి సమావేశాలలో బాగా ఆసక్తిగా పాల్గొని, కొత్త భావాలతో ప్రోత్సహించేవాడు. గోలి శేషయ్య మొదలు ఎందరో చిత్రకారులు ఆయనవద్ద కొలువు తీరేవారు. అలాగే కవులు కూడా. కొండవీటి వెంకటకవి, వెంకట సుబ్బయ్య వాసిరెడ్డి (వడ్లమూడి) మరెందరో సందర్శించేవారు. తిరోగమన భావాలు గల కవుల్ని, రచయితల్ని వుతికి ఆరేసేవాడు. అందులో నోరి నరసింహ శాస్త్రి నుండి విశ్వనాథ సత్యనారాయణ వరకూ వున్నారు. నాటికలు, నాటకాలు బాగా ప్రోత్సహించేవాడు.

ఆయన సన్నిహితులలో జి.వి. కృష్ణారావు, పాలగుమ్మి పద్మరాజు, బైరాగి, గోకుల్‌చంద్, ఎలపర్తి రోశయ్య, జాస్తి జగన్నాధం, గోపీచంద్ ఉన్నారు.

రాజకీయాలలో భిన్నాభిప్రాయాలుగల ఆచార్య రంగా, దామోదరం సంజీవయ్య, ఆలపాటి వెంకటరామయ్య వంటి వారు వచ్చి ఉచిత సలహాలు స్వీకరించేవారు.

విమర్శలకు గురైన వారిలో నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, కల్లూరి చంద్రమౌళి, ఎస్.బి.పి. పట్టాభిరామారావు, మండలి వెంకట కృష్ణారావు  వున్నారు. పదవి కోల్పోయిన వారిలో ప్రతిభ వుంటే గుర్తించడం ఆయన ప్రత్యేకత. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిని అలాగే గుర్తించాడు రైతు అభిమానిగా.

ఎన్ని అధ్యయన శిక్షణా శిబిరాలలో యువకులకు తర్ఫీదు యిచ్చాడో లెక్కలేదు.  ఎందరు తమ రచనలకు పీఠికలు రాయించుకున్నారో కూడా లెక్కలు లేవు.

1960లో అన్నాదురైను తెనాలి తీసుకువచ్చి హేతువాద సభలు జరిపారు. ఎం.ఎన్.రాయ్ ఎన్నోసార్లు  తెనాలికి వచ్చారు.

ఎజికెను జర్నలిస్టు అనవచ్చా? ఔను, కాదు. పత్రికలలో విపరీతంగా రాయడమే కాదు. చిన్న పత్రికలు ఎడిట్ చేశారు. ఆ విధంగా జర్నలిస్ట్ అవుతాడు. పండితారాధ్యుల నాగేశ్వరరావు మొదలు నార్ల వెంకటేశ్వరరావు వరకూ సన్నిహిత జర్నలిస్ట్ మిత్రులు వుండేవారు. ఆయన సలహాలు కూడా స్వీకరించేవారు.

అబ్బూరి రామకృష్ణారావు నుండి ఎందరో మానవవాదులు ఎజికె సలహాలు పొందారు. ఎజికె 1940 ప్రాంతాలలోనే గాంధీపై ఘాటైన వ్యాసం రాస్తే తోటి హ్యూమనిస్ట్ అబ్బూరి అదిరిపడి, ఎంఎన్‌రాయ్‌కు ఫిర్యాదు చేశారు. ఇంగ్లీషులో వ్యాస సారాంశం పంపించారు. అయితే అబ్బూరి ఆశించిన దానికి భిన్నంగా, ఎజికెని వెనకేసుకొచ్చాడు రాయ్.

ఇక అమెరికా పర్యటనలో జవహర్‌లాల్ నెహ్రూ విధానాలపై విమర్శలు చేసిన ఎజికెను ఆనాటి రాయబారి బి.కె.నెహ్రూ బెదిరించాడు. ఇండియాకు పంపించేస్తానన్నాడు. కాని ఎజికె బెదరలేదు సరికదా తాను విమర్శించడం మానేయనని కచ్చితంగా చెప్పేశారు.

ఎజికె 1963 జూన్‌లో అమెరికా బయలుదేరుతుంటే కావాలనే పెద్ద దుమారం రేపారు. వివేకానందను పొగడమన్నారు. కాని తాను వున్నది వున్నట్లు చెబుతానన్నాడు. దానికి చిలవలు పలవలుగా భాష్యం చెప్పి, ఇంకేముంది, వివేకానందపై వ్యతిరేక ప్రచారం చేయబోతున్నాడని ఆంధ్రప్రభ సంపాదకుడు నీలంరాజు వెంకట శేషయ్య పత్రిక ద్వారా దుమ్మెత్తి పోస్తే, ఎజికె దులిపేశాడు. అమెరికాలో వివేకానంద ప్రస్తావన రాలేదనుకోండి.

కాలిఫోర్నియా రాష్ట్రంలో ఫ్రెస్నో మునిసిపాలిటీవారు ఎజికెను ఒకరోజు గౌరవ అధ్యక్షులుగా చేశారు. అదొక అరుదైన గౌరవం. అమెరికాలో పాఠశాలలను సందర్శించి చిన్న పిల్లలతో కలసిపోయేవారు. కేరింతలు కొట్టేటట్లు ఎజికె కలిసిపోయాడండే ఆయన ప్రతిభ చెప్పుకోవాల్సిందే. వడ్లమూడి శ్రీకృష్ణ దగ్గర చికాగోలో మకాం చేశారు.

ఇదంతా 1963లో జరిగింది. తిరిగి వచ్చిన తరువాత విశేషాలు రాశాడు. వేదికలపై చెప్పాడు.


అమెరికా అతిథిగా ఆహ్వానించిన వారిలో ఇంతటి విశిష్ట బహుముఖ ప్రజ్ఞాశాలిని తాము చూడలేదని అమెరికావారు అంతర్గతంగా చెప్పుకున్నారట.

అలాంటి ఎజికె 1967లో చనిపోయారు. అప్పుడు ఆయన వయస్సు 50 ఏళ్ళే.

'నా చుట్టూ ప్రపంచం' అనే శీర్షికతో వాహిని వారపత్రికలో రాసిన ఎజికె వ్యాఖ్యలు ఆయన విశ్వదృష్టికి అద్దం పడతాయి.

✳




This is to Certify that
is hereby appointed
Honorary Mayor
of the CITY OF FRESNO
for the day of

## హ్యూమనిస్ట్ హీరోయిన్

# మణిబెన్ కారా



1974లో మణిబెన్ హైదరాబాద్ వచ్చే నాటికి ఆమెలో బాగా వృద్ధాప్యం కనిపించింది. అప్పటికే ఆమె మానవవాద, కార్మిక రంగాలలో ఆరి తేరిన కార్యకర్త, నాయకురాలు. దేశంలోనూ, ప్రపంచంలోనూ పర్యటన చేసి స్త్రీల హక్కుల కోసం నిరంతర కృషి చేసిన మణిబెన్ 1905లో బొంబాయిలో పుట్టారు. ఆమె మధ్యతరగతి కుటుంబీకురాలు కావటంతో గామడెన్‌లోని సెయింట్ కొలంబా హైస్కూల్లో చదివింది. ఆ తరువాత ఇంగ్లాండులో సాంఘిక కార్యక్రమాల శిక్షణ అధ్యయనం చేయటానికి బర్మింగ్ హమ్ వెళ్ళారు. తిరిగి వచ్చిన తరువాత కార్మిక రంగంలో దిగిపోయి. నిర్విరామ శ్రమ చేసి, రేవు కార్మికులు, గుడిసెలలో మగ్గుతున్న పేద ప్రజలు, హక్కులు లేకుండా బతుకుతున్న స్త్రీల సమస్యలను పట్టించుకోవటం ప్రారంభించారు. ఆ కృషిలో భాగంగా వివిధ కార్మిక సంఘాలలో బాధ్యతలు స్వీకరించి అఖిలభారత ట్రేడ్ యూనియన్ నాయకురాలిగా ఆవిర్భవించారు. ఆ విధంగా ఆమెకు వి.బి.కర్నిక్, ఎన్.ఎం.జోషి వంటి వారు పరిచయమయ్యారు. వారి సహకారంతో కార్మిక రంగంలో ఎనలేని సేవలు చేసి గుర్తింపు పొందారు.

బొంబాయిలో ఒక ప్రింటింగ్ ప్రెస్ నెలకొల్పి కొంత కాలం నడిపారు. 1930లో విదేశాల నుండి అప్పుడే తిరిగి వచ్చిన ఎం.ఎన్.రాయ్‌తో పరిచయ

మైంది. అది సన్నిహితమై చివరకు రాయ్ నెలకొల్పిన రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో ప్రధాన పాత్ర నిర్వహించేటట్లు చేసింది. ఆ తరువాత మానవ వాద ఉద్యమంలో ఆమె నిమగ్నురాలైంది. ఈ లోగా జాతీయ రాజకీయాలలో మునిగి తేలింది. 1931లో స్విజ్జర్‌లాండ్ నుండి ఓడలో వచ్చి బొంబాయిలో దిగిన లూసి గెస్లర్‌ను కలిసింది. ఆమెను బ్రిటిష్ గూడచారులు వెంబడించగా మణిబెన్ కాపాడి ఎం.ఎన్.రాయ్ దగ్గరకు రహస్యంగా తీసుకు వెళ్ళింది. కానీ త్వరలోనే పసిగట్టిన బ్రిటిష్ ప్రభుత్వం లూసీని మళ్ళీ విదేశాలకు పంపించేసింది.


పోరాటాల సందర్భంగా 1932లో మణిబెన్ అరెస్ట్ అయింది. ఎం.ఎన్. రాయ్‌కు అండగా నిలిచింది. కేంద్ర శాసన సభకు సభ్యురాలిగా ఎన్నికై కొన్నాళ్ళు పనిచేసింది. అనేక మురికి వాడలలో సాహసించి సాంఘిక కార్యక్రమాలు నిర్వహించింది. ఆమె కృషికి తోడుగా ఇందుమతి ఫరేఖ్ నిలిచారు. ప్రభుత్వం నియమించిన వివిధ స్త్రీ సంక్షేమ సంఘాలలో మణిబెన్ కృషి చేశారు.

ఆమె మా ఆహ్వానంపై హైదరాబాద్ పర్యటించారు. అలా వచ్చినప్పుడు నగరం చూడటమే కాక, నాటి ప్రముఖ మానవ వాద నాయకులు, న్యాయమూర్తి ఆవుల సాంబశివరావు ఇంటికి ఆమెతో నేనూ, కోమల కలసి వెళ్ళాము. అప్పుడు సాంబశివరావు హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఉండేవారు. ఆయన కుమార్తె మంజులత అప్పుడు ఒక కుమారుడుని ప్రసవించింది. మణిబెన్ ఆ పసివాడికి ఒక జ్ఞాపిక బహూకరించింది. అలా ఇవ్వడం మంచి సంప్రదాయమని మాతో చెప్పింది. హైదరాబాద్ పాతబస్తీలో అనేక వస్తువులపై ఆమె ఆసక్తి కనపరచింది. స్త్రీల సంఘాలలో తన కృషి, అనుభవాలు ఎన్నో వివరించింది. ఎమ్.ఎన్. రాయ్‌తో సుదీర్ఘ పరిచయాలు, అనుభవాలు ఎంతో ఓపికగా చెప్పారు.

1979లో ఆమె చనిపోయారు. చివరి వరకు మానవ వాద ఉద్యమ నాయకురాలిగా ఆమె చేసిన కృషి గణనీయమైనది. వి.బి.కర్నిక్ ఆమె జీవిత చరిత్రను సంక్షిప్తంగా ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ మహా సభలలో ప్రతినిధిగా మణిబెన్ పాల్గొని తన వ్యక్తిత్వాన్ని చూపారు.

⁂

# బసవ ప్రేమానంద్



## ప్రేమానంద్‌కు జోహార్లు

హేతువాదానికి జీవితాన్ని అర్పించిన ప్రేమానంద్ 2009 అక్టోబర్ 4న చనిపోయారు. కెన్సర్‌తో చివరి మూడు సంవత్సరాలు సతమతమౌతూనే చనిపోబోతున్నానని తెలిసి కూడా పర్యటనలు చేసి మానవ విలువలను ప్రచారం చేసిన ఘనత ప్రేమానంద్‌దే.

కేరళలో 1930లో ఒక అయ్యర్ కుటుంబంలో పుట్టిన బసవ ప్రేమానంద్ ఆరుగురి సంతానంలో ఒకరు. తొలుత జీ.డి. నాయుడు సహకారంతో పరిశ్రమల రంగంలో కుదురుకొని, తరువాత అది తన కుటుంబానికి అప్పజెప్పి తను మాత్రం పూర్తిగా హేతువాద ఉద్యమంలోకి దిగిపోయారు. ప్రపంచంలో అనేక దేశాలు పర్యటించి కొత్త విషయాలు ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ వాటిని యువతరానికి ప్రచారం చేస్తూ వచ్చారు.

చనిపోయే నాటికి ప్రేమానంద్ భార్య, ఇరువురు కుమారులు కూడా చనిపోయారు. చివరకు మిగిలింది ఆయన ఒక్కడే. కొయంబత్తూర్ వద్ద పోడనూర్‌లో తన సొంత భవనంలో సైన్స్ మ్యూజియం ఏర్పరచారు. ఇది అందరికీ అందుబాటులో ఉంచిపోయారు. డా॥ పి.ఎం.భార్గవ సిద్ధం చేసిన ఈ సైన్స్ మ్యూజియం ఢిల్లీలో, హైదరాబాద్‌లో అనేక వివాదాలకు దారితీయగా ప్రేమానంద్ ముందుకు వచ్చి సాహసంతో ఆ ప్రదర్శన తనదిగా రూపొందించగలిగారు. అందులో హోమియోపతి అశాస్త్రీయ మనీ, పరిణామ సిద్ధాంతం శాస్త్రీయమని చెప్పిన విషయాలు ఎన్నో ఉన్నాయి.

జీవితమంతా ప్రేమానంద్ బాబాల, మాతల మోసాలను ఘంటాపదంగా బయటపెట్టి, వారు చేస్తున్న ద్రోహాలను ఎదుర్కొన్నారు. వాటిలో అనేక కష్టనష్టాలు పడ్డారు. కొన్నిసార్లు ప్రాణానికి కూడా ముప్పు తెచ్చుకున్నారు.

అనేక మంది మార్గాంతర చికిత్సల పేరుతో ప్రజలను నమ్మించి చేస్తున్న అపచారాన్ని ఆయన ఎదుర్కొని నిజాలు బయటపెట్టారు. సైకిక్ సర్జరీ చేసిన అలెక్స్ ఆర్బిటో వంటి వారి గుట్టు రట్టు చేశారు. సత్యసాయి బాబా మీద జీవితమంతా పోరాడుతూనే పోయారు. ఆయనపై డాక్యుమెంటరీతో కూడిన పుస్తకాలు ప్రచురించారు. అందులో 'మర్డర్స్ ఇన్ సాయిబాబాస్ బెడ్‌రూమ్' పుస్తకం చరిత్రాత్మకమైనది. అనేక స్టడీ క్యాంపులు, శిక్షణా కేంద్రాలు నిర్వహించి మ్యాజిక్ ద్వారా మోసాలను ఎలా బయట పెట్టవచ్చో యువతరానికి నేర్పాడు. దేశంలో ఉన్న హేతువాద, మానవవాద, నాస్తిక సంఘాలను సమన్వయం చేసి ఒక ఫెడరేషన్ ఏర్పరచి దానికి అధ్యక్షులుగా చాలా కాలం కొనసాగారు. 'ఇండియన్ స్కెప్టిక్' అనే మాస పత్రిక నిర్వహించి ఎప్పటికప్పుడు ఉద్యమ వార్తలను అందించారు.

'సైన్స్ వర్సెస్ మిరకిల్' అనే గ్రంథంలో వివిధ మ్యాజిక్ ప్రక్రియలు వివరించి, సాయిబాబా పటాల నుండి విభూది రాలటం, నిప్పులపై నడక, ఇత్యాది అనేక విషయాలు ఎలా జరుగుతాయో, విగ్రహాల నుండి పాలు కారటం, ఏవిధంగా చేస్తారో ఉదాహరణగా రుజువులతో వివరించారు. ప్రేమానంద్ ఇంగ్లీషు, తమిళం, మళయాళం భాషలు మాట్లాడేవారు. అతి సాధారణమైన జీవితాన్ని గడిపిన ఒక అసాధారణ ఉద్యమ నాయకుడు ప్రేమానంద్.

చనిపోయిన తరువాత తన దేహాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వమని ఆయన విల్లు రాశారు. అలాగే జరిగింది కూడా. ఆయన మీద చివరి దశలో దుష్ప్రచారాలు వెలువడ్డాయి. ఆయున దేవుడిలో ఆత్మలో నమ్మకాలు పెంపొందించు కున్నాడన్నారు. ఆయున చివరి వరకు అలాంటి వాటిని ఖండించి తాను హేతువాదిగా, మానవ వాదిగా చనిపోతున్నానని, శాస్త్రీయ పద్ధతి ఉత్తమ మార్గమని నిర్ధుష్టంగా ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రేమానంద్ అనేక సంఘాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుని విస్తృతంగా పర్యటించి ప్రచార సభలలో పాల్గొని, జనవిజ్ఞాన, మానవ వికాస, మానవ వాద, హేతువాద, నాస్తికవాద సంఘాలకు అత్యంత ప్రీతి పాత్రుడయ్యాడు.

❊

# మల్లాది రామమూర్తి



ప్రసంగిస్తున్న ఆవుల గోపాలకృష్ణమూర్తి
గోరా, ఎమ్.వి. రామమూర్తి, వెనుక ఇన్నయ్య (1965)



మల్లాది రామమూర్తితో ఇన్నయ్య

**భా**రత రాడికల్ హ్యూమనిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా చేసిన మల్లాది రామమూర్తి నాకు అర్థ శతాబ్దం పాటు సన్నిహిత కుటుంబ మిత్రులు. 1960 ప్రాంతాలలో గుంటూరు జిల్లా బాపట్లలో అడ్వకేటుగా ఆయన ప్రాక్టీసు చేస్తున్నప్పుడు పరిచయమయ్యాడు. అప్పట్లో ఆయన భార్య మల్లాది సుబ్బమ్మ హైస్కూలు మాత్రమే చదువుకున్న గృహిణి. ఇంటికి వెళ్ళినప్పుడల్లా ఆప్యాయంగా ఆదరించి అన్నం పెట్టిన దంపతులు, సహృదయులు. ఆ తరువాత సుబ్బమ్మను ఇంటర్, బి.ఎ.ప్రైవేటుగా చదివించి, రాయటం, చదవడం బాగా అలవాటు చేసి ఆమెను మానవవాదిగా తీర్చి దిద్దిన శ్రమ అంతా రామమూర్తిగారిదే.

కమ్యూనిస్టుగా జీవితాన్ని ప్రారంభించిన రామమూర్తి 1940 ప్రాంతాలకే ఎమ్.ఎన్.రాయ్ ప్రభావంతో మానవ వాదిగా మారి జీవితమంతా అలాగే కొనసాగారు. ఒకవైపు ప్రాక్టీసు చూసుకుంటూనే, మానవవాద ఉద్యమానికి అంకితమయ్యారు. మేమిరువురం అనేక సమావేశాలలో శిక్షణా శిబిరాలలో కలసి పాల్గొన్నాము. ఆయన ఉత్తరోత్తరా పెట్టిన 'వికాసం' అనే మాసపత్రికలో నేను చాలా వ్యాసాలు వ్రాసాను. మేమిరువురం అఖిల భారత మానవ వాద సభలకు కూడా కలసి వెళ్ళి పాల్గొన్నాము. అలాగే హేతువాద ఉద్యమంలో కూడా కలసి పనిచేశాం.

రామమూర్తి పౌరహక్కుల సంఘాలలో మానవ హక్కుల సమితిలో ఎంతో కృషి చేశారు. జయప్రకాశ్ నారాయణ్ మొదలుకొని వి.యం.తార్కుండే వరకు రామమూర్తికి ఎందరో పరిచయస్తులున్నారు. ఎమ్.ఎన్.రాయ్ దగ్గర శిక్షణ పొందిన రామమూర్తి తార్కికంగా రాసేవారూ, ఆలోచించేవారు. ఆవుల గోపాలకృష్ణమూర్తితో అతి సన్నిహితంగా ఉండేవారు. అక్కడ కూడా మేము తరచు కలిసేవారం. రామమూర్తి అనేక సెక్యులర్ పెళ్ళిళ్ళు చేయించారు. నాటికలు రాయించి ప్రదర్శింపచేశారు. అనువాదాలు చేశారు. 'ప్రజాస్వామ్య ప్రచురణలు' అనే సంస్థలో కొన్ని పుస్తకాలు వెలువరించారు. విదేశీ పర్యటనలు చేశారు. రాను రాను చివరి దశలో కేవలం సుబ్బమ్మకు తోడ్పడటం ఆమె నాయకత్వాన్ని పెంచడం పనిగా పెట్టుకున్నారు. సొంత ఖర్చు పెట్టుకొని జీవితమంతా మానవ విలువలకోసం ఉద్యమాలలో రాజీపడకుండా పనిచేశారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో, ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీలో జైలుపాలయ్యారు. 1999లో చనిపోయారు.

✳

హేతువాద ఉద్యమ సారధి

# ఎస్.రామనాథన్



మద్రాసులో హేతువాద వుద్యమం ఆరంభించి భారతస్థాయికి తీసుకెళ్ళారు. రాజాజీ మంత్రివర్గంలో మంత్రిగ 1938లో వున్నారు. ఇండియన్ రేషనలిస్ట్ పత్రిక నిర్వహించారు. మంచి హేతువాద గ్రంథాలయాన్ని సమకూర్చారు. దేశ మంతటా పర్యటించి ఉద్యమానికి ప్రోత్సాహం యిచ్చారు. హైదరాబాద్‌కు ఆహ్వానించాం. అప్పటికే బాగా వృద్ధులైపోయారు. 1976 నాటి మాట. వై.ఎమ్.ఐ.ఎస్. హాలులో అతి నెమ్మదిగా ప్రసంగించారు. అబ్బూరి, ఎ.ఎల్.నరసింహారావులు ఆ సభకు హాజరయ్యారు.

మద్రాసులో ఆయన యింట్లోకి వెళ్ళాం. చనిపోయిన తరువాత ఆయన భార్య ఆసక్తి చూపనందున గ్రంథాలయాన్ని, పత్రికను తరలించారు. సూర్య నారాయణ, జయ గోపాల్ స్వీకరించారు. జయ గోపాల్ అమెరికా వెళ్ళి పెళ్ళి చేసుకొని అట్లాంటాలో ఉంటూ వెబ్‌సైట్ నడిపారు. 2000 ప్రాంతాలలో చనిపోయారు. సూర్యనారాయణ కేరళ వెళ్ళిపోయారు. పత్రికను హైద్రాబాద్ తెచ్చి నడిపినప్పుడు జయగోపాల్ వ్యాసాలు రాశారు. ఆవుల సాంబశివరావు సంపాదకుడుగా ఎన్.కె.ఆచార్య, జాస్తి జవహర్‌లాల్, నేను పత్రిక నిర్వహణకు పూనుకున్నాము. ఇది 1970 తరువాతి మాట. కొన్నాళ్ళ తరువాత మళ్ళీ సూర్యనారాయణ పత్రికను మద్రాసు తీసుకు వెళ్ళారు. అక్కడ కూడా ఎక్కువ రోజులు నడవలేదు.

రామనాథన్ భారత హేతువాద ఉద్యమంలో ఆద్యుడు. రష్యా కూడా పర్యటించారు. ఎంతో శ్రమకు ఓర్చి ఉద్యమాన్ని నడిపారు. ఆయనతో సన్నిహిత సంబంధం ఉండటం గర్వకారణం. ఈయన హేతువాద ఉద్యమ సారధి.

*

# జి. డి. పరేఖ్ - ఇందుమతి పరేఖ్





**మా**నవ ఉద్యమానికి, ఎం.ఎన్.రాయ్ భావాల ప్రభావానికి అంకితమైన దంపతులు పరేఖ్ జంట.

జి.డి.పరేఖ్ వున్నన్ని నాళ్ళు ఇందుమతి పరిశీలిస్తూ పోయింది. అప్పట్లో జి.డి.పరేఖ్ రాడికల్ డెమోక్రటిక్ పార్టీ భాష్యకారుడుగా, సుప్రసిద్ధ వక్తగా పేరొందాడు. వేదిక మీద అనర్గళంగా మాట్లాడుతుంటే పక్కన రాయ్ వుంటే చూస్తూ, జోక్‌లు వేస్తూ, ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య పరేఖ్ వీనుల విందు చేసేవాడని ఎలవర్తి రోశయ్య, ఆవుల గోపాల కృష్ణమూర్తి చెప్పారు. ఎప్పుడైనా రాయ్ ముఖం చిట్లిస్తే ఠపీమని పరేఖ్ ఆపేసేవాడట.

అప్పట్లో నాకు ఆయన తెలియదు. తరువాత డెహ్రాడూన్ స్టడీ క్యాంపులో 5 రోజులు కలసి వున్నాం. ఆ క్యాంప్‌కు ఢిల్లీ నుండి రైలులో వెడుతుండగా ఒకే కంపార్ట్‌మెంట్‌లో యాదృచ్ఛికంగా కలిశాం. పక్కనే వి.బి.కర్నిక్ కూడా ఉన్నారు. కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళాం. 5 రోజుల స్టడీ క్యాంప్‌లో పరేఖ్ ఎన్నో సందర్భాల్లో చర్చలో పాల్గొన్నారు. ఆరితేరిన ప్రసంగకర్తగా రాయ్ వికేంద్రీకరణ సిద్ధాంతాలను విడమరచి చెప్పాడు. వినడానికి ఎంతో బాగున్నా ఆచరణ సాధ్యం కాదనిపించింది.

ఎం.ఎన్.రాయ్ ఇంట్లో (13 మోహినిరోడ్) చివరి రోజున సోషల్ గెట్ టుగెదర్. అందరికీ కాక్ టైల్స్ కలిపి గౌరి, ఇందుమతి అందిస్తుంటే, వివిధ ప్రాంతాలవారు వారి వారి తీరులో అనుభవాలు జోక్‌లు చెప్పారు. పరేఖ్ అందర్నీ నవ్వించాడు. నేను, మల్లాది రామమూర్తి, గుత్తికొండ నరహరి ఉన్నాం. రామమూర్తి తాగడు. ఆరోజు మొహమాట పెట్టగా ఆయనా స్వీకరించాడు. సంతోషించాం.

ఆ ఇంట్లో రాయ్‌తో తాను గడిపిన రోజులు గుర్తుకు తెచ్చుకొని తార్కుండే కళ్ళంట నీళ్ళు పెట్టాడు.

పరేఖ్‌ను తరువాత బొంబాయిలో కలిసేవాడిని. ఆయన యూనివర్సిటీ రెక్టార్‌గా పనిచేస్తూ జనరల్ ఎడ్యుకేషన్ పై పుస్తకం రాశారు.

లక్ష్మణ శాస్త్రి జోషి మరాఠీలో రాసిన పుస్తకాన్ని ఇంగ్లీషులోకి 'ది క్రిటిక్ ఆఫ్ హిందూయిజం' అని అనువదించారు పరేఖ్. దానిని నేను తెలుగులో రాసి 'ప్రసారిత'లో ప్రచురించాను. తిలక్ సిద్ధాంతాలను కొన్నింటిని సమర్ధిస్తూ పరేఖ్ రాసిన వాటిని ఎ.బి.షా 'హ్యూమనిస్ట్ వే' లో వేశారు. 'రాడికల్ హ్యూమనిస్ట్'లో పరేఖ్ వ్యాసాలు వచ్చేవి.

ఆయన అనంతరం ఇందుమతి పరేఖ్ బొంబాయి పేదల గుడెంలలో సామాజిక సేవ ఆరంభించింది. ఆమె డాక్టర్.

హ్యూమనిస్ట్ వుద్యమంలో దీక్షగా పనిచేసి సంఘసేవ ప్రాధాన్యతను చూపింది. స్త్రీల సమస్యలు ముందుకు తీసుకువచ్చింది. ఆమె సేవల దృష్ట్యా హ్యూమనిస్ట్ హీరోయిన్‌గా రూపొందినది.

బొంబాయిలో ఆమె ఇంట్లో జరిగిన చిన్న సమావేశాలలో పాల్గొన్నాం.

హైదరాబాద్‌లో మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించింది. కోమల, ఇందుమతి, గౌరి కలిసి పాత హైదరాబాద్‌లో షాపింగు చేసేవారు.

ఆంధ్రలో ఇందుమతి అనేక పర్యాయాలు పర్యటించింది. ఎం.ఎస్.రాయ్ జీవిత చరిత్ర నా తెలుగు అనువాద ఆవిష్కరణ తెలుగు యూనివర్సిటీలో ఆమె చేసింది.

బొంబాయిలో ఇందుమతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవవాద సమావేశాలు జయప్రదంగా జరిపింది.

నేను వాషింగ్టన్‌లో వుండగా మహిళా కార్యక్రమాల పథకాలు చర్చకు ఆమె వచ్చింది. అక్కడ కలుసుకొని చర్చించాము. మానవవాద సంఘ


నాయకురాలుగా కార్యకర్తల్ని ఉత్సాహపరచింది. ఆమె ఆచరణ వాది. పెద్ద రచయిత్రి కాదు. ఉపన్యాసకురాలు కాదు. కాని అంతర్జాతీయ మానవవాదులు ఆమె కార్యక్రమాలు తిలకించి, మదర్ థెరెసాను కాదు, ఇందుమతిని గుర్తించాలి అన్నారు.

'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ అన్ బిలీఫ్'లో ఇందుమతి గురించి నేను రాశాను. ఎడిటర్ టాంప్లిన్ కోరికపై అలా చేశాను.

❊

## అసాధారణ వ్యక్తితో ఎన్‌కౌంటర్

# జేమ్స్ రాండి



**చై**నా ప్రభుత్వం ఆయన్ను ఆహ్వానించి తమ దేశంలో ప్రబలివున్న మూఢ నమ్మకాలకు విరుగుడు చెప్పమన్నది. శ్రీలంకలో నిప్పులపై నడచాడు. కొరియా వెళ్ళి పాఠాలు చెప్పాడు. ప్రపంచ పర్యటనలో అనేక మందిని ఎదుర్కొని శాస్త్రీయత చూపాడు.

పుట్టింది కెనడాలో. నయాగరాను అదృశ్యం గావించి ఆశ్చర్యపరచిన మాంత్రికుడు. ఖగోళశాస్త్ర సంఘం ఆయన శాస్త్రీయ సేవలకు గుర్తింపుగా ఒక అస్టరాయిడ్‌కు ఆయన పేరు పెట్టారు.

ఆయనే జెమ్స్ రాండి.

80వ పడిలో అమెరికాలోని ఫ్లొరిడా రాష్ట్రంలో ప్లాంటేషన్ వద్ద కేంద్రం నెలకొల్పి, అనేక మందికి శిక్షణ యిస్తున్నారు. అలాంటి జేమ్స్ రాండితో చిరకాలంగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపినా, అమెరికాలో ఆయనను రెండు పర్యాయాలు కలిసి, మాట్లాడడం గొప్ప అనుభవం. ఇటీవల జరిగిన అంతర్జాతీయ సైన్స్, రీజన్ సమావేశాల్లో మూడు రోజులపాటు జేమ్స్ రాండితో కలసి వుండడం గర్వకారణం. ఆయన అనుభవాల పుట్ట. మ్యాజిక్ గని, మతం, అంతర్జాతీయం, మార్గాంతర చికిత్సల పేరిట జనాన్ని మోసం చేస్తున్న వారి గుండెల్లో గుబులు పుట్టించాడు.

భారతదేశం నుండి లోగడ కీ॥శే॥ అబ్రహం కోవూర్, సుప్రసిద్ధ స్కెప్టిక్ బసవ ప్రేమానంద్ (కోయంబత్తూరు) జేమ్స్ రాండికి పరిచితులు. ఆ కోవలో

యిటీవల నేను చేరాను. అమెరికా సమావేశాల్లో కలిసినప్పుడు, సాదరంగా ఆయన రచన నోస్ట్రడామస్ నాకు బహూకరించాడు. మన ప్రాంతంలో బ్రహ్మంగారి భవిష్యత్తు జోస్యం వలె, ఫ్రాన్స్‌లో జోస్యుడు నోస్ట్రడామస్ చెప్పినవన్నీ నిజం అవుతున్నాయని, ఇప్పటికే అవి సత్యాలుగా వున్నాయని నమ్మేవారున్నారు. ఆ గుట్టు రట్టు చేస్తూ జేమ్స్ రాండి వివరంగా గ్రంథం రాశాడు. వెయ్యి ఫ్రెంచి పద్యాలలో పొందుపరచిన అంశాలు విడమరచి, వాటిలో నిజం ఏమిటో తేటతెల్లం చేశాడు. ఫ్రాన్స్‌లో వైద్యుడుగా వున్న నోస్ట్రడామస్ చెప్పిన జోస్యాలు నిజం కావని, పదాలు విరిచి పెడర్థాలు కల్పిస్తున్నారని పేర్కొన్నాడు. అతడి జ్యోస్యాలు ఏవీ నిజంకాలేదని స్పష్టం చేశాడు. అదొక పరిశోధనాత్మక వివరణ.

మనదగ్గర కీ.శే. అబ్రహాం కోవూర్, బసవ ప్రేమానంద్, విక్రమ్, సనాల్ ఎడమరుకు, నరేంద్ర నాయక్, మొదలైనవారు మ్యాజిక్ ద్వారా హేతువాదాన్ని, శాస్త్రీయ పద్ధతిని ప్రజలలో ప్రచారం చేస్తున్నట్లే, అమెరికాలో జెమ్స్ రాండీ, జో నికిల్, మానవ వాదాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకు వస్తున్నారు. వీరందరినీ నేను ఏదో ఒక సందర్భంలో కలిశాను. ఇటీవల అమెరికా వెళ్ళినప్పుడు మళ్ళీ జెమ్స్ రాండీ, జో నికిల్‌ను కలసి వారి అనుభవాలను పంచుకున్నాను.

భారతదేశానికి రావలసిందిగా జేమ్స్ రాండిని ఆహ్వానించాను. ఖర్చులు పెట్టుకుంటే వస్తానని, యూనివర్సిటీలలో ప్రదర్శనా పూర్వక ఉపన్యాసాలు పెడితే మంచిదన్నారు.

ప్రపంచ మ్యాజిక్ చరిత్రలో మలుపులు తిప్పిన జేమ్స్ రాండిని తట్టుకోలేక, ఫిలిప్పైన్స్‌కు చెందిన ఎలక్స్ ఆర్బిటో పారిపోయాడు. ఆయనే సైకిక్ సర్జరీ పేరిట సంపన్నులను దోచిన వ్యక్తి. హైదరాబాద్ రాగా జేమ్స్ రాండి నమూనాలో ఆయన మోసం బయటపెట్టాం.

అలాగే క్రైస్తవ మతబోధకులు, టెలిఇవాంజలిస్టు ప్రవక్తలు జేమ్స్ రాండి చేతిలో ఖంగుతిని గుంజిళ్లు తీశారు. అమెరికాలోని జ్యోతిష్యాన్ని మట్టిగరిపించి, అదంతా మోసం అని రాండి చూపాడు. అదంతా ఫెయిత్ హీలర్స్ పేరిట గ్రంథస్తం చేశాడు.

ఆయన చూపిన అద్భుత మ్యాజిక్ అంశాలలో నయాగరా జలపాతంను అదృశ్యం చేయడం చెప్పుకోతగ్గది. లోగడ కొందరు తాజ్‌మహల్‌ను అదృశ్యం చేసినట్లు చూపారు. ఇది గొప్ప ఆశ్చర్యకర కనికట్టు విద్య.

ఇజ్రాయిల్ మాంత్రికుడు యూరిగెల్లర్ దూరంనుండే చూపుతో చెంచాలను వంచడం, విరిచేయడం వంటివి ఎంత మోసపూరితాలో జేమ్స్ రాండి చూపాడు. అంతటితో అతడు అమెరికా నుండి పారిపోయి, ఇంగ్లండ్‌కు పరిమిత మయ్యాడు. ఇలాంటివి జేమ్స్ రాండి కీర్తిలో చాలా వున్నాయి.

ఇండియా నుండి అమెరికా వెళ్ళి మహేష్ యోగితో విభేదించి, అశాస్త్రీయ రచనలు ఆకర్షణీయంగా రాసి, కీర్తి నార్జించిన దీపక్ చోప్రా పట్ల జేమ్స్ రాండి తీవ్ర విమర్శలు చేశారు.

## జేమ్స్ రాండీ సవాల్?

అతీంద్రియ శక్తులు, కొన్ని మార్గాంతర చికిత్సలు, జ్యోతిష్యం, ప్రార్థనలతో నయం చేసే విధానాలు, సైకిక్ సర్జరీ, దెయ్యాలు గాలిలో తేలటం, పిరమిడ్ శక్తి, ఆక్యూపంక్చర్, సంఖ్యాశాస్త్రం, హస్త సాముద్రికం, దూర దర్శనం, దూర శ్రవణం, చూపుతో వస్తువులను కదిలించటం, తాకి నయం చేయటం, శాస్త్రీయ మని రుజువు పరిస్తే ఐదు కోట్ల రూపాయలు గెలుచుకోవచ్చని జెమ్స్ రాండీ 1964లో వెయ్యి డాలర్ల పందెంతో చాలెంజ్ ప్రారంభించారు. తరువాత దీనిని పెంచి మిలియన్ డాలర్లు చేశారు.

1964 నుండి 82 వరకు 650 మంది దరఖాస్తులు పెట్టారు. 1997 నుండి 2005 వరకు 352 మంది దరఖాస్తులు పెట్టారు. అయితే ఇందులో నిలువలేక కొట్టివేసినవి, విరమించుకొన్నవి, చెల్లనివి పోగా 53 మాత్రం ఇంకా మిగిలి ఉన్నాయి. వీటిలో మరొక 20 మూసి వేయటానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంతవరకూ ఏ ఒక్క దరఖాస్తు దారు పరీక్షలో నెగ్గలేదు. ప్రథమ దశలో పాటించవలసిన నియమాల దాకా కూడా రాలేదు. ఒక దశలో ఈ ఛాలెంజ్‌ను ఇక నిలిపివేద్దామను కున్న రాండీ, దీన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

కొన్ని నమ్మకాలకు ఈ ఛాలెంజ్ అన్వయించదు. అదేంటంటే ఆధ్యాత్మిక, మతమపరమైన నమ్మకాలు, పునర్జన్మ, దేవుడు, ఆత్మ ఈ పరీక్షలోకి రావు. అలాగే ఆహారం, నీరు లేకుండా బ్రతకగలను అనే గొప్పలను గురించి కూడా ఈ ఛాలెంజ్ పట్టించుకోదు.

కొందరు ఛాలెంజ్ పేరిట చెబుతున్న ఐదు కోట్ల రూపాయలు (డాలర్లలో) నిజంగా ఉన్నదా అని సందేహించకపోలేదు. దీనికి సమాధానంగా గోల్డ్ మన్ సాక్స్‌లో బాండ్స్ రూపేణా ఇవి ఉంచబడ్డాయి. దీనిని ఏవరైనా నిర్ధారించుకోవచ్చు. జెమ్స్ రాండీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జమాఖర్చులు, పబ్లిక్‌గా తెలుసుకోవచ్చు. పన్నుల మినహాయింపులో ఈ సంస్థ ఉన్నది. ధనాన్ని గురించిన వివరాలకు వెబ్ http://www.gs.com చూడవచ్చు.

దరఖాస్తు ఎవరైనా పెట్టవచ్చు. ఎక్కడి నుండైనా పెట్టవచ్చు. వెబ్ సైట్ నుండి దరఖాస్తును స్వీకరించవచ్చును. విపరీతమైన శక్తులు ఉన్నాయని చెప్పుకునే వారు వాటిని నిరూపించుకునే బాధ్యతకూడా స్వీకరించాలని గుర్తు పెట్టుకోవాలి. ఇంకా వివరాలకు http://www.randi.org వెబ్ చూడవచ్చు.

సుప్రసిద్ధ క్రైస్తవ మత ప్రచారకులైన పోపోవ్, డబ్ల్యూ గ్రాంట్ వంటి వారి

రహస్యాలు బయటపెట్టిన తర్వాత, హోమియోపతి శాస్త్రీయం కాదని సవాలు చేశారు. మనదేశంలో సైంటిస్టు పి.ఎం. భార్గవ వలె, జెమ్స్ ర్యాండీ కూడా శాస్త్రీయత లేని ఆ వైద్యాన్ని ఖండించారు. ఫ్రాన్స్‌లో కొందరు సైంటిస్టులమంటూ బయలుదేరి హోమియో శాస్త్రీయమని రుజువు పరిచామని, ల్యాబరేటరీలో, రోగులపైనా పరిశోధనలు చేసి రుజువులు ఏర్పరిచామని, ఫలితాలను సుప్రసిద్ధ సైన్స్ పత్రికను పంపారు. ఆ పత్రిక వారు ప్రచురించిన అనంతరం అనుమానం వచ్చిసైంటిస్టులతో కూడిన ఒక సంఘాన్ని ఏర్పరిచి, జేమ్స్ ర్యాండిని జతపరచి పంపారు. సైంటిస్టులు పట్టుకోలేని మోసాలను జేమ్స్ రాండి సులభంగా కనిపెట్టి బైటపెట్టగలిగాడు. అంతటితో ఫ్రెంచ్ హోమియో వైద్యులు క్షమాపణ చెప్పారు. ఇప్పటికి రాండి ప్రకటించిన ఐదు కోట్ల సవాలు అమలులో ఉన్నది.

80వ ఏట జేమ్స్ రాండి మానవ, హేతువాదాన్ని, ప్రచారాన్ని చేస్తూ యువతను ప్రోత్సహిస్తూ, శిక్షణా తరగతులను నడుపుతూ, ఉపన్యాసాలూ ఇస్తూ ఎందరికో ప్రేరణ కలిగిస్తున్నారు. ఆయన సరదాగా, చమత్కారంగా మాట్లాడతారు. హాస్య ప్రియులు. సుప్రసిద్ధ సైంటిస్టులతో ఆయన సన్నిహితంగా ఉంటారు. అలాంటి వ్యక్తితో పరిచయం కావటం గొప్ప అనుభవం. ప్రపంచ ప్రసిద్ధ పత్రికలు ఆయన వ్యాసాలను ప్రచురించాయి.

## నిప్పులపై నడక

**జే**మ్స్ రాండీ బయటపెట్టిన అనేక మ్యాజిక్ రహస్యాలలో నిప్పులపై నడక ఒకటి. ఆయన సిలోన్‌లో మొదలు పెట్టి అనేక సందర్భాలలో మండే నిప్పుకణా లపై నడచి, అది మానవ సాధ్యమేనని చూపారు. ఇదే విషయంలో కొందరు సాధువులు, మాంత్రికులు, నిప్పులపై నడచి, అది ఒక అద్భుతంగా చాటి, గిట్టు బాటు వ్యాపారంగా చేసుకున్నారు. అంతేకాక దీని వెనుక మతపరమైన,

దైవ పరమైన శక్తి ఉన్నదని, అమాయకులను భ్రమపెట్టారు. డబ్బు వసూలు చేశారు. అది అంతా బూటకమని, ఎవరైనా ప్రాక్టీసు చేస్తే నిప్పులపై నడక మామూలు విషయంగా చూపవచ్చునని జేమ్స్ ర్యాండీ నిరూపించాడు.

అగ్నిగుండం ఏర్పరచినప్పుడు సర్వసాధారణంగా బొగ్గులు వాడతారు. కట్టెలు కూడా పెడతారు. అలా కాల్చిన వాటిపై కాసేపటికి బూడిదపొర కమ్ముతుంది. అందువలన సెగ తొందరగా తగలకుండా ఆపుతుంది. నడిచినప్పుడు అరికాలికి నిప్పుకణాలకి మధ్య ఈ బూడిద పొర చాలా వరకు తొడ్పడుతుంది. అంటే మండే కణాలనుండి సెగ రావడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయంలో నడక పూర్తి కావడం జరిగిపోతుంది. అయితే అగ్నిగుండంలో ఇనుప ముక్కలు లేకుండా చూచుకోవాలి. మేకులు ఉంటే అవి కాలి తొందరగా శరీరాన్ని కాల్చేస్తాయి. కనుక తగు జాగ్రత్త తీసుకోవాలి. ఇదే హెచ్చరికను జెమ్స్ రాండీ చేశాడు.

ఉదాహరణకు కాలే పెనంపై చెయ్యి పెడితే వెంటనే సెగ అంటి అర చెయ్యి కాలుతుంది. అంతే సెగ ఉన్న ఓవెన్‌లో చెయ్యి పెడితే కాలదు. సెగ ఒకటే అయినప్పుడు ఈ తేడా ఎందుకు వస్తుంది. అంటే సెగ అంటడంలో తేడా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

1983లో శ్రీలంకలో జెమ్స్ రాండీ నిప్పులపై నడిచి తన మ్యాజిక్ అద్భుతాన్ని ప్రదర్శించాడు. ఆ తర్వాత ఆ విషయాన్ని చాలా సార్లు విడమర్చి చెప్పాడు. కొందరు నిప్పులపై నడిచినప్పుడు తాము మద్యపానం సేవించి ఆ మత్తులో నడుస్తామని చెప్పారు. కానీ మత్తుకి, శరీరం కాలటానికి సంబంధం లేదు. మత్తు లేకుండా నడచినా కాళ్ళు కాలవనీ జెమ్స్ రాండీ చూపాడు.


ఈ విషయంలో ఆధ్యాత్మిక కారణాలు చెప్పి జనాన్ని మభ్యపెట్టే వారిని జెమ్స్ ర్యాండీ ఖండించాడు. నిప్పులపై నడవటం అనేది అనేక దేశాల్లో ఉన్నది. ఇది ఒక మతాచారంగా కూడా చేస్తున్నారు. జపాన్, హవాయి మొదలైన చోట్ల కూడా ఈ సంఘటనలు జరిగాయి.

కేక్ తయారు చేయటంలో చక్కని ఉదాహరణ చూపవచ్చు. వివిధ వస్తువులలోకి వేడి ఎలా ప్రసరిస్తుందో ఇదొక చక్కని ఉదాహరణ. నాలుగు వందల డిగ్రీల వేడిలో కేక్ ఓవెన్‌లో బేక్ అవుతుంది. అక్కడ చెయ్యి పెట్టినా కాలదు. అలాగే అంత వేడిలో బేక్ అయిన కేక్‌పై చెయ్యి పెట్టినా కాలదు. అంతే వేడిగల పెనంపై చెయ్యి పెడితే కాలిపోతుంది. దీనిని బట్టి ఒకే వేడి దగ్గర వివిధ వస్తువులు వివిధ రీతులలో వేడిని ప్రసరింపచేస్తాయని అర్థమౌతుంది.

ఈ విధంగా వైజ్ఞానిక దృక్పథంతో ప్రతీ అద్భుతాన్ని, మ్యాజిక్ అంశాన్నీ వివరించవచ్చునని, జేమ్స్ రాండి అంటాడు. అలాగే అనేక ఆశ్చర్యకరమైన విషయాలను విడమరచి శాస్త్రీయ ధోరణిలో చెప్పాడు, రాశాడు. అందుకే అతడు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాడు. బూటకంతో జనాన్ని మోసం చేసి మభ్యపెట్టే వారిని బట్టబయలు చేశాడు. వైద్య, ఆరోగ్య రంగాల్లో, జ్యోతిష్యంలో, అతీంద్రియ శక్తులలో ఇలాగే చేసి చూపాడు.

*

# సమరేన్ రాయ్



ఇన్నయ్యతో సమరేన్ రాయ్

**2**005లో సమరేన్ రాయ్ బాగా వయసు మీరి ఉన్నప్పుడు నేను, నా ఫ్రెండ్ మురళీధర్ కవలడం జరిగింది. ఆయన మమ్మల్ని వాళ్ళింటికి అల్పాహార విందుకు ఆహ్వానించడం జరిగింది. మేము ఆయనతో ఫోటోలు తీసుకున్నాము. సమర్ నాతో చాలా రోజులు టచ్‌లో వుండేవారు. ఆయన అమెరికన్ కన్సూల్ ఆఫీసులో పనిచేసి 1950 ప్రాంతాలలో రిటైర్ అయ్యారు. ఆయన ఎమ్.ఎన్.రాయ్ అభిమాని. ఎమ్.ఎన్.రాయ్ యువకుడుగా వున్నప్పుడు ఆయన మీద చాలా పరిశోధనలు చేశారు. 'రాడికల్‌గా ఎమ్.ఎన్.రాయ్', 'కమ్యూనిస్టుగా ఎమ్.ఎన్.రాయ్' మీద రెండు పుస్తకాలు ముద్రించారు. ఎమ్.ఎన్.రాయ్ భారత దేశపు ప్రథమ కమ్యూనిస్ట్. అంతే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీ సంస్థాపకుడుగా 1920 ప్రాంతాలలో తాష్కెంట్ నుండి విడదీశారు. ఎమ్.ఎన్.రాయ్‌ని అవిశ్రాంత బ్రాహ్మణుడుగా సమరన్ వర్ణించారు. నేను ఎమ్.ఎన్.రాయ్. మొదటి భార్య ఎవిలిన్ ట్రెంట్ జీవితచరిత్ర పరిశోధన ముద్రించినపుడు సమరేన్ రాయ్ అబ్బుర పడి దాని ప్రతిని కావాలని అడిగారు. 1925లో ఆయన యూరోప్ నుంచి తిరిగి వచ్చారు. అప్పటివరకు ఎవిలిన్ రాయ్ జీవితంలో ముఖ్యపాత్ర పోషించింది. దీనికి సమరేన్ కూడా అంగీకరించారు. ఎమ్.రాయ్ పుట్టిన తేదీ విషయంలో శిబ్ నారాయణ్ రే, సమరేన్ రాయ్‌లకు బేధాభిప్రాయాలున్నాయి. సమరేన్ రాయ్ తరచు అమెరికాకు వెళ్ళి అక్కడ టెక్సాస్‌లో ఉన్న బెంగాలీ సంస్థలతో సంబంధాలు కొనసాగించేవారు. నాకు ఎమ్.ఎన్.రాయ్ గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు సమరేన్ చెప్పారు. ఆయన్ని కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. 2007లో ఆయన మరణించారు. ఆయనతో ఉన్న ఫోటో నా దగ్గర ఉన్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను.

*

హ్యూమనిస్ట్, స్టంట్ పిక్చర్స్ నిర్మాత

# జె.బి.హెచ్ వాడియా



(1908-1986)

**వా**డియా వారి నాడియా వాల్ పోస్టర్లు నేను ఇంటర్ చదివే రోజులలో (1954) గుంటూరులో ప్రచారంలోకి వచ్చాయి. అదో పెద్ద ఆకర్షణ 1935లో హంటర్ వాలీ, 1936లో మిస్ ఫ్రాంటియర్ మెయిల్ సినీమాలు వచ్చినా ఇరవై ఏళ్ళ తరువాతనే ఆంధ్ర నగరాలలో అవి తెరపైకి వచ్చాయి. వాల్ పోస్టర్లలో నాడియా బొమ్మ ప్రధానంగా ప్రదర్శించారు. నల్ల కళ్ళజోడు పెట్టుకొని, టైట్ పాంట్‌తో, హంటర్ పట్టుకున్న పోస్టర్లు యువకుల్ని ఆకట్టుకున్నాయి. హీరోయిన్ నాడియా గుర్రంపై స్వారీచేస్తూ, రైలు పక్కనే పోతూ, హఠాత్తుగా గుర్రం పైనుండి రైలు మీదకు దూకి, రైల్లోని విలన్‌ను కొట్టి, మళ్ళీ గుర్రంపై దూకి స్వారీ చేస్తుంది. అదంతా ప్రేక్షకుల్ని సీట్లలో కూర్చోనివ్వకుండా వున్న థ్రిల్ దృశ్యాలే, అంత సక్సెస్, డబ్బు బాగా వచ్చింది.

విఠలాచార్య స్టంట్ సినిమాలు రాక ముందు 30 ఏళ్ళకే హిందీ స్టంట్ సినిమాలు వచ్చాయి. ఆనాడు నాడియా సినిమాలు విద్యార్థుల్ని, యువతను గంగ వెర్రు లెత్తించాయి.

1943 నాటికి నాడియా మౌజ్ సినిమాలో ఉద్విగ్న పూరిత హీరోయిన్‌గా నటించింది. హీరోయిన్ విదేశస్తురాలు. ఆమె తొలి భారత హీరోయిన్‌గా స్టంట్ సినిమాలలో నటించింది. ఆ తరువాత ఇండియాలో స్థిరపడి, పెళ్ళి చేసుకున్నది.

దీనంతటికీ జె.బి.హెచ్. వాడియా (జెంషెడ్ బొమర్జీ హోమి) పాత్ర కీలకమైనది. ఆయన స్టూడియోస్ బొంబాయిలో మూవీటోన్స్ పేరిట ఉన్నవి. ఆస్ట్రేలియా నుండి 5 ఏళ్ల ప్రాయంలో తండ్రితో బాటు ఇండియాకు వచ్చిన నాడియా ప్రతిభను గుర్తించి, సినిమాలలో ప్రవేశపెట్టిన ఖ్యాతి వాడియాదే.

నాడియా క్రమేణా వాడియా కుటుంబానికి చేరువై, అతని సోదరుడిని పెళ్ళి చేసుకోవాలను కున్నది. కానీ అతని తల్లి సనాతన పార్సీగా అందుకు అంగీకరించలేదు. 1960 వరకు వేచి వుండి ఆమె మరణానంతరం నాడియా వాడియాను పెళ్ళి చేసుకున్నది.


ఎం.ఎన్.రాయ్ అనుచరుడుగా సన్నిహితుడుగా రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన వాడియా, తనను 'రాయిస్టు' అని చెప్పకొనే వాడు. రాయ్‌తో తన అనుబంధాన్ని గురించి, 'రాయ్ ది మాన్' అనే శీర్షికతో చక్కని చిన్న గ్రంథం రాశాడు. ఈ పుస్తకాన్ని భారత రాష్ట్రపతి హిదయతుల్లా ఆవిష్కరించారు.

ఎం.ఎన్.రాయ్ అభిమానిగా వాడియాతో నేను సంబంధాలు పెట్టుకొని, హైదరాబాద్‌కు ఆహ్వానించాను. ఆయన రాగా సమావేశాలు పెట్టాం. తన అనుభ వాలను ఆసక్తికరంగా చెప్పారు. అబిడ్స్ సెంటర్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ ఆఫీసు ఉండేది. అక్కడే మీటింగు జరిగింది. అబ్బూరి రామకృష్ణారావు, ఎ.ఎల్. నరసింహారావు, ఆవుల సాంబశివరావు, జాస్తి జవహర్ లాల్, ఎన్.కె. ఆచార్య, ఎ.ఎస్.వడ్వాల్కర్, ఆలపాటి రవీంద్రనాథ్, ఆలంఖుద్‌మిరి మొదలైన వారంతా ఆసక్తిగా పాల్గొన్నారు. అదొక మంచి అనుభూతి.

వాడియా హ్యూమనిస్ట్ కావడంతో సినిమాలలో స్టంట్‌లు థ్రిల్స్ తప్ప మూఢనమ్మకాలు రానివ్వలేదు.

ఆ తరువాత బొంబాయి స్టూడియోలో ఎం.ఎస్.రాయ్‌పై డాక్యుమెంటరీ తీశారు. ఆయన కుమారుడు స్టూడియో కృషికొనసాగిస్తున్నారు. వాడియా తన అనుభవాలతో ఎం.ఎస్.రాయ్‌పై మంచి పుస్తకం రాశారు. వి.బి.కర్నిక్, వి.ఎం. తార్కుండే, జి.డి.పరేఖ్, ఇందుమతి, జి.ఆర్.దల్వి, ఎ.బి.షాలతో వాడియా సన్నిహితంగా వుండేవారు.

'కాసా డా వించి' బొంబాయిలో ఆయన నివాసం పేరు. రాయ్ దంపతులు ఎప్పుడు బొంబాయి వచ్చినా అక్కడే వుంటూ, వాడియా ఆతిథ్యం పొందేవారు. ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటం బొంబాయి వెళ్లినప్పుడల్లా కలవడం మంచి అనుభవం. సినిమాలలో మతపరమైన మూఢనమ్మకాలు ప్రవేశపెట్టకుండా జాగ్రత్తపడిన సినీ నిర్మాత అతను. ఎమ్.ఎన్.రాయ్‌కి సంబంధించిన అరుదైన ఫొటోలు అతని దగ్గర ఉన్నవి. ఆయన కుమారుడు రాయ్‌పై డాక్యుమెంటరీ తీయాలనుకునే సంకల్పం అప్పట్లో ఆచరణలోకి రాలేదు.




## నాడియాతో నా పరిచయం

1950 ప్రాంతాల్లోని యీ అనుభవాలు, తరువాత 1970 ప్రాంతాల్లో నెమరు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. జె.బి.హూమి వాడియాతో పరిచయమైంది. ఆయన ఎం.ఎన్.రాయ్ శిష్యుడు. అదే మా యిరువురినీ దగ్గరకు చేర్చింది.

1970 ప్రాంతాలలో బొంబాయిలో జె.బి.హెచ్ వాడియా ద్వారా నాడియాను చూచాను. అప్పటికే ఆమె సినిమాలలో నటించడం ఆపేసింది. కాని చదువుకునే రోజుల నుండీ ఆమెను చూడాలని, వీలైతే మాట్లాడాలనే ముచ్చట తీరింది.

నాడియా అసలు పేరు మేరీ ఆన్ ఎవాన్స్. ఇండియాలో పెట్టుకున్న పేరు నాడియా. గ్రీస్ దేశస్థురాలు తల్లికి, ఆస్ట్రేలియన్ తండ్రికి పుట్టిన మేరీ ఆన్ ఎవాన్స్ ఐదేళ్ళ ప్రాయంలో ఇండియా వచ్చింది. తండ్రితోబాటు నేటి పాకిస్తాన్ సరిహద్దులలో గుర్రపుస్వారీ నేర్చి, బ్యాలే డాన్స్‌లో తర్ఫీదు అయి, జర్కో సర్కస్‌లలో పనిచేసింది. 1930 ప్రాంతాలలో వాడియా దృష్టిలో పడగా, ఆమెను ఆహ్వానించి, హీరోయిన్‌గా రూపొందించాడు.

'ఏక్ నన్హి మున్నిలడికి' అనే సినిమాతో 1970 నుండీ సినీరంగానికి స్వస్తి పలికింది. పార్సీ కుటుంబంలో స్థిరపడింది. సౌమ్యంగా మాట్లాడేది. 1996లో చనిపోయింది.

*

# సుశీల్ ముఖర్జీ



సుశీల్ ముఖర్జీతో ఇన్నయ్య

**క**లకత్తాలో ఉన్న మినర్వా అసోసియేట్స్ ప్రచురణ సంస్థ వ్యవస్థాపకుడు సుశీల్ ముఖర్జీ. ఆయన జయప్రకాష్ నారాయణ్, నిరద్ ధారా, వి.ఆర్.నార్ల వంటి ప్రముఖుల రచనలను ముద్రించేవారు. ఆయన కలకత్తా బుక్ ఫెయిర్‌కి సంస్థాపక అధ్యక్షుడు. సుశీల్ ముఖర్జీ ఎమ్.ఎన్.రాయ్ ఆలోచనా స్రవంతికి విశ్వసనీయమైన అనుచరుడు.

1970 ప్రారంభంలో నాకు వారితో పరిచయం కలిగింది. వెంటనే నేను ఆయనను హైదరాబాదుకు రమ్మని ఆహ్వానించాను. ఆయన అంగీకరించారు. నేను ఆయనను శ్రీ నార్ల వెంకటేశ్వర రావుగారికి (ఆంధ్రజ్యోతి వ్యవస్థాపక సంపాదకులు) పరిచయం చేశాను. నార్ల వారి ఇంట్లో మేము అనేకసార్లు కలుసుకున్నాము. సుశీల్ నార్లవారి వ్యక్తిత్వానికి, ఆలోచనా సరళికి ఎంత ముగ్ధులయ్యారంటే నార్లవారి పుస్తకం 'గాడ్స్ గోబ్లిన్స్ అండ్ మెన్' అనే పుస్తకాన్ని వెంటనే ప్రచురించడానికి సంకల్పించారు.

నార్లవారు కొన్ని సందర్భాల్లో వెలిబుచ్చిన హేతువాద ఆలోచనలూ, కొన్ని సూక్తులతో రూపొందించిన పుస్తకం అది. అది బాగా అమ్ముడు పోయి పాఠకులలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సంబంధించిన నా పుస్తకం కూడా ప్రచురిస్తానని సుశీల్ అన్నారు. కానీ నేను అప్పటికే వేరే ప్రచురణకర్తల ద్వారా పుస్తకాన్ని వెలువరించాను. అప్పటి నుండి మేము పరస్పరం ఉత్తర ప్రత్యుత్తరాలతో కలుస్తూనే ఉన్నాం.

నిరంజన్‌ధర్ వ్రాసిన 'వేదాంత అండ్ బెంగాల్ రినైసాన్స్' అనే పుస్తకం సుశీల్ ప్రచురణలన్నింటిలో అత్యంత వివాదాస్పద రచనగా పేరుపొంది సంప్రదాయ హిందూ సమాజంలో ప్రకంపనలు సృష్టించింది. నేను ఆ పుస్తకాన్ని వివేకానందుడికి సంబంధించిన ఉచిత సమాచారం కోసం ఉపయోగించాను. 'ఉదయం' దినపత్రికలో ప్రచురించబడ్డ నా రచనలు కూడా వ్యతిరేకతను వివాదాల్ని మూటగట్టుకున్నాయి.

సుశీల్ జయప్రకాశ్ నారాయణ్ రచించిన 'వికేంద్రీకృత సిద్ధాంతాన్ని' వెలుగులోకి తెచ్చారు.

హైదరాబాద్‌లో నేను సుశీల్‌కి అనేకమంది హేతువాద, మానవతావాద మిత్రుల్ని పరిచయం చేశాను.

బుక్‌లింక్స్ అధినేత కె.జి.సుబ్రహ్మణ్యం సుశీల్‌గారి పరిచయానికి ఎంతో సంతోషించి ఆయనతో ఎడతెగని సంబంధాన్ని ఏర్పరచుకున్నారు.

చాలాకాలం తర్వాత నేను కలకత్తా వెళ్ళి సుశీల్‌గారి పరిచయానికి ఎంతో సంతోషించి ఆయనతో ఎడతెగని సంబంధాన్ని ఏర్పరచుకున్నారు.

చాలాకాలంతర్వాత నేను కలకత్తా వెళ్ళి సుశీల్‌గారిని వారియింట్లో కలుసుకున్నాను. అప్పటికే ఆయన అనారోగ్యంతో ఉన్నారు. చక్రాల కుర్చీకి అంకితమై ఉన్నారు. సుశీల్ పొగత్రాగేవారు. చక్కని సంభాషణా చతురుడు. ఆయన మాకు ఆతిథ్యమిచ్చి తాను కొత్త యింటికి మారుతున్నట్లు చెప్పారు. అప్పుడు ఇసనాక మురళీధర్ నాతో ఉన్నారు. ఆయన మాకు కొన్ని ఫోటోలు తీశారు. సుశీల్‌ను నేను కలవటం అదే చివరిసారి. ఆయన 2007లో మరణించారు.

*

# నేను కలిసిన మరికొందరు మానవవాదులు

**ఇబన్ వారక్ :**

నేను కలిసిన వారిలో పేర్కొనదగిన పండితుడు రచయిత ఇబన్ వారక్. ఆయన భార్యా సమేతంగా సమావేశాలలో పాల్గొన్నారు. నెమ్మదిగా మాట్లాడతారు. ఆయన ఉపన్యాసాలు విషయ ప్రధానంగా వుంటాయి. ఆయన భార్య లూసీ కూడా వెంట వున్నది. ఆమె బ్రిటన్ రచయిత్రి. చిన్న పిల్లలకు పుస్తకాలు రాస్తుంది.

ఇబన్ వారక్ అసలు పేరు కాదు. ఆయన ముస్లిం కావడం, ముస్లింల మూఢనమ్మకాలపై అశాస్త్రీయతపై, కొరాన్ ఇస్లాం మీద తీవ్ర విమర్శ చేసినందున పేరు మార్చుకున్నాడు. భద్రతకోసం అడ్రసు చెప్పరు. అతను రాసిన తొలి గ్రంథం 'నేనెందుకు ముస్లింగా ఉండలేకపోతున్నాను?' అనే పుస్తకాన్ని ఇంగ్లీషు నుండి నేను తెలుగులోకి అనువదించి ప్రచురించాను. అది ఇ-బుక్‌గా లభిస్తున్నది కూడా. అందుకు అతను చాలా సంతోషించాడు. ఆ తరువాత ఫ్రెంచి తదితర భాషల అనువాదాలు వచ్చాయి. శాస్త్రీయ పరిశీలనా కేంద్రం పక్షాన అనేక పుస్తకాలు సంకలనం చేసి పరిష్కరించి ప్రచురించాడు. ముస్లింలు స్త్రీల పట్ల చూపే వివక్షత చాలా విపులంగా రాశాడు. ఆయన్ను 1994లో మొదటిసారి వాషింగ్టన్‌లో కలిశాను. అప్పటినుండి శాస్త్రీయ పరిశీలనా కేంద్ర సభలలో కల్సుకున్నప్పుడు అనేక విషయాలు చర్చించుకొనేవాళ్ళం. సుప్రసిద్ధ పత్రికలలో కూడా చర్చలలో పాల్గొన్నాడు. భారతదేశానికి వచ్చి చూడాలని, పర్యటించాలని ఆసక్తి కనబరిచాడు. ఆయన తొలుత దేశం నుండి వెళ్ళిపోయినప్పుడు ఫ్రాన్స్‌లో కొన్నాళ్ళు ట్రావెల్ ఏజెంట్‌గా పనిచేశారు. తరచు యూరోపు దేశాలు పర్యటిస్తుంటారు.

**టామ్ ఫ్లిన్ :**

నేను సభలలో కలిసిన ప్రముఖ సంపాదకుడు రచయిత ఉపన్యాసకుడు టామ్ ఫ్లిన్. ప్రస్తుతం అతను 'ఫ్రీ ఇంక్వైరీ' పత్రికకు ఎడిటర్‌గా ఉన్నారు. నాకు చిరకాలంగా సన్నిహితంగా తెలుసు. నా వ్యాసాలు 'ఫ్రీ ఇంక్వైరీ' పత్రికలో కొన్ని ప్రచురించారు. ఆయన బఫెలోలోని శాస్త్రీయ పరిశీలనా కేంద్రంలో పనిచేస్తారు. ఎన్నో సందర్భాలలో ఇరువురం కలిసి సభలలో పాల్గొని చర్చలు చేశాం. రోచెస్టర్‌లో ఇంగర్‌సాల్ మ్యూజియం ప్రారంభించినప్పుడు నేను, ఆరమళ్ళ పూర్ణ చంద్రరావు

ఆయన్ను కలుసుకున్నాము. అక్కడ స్టేట్ అని ఒక వీధికి, చర్చ్ అని ఒక వీధికి పేర్లు ఉన్నాయి. వాటి మధ్య మేమంతా నిలిచి, సెక్యులరిజం అంటే స్టేట్‌ను చర్చిని విడిగా చూడటం అని అర్థం వచ్చేటట్లు, సింబాలిక్‌గా చూపాము.

టామ్ ఫ్లిన్ హాస్య ప్రియుడు, వక్త, మంచి ఎడిటర్. 'న్యూ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ అన్ బిలీఫ్' అనే బృహత్తర గ్రంథాన్ని ఎడిట్ చేసి రెండు భాగాలుగా ప్రచురించాడు. అందులో ఆయన కోరికపై నాలుగు వ్యాసాలు భారతదేశానికి సంబంధించినవి రాశాను. దేశ మానవవాద హేతువాద నాస్తిక ఉద్యమాలకు సంబంధించిన వ్యాసం ప్రముఖంగా ఉన్నది. అమెరికా సభలలో నేను ప్రసంగించిన సమావేశంలో ఆయన పాల్గొని శ్రద్ధగా విన్నారు. అలాగే బఫెలో కేంద్రంలో కూడా భారతదేశాన్ని గురించి మాట్లాడినప్పుడు ఆయన అధ్యక్షత వహించి సభ నిర్వహించారు. మంచి ఆర్గనైజర్. చాలా కష్టపడి పనిచేస్తారు. ఆయనతో పరిచయం చక్కని అనుభవం. శ్యామ్ హేరిస్, రిచర్డ్ డాకిన్స్, క్రిస్టోఫర్ హిచిన్స్‌లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికి నాకు తోడ్పడ్డారు.

*

# రామ్ సింగ్ ఎ.కె. ముఖర్జీ

రామ్‌సింగ్, ఎ.కె.ముఖర్జీలు ఢిల్లీలో వుంటూ వుద్యమానికి తోడ్పడ్డారు. 'థాట్' పత్రిక నడిపారు. అందులో చక్కని మానవవాద విషయాలు అందించారు. అమెరికన్ ఎంబసీతో సంబంధాలు వీరికి వుండేవి. ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లో అశోక్ హోటల్‌లో కలిసి చిన్న యిష్టాగోష్ఠి జరుపుతుండేవారు. అక్కడే వీరిని కలిశాను. 'థాట్'కు నేనూ కొన్ని రచనలు రాశాను. డి. ఆంజనేయులుగారి వలన వీరు పరిచయం కాగా సన్నిహితులయ్యారు.

## సి.టి.దరు

సి.టి.దరు అహమ్మదాబాద్‌లో అడ్వొకేట్‌గా వుంటూ, రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమంలో పనిచేశారు. సంఘాధ్యక్షులుగా దేశపర్యటన చేసి, సభలు సమావేశాలలో, స్టడీకాంపులలో పాల్గొన్నారు. నెమ్మదిగా గంభీరంగా మాట్లాడే వారు. ఆయన్ను ఆంధ్ర పర్యటనకు తీసుకు వచ్చినప్పుడు నేను కొన్ని చోట్లకు వెంట వెళ్లాను, కారంచేడులో సభ జరిపాం. బాగా మాట్లాడారు.



*

# BIO-DATA
## INNAIAH NARISETTI

| | | |
|---|---|---|
| DATE OF BIRTH | : | October 31, 1937 |
| PLACE OF BIRTH | : | PATHA REDDYPALEM, Chebrolu, Guntur District, Andhra Pradesh, India. |
| ACADEMIC | : | M.A., (Philosophy), Osmania University, Ph.D., (Philosophical Consequences of Modern Science), Osmania University. |
| PRESENTLY | : | AUTHOR & FREELANCE JOURNALIST from 1982 |
| POSITIONS | : | ‘’ CO- EDITOR “Prasarita” - A Telugu Quarterly in Social Sciences 1972-75. CHIEF REPORTER & SPECIAL CORRESPONDENT - to Andhra Jyothi, Telugu Daily 1975-81.<br>PRESIDENT - A.P. Chapter of Indian Academy of Social Sciences, Hyderabad 1988-90.<br>PRESIDENT - A.P. Rationalist Association, 1991-93.<br>SECRETARY - Indian Radical Humanist Association, Andhra Pradesh, 1992-94.<br>GENERAL SECRETARY - Indian Rationalist Association, 1994-96.<br>VICE PRESIDENT - Rationalist Association of India from 1996.<br>CO-ORDINATOR - FARA, AP - Federation of Atheist, Rationalist, Humanist Associations, A.P. 2003-2005.<br>GENERAL SECRETARY - Indian Radical Humanist Association, 2005-2007.<br>CHAIRMAN : Center for Inquiry- India, 2006 onwards. |

## BOOKS IN ENGLISH

NEW ENCYCLOPEDIA OF UNBELIEF (2008) (article on unbelief in India). LET SANITY PREVAIL, India, 2007.

FORCED INTO FAITH : HOW RELIGION ABUSED RIGHTS OF CHILDREN, Prometheus Books, USA, 2009.

ENCYCLOPEDIA OF UNBELIEF (Six Articles) Prometheus Books, USA, 2007. M.N. ROY - RADICAL HUMANIST, Prometheus Books, USA, 2005. M.N.ROY- PHOTO ALBUM, Rationalist Voice Publications, 2003.

A CENTURY OF POLITICS IN ANDHRA PRADESH, Rationalist Voice Publication!, Hyderabad, 2002.

M.N. ROY, EVELYN, ELLEN : A BIBLIOGRAPHY, Booklinks Corporation, 1996.

EVELYN TRENT ALIAS SHANTI DEVI Booklinks Corporation Hyderabad 1995.

BETWEEN CHARISMA AND CORRUPTION - A.P. Politics, 1991.

SAFFRON STAR OVER ANDHRA PRADESH - A Study of Contemporary Andhra Politics, Booklinks Corporation, Hyderabad, 1984.

THE PHILOSOPHICAL CONSEQUENCES OF MODERN SCIENCE Booklinks Corporation, Hyderabad, 1982.

THE BIRTH & DEATH OF POLITICAL PARTIES IN INDIA Booklinks Corporation, Hyderabad, 1982.

POLITICS FOR POWER - A Study of Contemporary Andhra Pradesh Politics, Scientific Services, Hyderabad, 1982.

STATE GOVERNMENT & POLITICS - A study of A.P. Politics 1885-1985, Scientific Services, Hyderabad.

INSIDE ANDHRA PRADESH - Booklinks Corporation Hyderabad, 1980.

DEPRESSED GROUP STUDENTS - ( Co-author Dr. C. Lakshmanna), College Book House, Trivendrum, 1977.

TRADITION & MODERNITY IN TELUGU & URDU LITERATURE. (Co-Editor Dr. Alam Khundmiri), 1969.

# BOOKS IN TELUGU

UNDER THE DISGUISE OF TRUTH, EVERYTHING IS FRAUD 2008.

LIE HUNTING LEADING TO TRUTH : Collection of Essays, 2005.

LIFE OF M.N. ROY, 2001 (Serialised in Vaartha - Telugu Daily)

SAHITI PARULATO SARASAALU

(Encounter with Literary and Journalist Friends 2008)

CHILD ABUSE BY RELIGIONS, 2000.

FRAUDULENT ALTERNATIVE MEDICINES, 1998.

LIE-HUNTING, A COLLECTION OF ESSAYS, 1995.

MONOGRAPH ON TERRORISTS, 1995.

20TH CENTURY ENEMIES OF HUMANITY, 1992.

WILL THERE BE RENAISSANCE IN INDIA? 1989.

LIFE AND THOUGHTS OF NARLA VENKATESWARA RAO, 1987.

CASTE POLITICS IN ANDHRA PRADESH, 1984.

OUR POLITICS - FROM KHADI TO SAFFRON, 1983.

ANDHRA PRADESH : GOVERNMENT & POLITICS, 1983 &1991.

NO MATTER WHICH POLITICAL PARTY, THEIR CULTURE IS ONE, 1982.

MARX AND MARXISM, 1976.

HOW THE COMMUNISTS ECLIPSED KARL MARX, 1976.

FROM RAMMOHAN ROY TO M.N. ROY, 1973.

SOCIAL GROUPINGS & RELATIONSHIPS, 1972.

PHILOSOPHY & COMMON SENSE, 1971.

GROUPISM & SPLITS IN ANDHRA PRADESH POLITICS, 1970.

EVOLUTION OF POLITICS IN ANDHRA PRADESH, 1970.

INDEPENDENCE STRUGGLE IN ANDHRA PRADESH (Co-author Prof. M.Venkatarangaiah) 1972.

POLITICAL PARTIES IN ANDHRA PRADESH.

## TRANSLATIONS FROM ENGLISH TO TELUGU

GOD DELUSION - Richard Dawkins.

GOD IS NOT GREAT - Christopher Hitcherre.

LETTER TO CHRISTIAN NATION - Sam Harris.

BLASPHEMY - Justice Raghavendra Jahagirdar - R.V. Publications

SECULARISM - Justice Raghavendra Jahangirdar - R.V. Publications

AFFIRMATIONS - Paul Kurtz - CFI India.

LIVING WITHOUT RELIGION - Paul Kurtz (RV Publications)

THE TRUTH ABOUT THE GEETA - V.R. Narla (Hema Publications)

WHY I AM NOT A MUSLIM - Ibn Warraq (Hema Publications)

INDIA IN TRANSITION - M.N. Roy (Indian Council of Historical Research)

ARTICLES - A.B. Shah (Anupama, Vijayawada)

KALA POORNODAYAM - G.V. Krishna Rap (Serialised in Golkonda Patrika, Telugu Daily - 1963) Ph.D. Thesis on Aesthetics.

THE COURAGE TO BECOME - HUMANIST VIRTUES - Paul Kurtz (Hema Publications)

OCHRE ROBE - Agehananda Bharati.

IN FREEDOM'S QUEST - M.N. Roy's Life Part 1,2- Sibnarayan Ray (Telugu University).

HAMD DALWAI - Muslim Politics

LAXMAN SASTRI JOSHI - Critique of Hinduism

## TELUGU ACADEMY PUBLICATIONS

PARTIES, POWER & POLITICS - M.N. Roy.

RUSSIAN REVOLUTION - M.N. Roy.

REVOLUTION & COUNTER REVOLUTION IN CHINA - M.N. Roy.

REASON, ROMANTICISM & REVOLUTION - M.N. Roy.

M.N. ROY, A POLITICAL BIOGRAPHY - V.B. Karnik

STRIKES IN INDIA - V.B. Karnik.

INDIAN TRADE UNIONS - V.B. Karnik.

ISLAMIC PHILOSOPHY - Dr. Alam Khundmiri

SCIENTIFIC METHOD - A.B. Shah.

GREAT TRADITION AND LITTLE TRADITIONS - Agehananda Bharathi.

RURAL SOCIOLOGY IN INDIA - A.R. Desai.

JUSTICE JAGANMOHAN REDDY'S BOOKS

MINORITIES & THE CONSTITUTION

A CONSTITUTION - WHAT IT IS & WHAT IT MEANS

WE HAVE A REPUBLIC - CAN WE KEEP IT?

OUR GOVERNORS; LAW AND SOCIETY

THE UNIVERSITY I SERVED.

## CONTRIBUTIONS IN MAGAZINES

**ENGLISH**

American Atheist, Free Inquiry, Washline, American Rationalist, Indian Rationalist, Radical Humanist, Secularist, Rationalist Voice, Indian Skeptic.

**TELUGU DAILIES**

Andhra Patrika, Andhra Prabha, Andhra Jyothi, Golconda Patrika, Eenadu, Udayam, Vaartha,Surya

**TELUGU PERIODICALS**

Prajavani, Vahini, Telugu Vidyarthi, Prajatantra, Sameeksha, Radical Humanist, Vikasam, Hetuvadi, Suprabhatam, Prasarita, Manava Vikasam, Swetchalochana, Misimi, New Humanist

**CONTRIBUTIONS THROUGH ELECTRONIC MEDIA**

Produced Documentaries and moderated discussions on Humanist-Rationalist themes through All India Radio, Doordarshan, TV9, ETV-2, Free Radio, TV-USA, TVS.

**AWARDS & HONOURS**

ATA Siromani Award (USA) 1992.

TANA Humanist-Journalist Award (USA) 1997

Greater Washington Telugu Association, 1999

Delaware Valley Association, 1998

New York Telugu Association 1998

Alayasri Award, Karimnagar

Library of Congress, USA Listed 25 Books of Innaiah.

Participation in Humanist and Rationalist Activities In USA, Europe 1992-2008

Officiated Secular Marriages V.R. Narla dedicated his last Telugu play Narakam Lo Harischandra (Harischandra in Hell).

# FAMILY

| | |
|---|---|
| KOMALA VENIGALLA (Wife) | : Retired from Ambedkar Open University, Hyderabad, India as Professor of English.<br>TRANSLATED INTO TELUGU<br>SHODH of Taslima Nasrin<br>Ayaan Hirshi Ali's CAGED VIRGIN AND INFIDEL<br>M.N.Roy's MEMORIES OF CAT<br>Contributed Articles to Magazines, toured USA. |
| NAVEENA HEMANTH (Daughter) | : MD, Child Psychiatrist, Practicing in USA FEELINGS (Poems Published) |
| | : HEMANTH SAMSON (Son-in-Law) Works in'Telecommunications, USA. Singer and Musician |
| | : ROHIT SAMSON (First Grandson) Talent Student in USA. Interested in Science, Music. |
| | : RAHUL(Second Grandson) Loves Dancing and Singing, Student in School. |

RAJU NARISETTI (Son) : Managing Editor, Washington Post, Washington DC. Worked in Dayton Daily News, Wall Street. Journal Europe as Editor, Founder Editor of Mint Daily from Delhi Young Global Leader selected in 2007.

KIM NARISETTI (Daughter-in-Law)
Journalist and Writer.
Published Tourist Books, Children Books.
Worked in Dayton Daily News, Wall Street Journal, Street.
LEILA NARISETTI (First Grand Daughter) School Student
Model Girl, Appeared in International Magazines.

ZOLA NARISETTI (Second Grand Daughter) Appeared in Model Magazines, Studying in School.

Address : E-mail : hu92@aol.com.innaiahn@yahoo.com
Blog : http://naprapamcham.blogspot.com
www.centerforinquiry.net/india.
http://innaiahn.tripod.com